www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని
స్పీకర్‌ను ఎలా ఆదేశించగలం?

- ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని ఓటరు కోరవచ్చా?
- అనర్హతపై స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చనే అంశంపై ఒక్క తీర్పు అయినా ఉందా?
- పిటిషనర్‌కు హైకోర్టు ప్రశ్న.. విచారణ 1కి వాయిదా

12



శనివారం | 30-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 345 | హైదరాబాద్ సిటీ

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 9.15 తదుపరి షష్ఠి; నక్షత్రం: అనూరాధ రా. 10.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె.3.52-5.31; దుర్ముహూర్తం: ఉ.6.15-7.53; అమృతఘడియలు: ఉ.11.02-12.44; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 6.25

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భార్యాభర్తల మాటలు
వింటారా?




గత ప్రభుత్వానిది దుర్మార్గపు ఆలోచన

- ఇతరుల ఫోన్లు వింటే ఏమవుతుందని కేటీఆర్ మాట్లాడుతున్నారు
- అట్ల వింటే.. చర్లపల్లి జైల్లో చిప్పకూడు తినాల్సి వస్తుంది
- వారి మాట విని తప్పులు చేయొద్దని అధికారులను ఆనాడే హెచ్చరించాం
- మహబూబ్‌నగర్‌లో నన్ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర
- దేశానికే ఆదర్శంగా మా పాలన.. ఇతర రాష్ట్రాల వారు కితాబిస్తున్నారు
- వాల్మీకి బోయలతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- ఎన్నికలయ్యాక సంపత్‌కు పదవి ఇస్తామన్న సీఎం

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. వారికి ఓట్లు వేసి అధికారాన్నిచ్చిన ప్రజలనే భయపెట్టిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఎవరు ఏమి మాట్లాడుకుంటున్నారో వినేందుకు పోలీసులను పెట్టి ఫోన్ ట్యాపింగ్‌లు చేయించిందన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకునేవి కూడా వినాలన్న దుర్మార్గమైన ఆలోచన గత ప్రభుత్వానిదని మండిపడ్డారు. "కొద్దిమంది ఫోన్లు వింటే ఏమవుతుందని కేటీఆర్ మాట్లాడుతున్నడు. మంది సంసారాల్లో వేలు పెట్టి చూసే పనేంటి ఆయనకు? సిగ్గున్నోడు ఎవడైనా ఇట్ల బరితెగించి మాట్లాడతాడా? వింటే ఏమైతదది.. చర్లపల్లి జైల్లో చిప్పకూడు తినాల్సి వస్తది" అని సీఎం రేవంత్ అన్నారు. ఊర్లలో తిరిగే ఆవారాగాళ్లు, తాగుబోతులు, తిరుగుబోతులే ఇలాంటి మాటలు మాట్లాడతారని, కేటీఆర్ కూడా బరి తెగించిన వాడిలా, అచ్చోసిన ఆంబోతులా మాట్లాడుతున్నారని, దాని ఫలితం దానికి ఉంటుందని హెచ్చరించారు. కాకపోతే క్రమపద్ధతిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాల్మీకి బోయలతో

మిగతా 13వ పేజీలో...



గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న వాల్మీకి బోయ ప్రతినిధులు

నిందితులపై టెలిగ్రాఫ్ చట్టం

- దేశంలోనే తొలిసారి ప్రయోగం.. ఇప్పటిదాకా ఏ రాష్ట్రమూ వాడలేదు
- కోర్టు అనుమతి కోరిన పోలీసులు.. ట్యాపింగ్ కేసులో రాధాకిషన్ అరెస్టు!
- ఫోన్లు ట్యాప్ చేసి ప్రైవేటు వ్యక్తుల ప్రొఫైల్స్ చేశాం
- ప్రభుత్వ వాహనాల్లో ఎన్నికల నగదు తరలించాం.. విచారణలో రాధాకిషన్
- 14 రోజుల రిమాండ్.. పోలీసు కస్టడీకి భుజంగరావు, తిరుపతన్న

14



చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్, సబిత, కాసాని జ్ఞానేశ్వర్

నన్ను పిచ్చోణ్ణి చేశారు

రంజిత్, మహేందర్‌రెడ్డి.. ఆస్కార్ స్థాయి నటులు

- పార్టీ మారబోమని నా ముందే లొల్లి పెట్టుకున్నారు
- కట్ చేస్తే.. 15 రోజుల్లోనే ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు
- 'పట్నం' వెన్నుపోటు వల్లే తాండూరులో ఓడిపోయాం
- కేకే, కడియం.. కష్టకాలంలో పార్టీని వీడి వెళ్తున్నారు
- పార్టీ మారుతున్న ద్రోహులకు ప్రజలే బుద్ధి చెప్తారు
- వాళ్లు కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. మళ్లీ రానివ్వం
- కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేసుకుంటాం
- 13న చేవెళ్లలో కేసీఆర్ సభను జయప్రదం చేద్దాం
- బీజేపీని ఆపే బలం స్థానిక పార్టీలకే ఉంది: కేటీఆర్
- పార్టీని వీడుతున్నది దొంగలు, ద్రోహులే
- బీఆర్ఎస్ కార్యకర్తలను ఎవ్వరూ కొనలేరు: హరీశ్

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్‌లోకి నేను పోతలేనంటే.. నేనూ పోతలేనని.. నేను మంచోడినంటే.. నేను మంచోడినని పరిగి సభలో పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి నా ముందే లొల్లి పెట్టుకున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీతల కన్నా ఎక్కువగా నటించారు. ఇద్దరూ కలిసి నన్ను పిచ్చోణ్ణి చేశారు. నేను కూడా వాళ్ల మాటలు నమ్మా.. ఇక చేవెళ్ల సీటు గెలిచినమనే అనుకున్నా. కానీ.. సీన్ కట్ చేస్తే 15 రోజుల వ్యవధిలోనే కాంగ్రెస్‌లో చేరి ఒకరు మల్కాజిగిరి, మరొకరు చేవెళ్ల సీటు తెచ్చుకున్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లబ్ధి పొందిన కొందరు నాయకులు.. కష్ట కాలంలో సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలా ద్రోహం చేసి వెళ్తున్న వారిని క్షమించబోమని, భవిష్యత్తులో

మిగతా 12వ పేజీలో...

కడియం జీ.. కాంగ్రెస్‌లోకి రండి!

- శ్రీహరి, కావ్యకు దీపాదాస్ ఆహ్వానం
- వరంగల్ నుంచి తండ్రా... కూతురా?
- నేడు అనుచరులతో కడియం భేటీ

13

తీర్థయాత్ర ముగిసింది..

సొంత పార్టీకి వెళ్తున్నా!

- కాంగ్రెస్ ఎంపీల పోరాటంతోనే తెలంగాణ వచ్చింది
- సోనియాకు మాటిచ్చి కేసీఆర్ పార్టీని విలీనం చేయలే: కేకే
- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మదన్‌రెడ్డి
- ఆయన వెంటే ఎలక్షన్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరిక ఖాయం



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, చిత్రంలో అరుణ

బీఆర్ఎస్ అవినీతిపై చర్యలేవీ?

- ఫోన్ ట్యాపింగ్ కేసులో చిత్తశుద్ధి లేదు
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి
- రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ: కిషన్‌రెడ్డి
- సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలి
- రూ.270కోట్ల బకాయిలు విడుదల చేయండి
- సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ లేఖ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ నాయకుల అవినీతిపై విచారణ చేయిస్తామని, వారి సంగతి చూస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే పార్టీ వారిని బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని తుకారాంగేట్‌లో ఏర్పాటు చేసిన కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో, మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఖాళీ అయిందని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్ పాపాల వల్లే
కరువు!

- దేవుడి పేరుతో కాళేశ్వరం నిర్మించి దోచుకున్నారు
- ప్రతిమ శ్రీనివాస్‌కు కాంట్రాక్టు కోసమే మూడో టీఎంసీ
- సచివాలయంలో కేటీఆర్ బావమరుదులకు ఐటీ కాంట్రాక్టు
- ఇంటింటికీ ఇంటర్‌నెట్ పేరుతో రూ.5వేల కోట్లు దోపిడీ
- ఫోన్ ట్యాపింగ్‌ను ఒప్పుకొన్న కేటీఆర్‌పై కేసు పెట్టాలి
- స్కామ్‌లన్నింటిలోనూ 'రావు'లే.. అందరూ జైలుకే
- మా పార్టీలోకి గేట్లు పగలగొట్టుకుని మరీ వస్తున్నారు
- ఇంకా 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు
- దానం నాగేందర్ అభ్యర్థిత్వంపై సమస్యలు రావచ్చు
- త్వరలో సినిమా థియేటర్లపై రైడ్స్: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలే ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకున్నాయని ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి కరువు కూడా కేసీఆర్ పాపాల వల్లనే వచ్చిందన్నారు. యాదగిరిగుట్ట పేరును యాదాద్రిగా మార్చడం కేసీఆర్ చేసిన మొదటి తప్పు అని, కాళేశ్వరం ప్రాజెక్టుకు దేవుడి పేరు పెట్టి.. దోచుకోవడంతోపాటు సర్వనాశనం



మిగతా 13వ పేజీలో...



మరో ఇద్దరు ఎంపీ అభ్యర్థులూ
జంప్?

- ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులు కాంగ్రెస్‌లో చేరిక
- పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలూ హస్తం గూటికి?
- చట్టపరంగా ఇబ్బంది ఉండని సంఖ్యలోనే!
- పార్లమెంటు ఎన్నికల్లోపే వస్తారంటున్న కాంగ్రెస్
- నేతలు దిగిపోతుండడంతో ఖాళీ అవుతున్న 'కారు'

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థులుగా ప్రకటించిన మరో ఇద్దరు నేతలు కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నారా? హస్తం పార్టీలోకి వెళ్లి అక్కడి నుంచి ఎన్నికల బరిలో నిలవనున్నారా? అంటే.. అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ఇప్పటికే చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన రంజిత్‌రెడ్డి

మిగతా 12వ పేజీలో...

కింకర్తవ్యం?

భవిష్యత్తు కార్యాచరణపై ఫాంహౌస్‌లో కేటీఆర్, హరీశ్‌తో కేసీఆర్ చర్చలు

కేసీఆర్ జిల్లాల పర్యటన

జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో రేపు పంట పొలాల పరిశీలన

12

రూ.1823 కోట్లు
కట్టండి

కాంగ్రెస్‌కు ఐటీ శాఖ తాఖీదులు

- 1993 నుంచి లెక్కలు తీసిన ఆదాయపు పన్ను శాఖ
- ఇది ట్యాక్స్ టెర్రరిజమేనన్న కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చాక అరాచక శక్తులపై చర్యలు
- మళ్లీ ఇలాంటి పనులు చేయకుండా బుద్ధి చెబుతాం
- ఇది నా గ్యారెంటీ: రాహుల్ గాంధీ
- బీజేపీకి రూ.4,600 కోట్ల జరిమానా వేయాలి: ఖర్గే
- నేడు, రేపు దేశవ్యాప్త నిరసనలకు పార్టీ శ్రేణులకు పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీపై ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మరో భారీ వేటు వేసింది. ఇప్పటికే రూ.270 కోట్ల మేర బ్యాంకుఖాతాల్ని స్తంభింపజేసి రూ.135 కోట్లను స్వాధీనం చేసుకున్న ఐటీ శాఖ.. శుక్రవారం మరో రూ.1,823 కోట్లు చెల్లించాలంటూ నోటీసులు పంపించింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది పన్ను ఉగ్రవాదమేనని అభివర్ణించింది. ఆదాయపన్ను శాఖ బీజేపీ అనుబంధ విభాగంలా పని చేస్తోందని విమర్శించింది. తాము అధికారంలోకి వచ్చాక తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఐటీ నోటీసులపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ.. ప్రతిపక్షం మీద మాత్రమే అన్యాయంగా వ్యవహరించేలా

మిగతా 2వ పేజీలో...



నేడు, రేపు బ్యాంకులు పనిచేస్తాయ్

ఎల్ఐసీ కార్యాలయాలూ..

2

భారత్‌లో రాజకీయ హక్కులకు
రక్షణ ఉందని భావిస్తాం

- ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని ఆశిస్తున్నాం
- కేజ్రీవాల్ అరెస్టుపై ఐరాస వ్యాఖ్య

ఐక్యరాజ్యసమితి, మార్చి 29: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి కూడా స్పందించింది. ఇంతవరకు జర్మనీ, అమెరికా దేశాలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా ప్రస్తుతం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ అధికార ప్రతినిధి స్పందించారు. భారత్‌లో అందరి రాజకీయ, పౌర హక్కులకు రక్షణ ఉందని, నిజాయితీ, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయగలుగుతారని ఆశిస్తున్నట్టు అభిప్రాయపడ్డారు. గురువారం జరిగిన రోజువారీ విలేకరుల సమావేశంలో సెక్రటరీ జనరల్ అధికార ప్రతినిధి స్టెఫానే డుజారిక్ ఈ వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల సందర్భంగా భారత్‌లో నెలకొన్న 'రాజకీయ అశాంతి'పై అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆ

మిగతా 2వ పేజీలో...

కేజ్రీకి మద్దతుగా రేపు ఢిల్లీలో సభ

హాజరు కానున్న రాహుల్, 13 పార్టీల నేతలు

2



ఢిల్లీలోని తన నివాసంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో భేటీ అయిన ప్రధాని నరేంద్ర మోదీ

అప్పుడే పుట్టిన పిల్లలూ ఏఐ అంటారు

నేటితరం చిన్నారులు చాలా అడ్వాన్స్‌డ్.. డీప్ ఫేక్ వినియోగంపై నియంత్రణ అవసరం

- మళ్లీ అధికారం చేపట్టిన వెంటనే
- గర్భాశయ క్యాన్సర్ టీకా అభివృద్ధికి నిధులు
- బిల్‌గేట్స్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- టెక్నాలజీని ప్రజలకు చేరువ
- చేయడంలో భారత్ భేష్: బిల్‌గేట్స్

న్యూఢిల్లీ, మార్చి 29 : నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భవిష్యత్తులో అప్పుడే పుట్టిన పిల్లలు కూడా ఏఐ(పసిపిల్లలు ఆయ్ అంటూ ఏడవడం) అని అంటారని పేర్కొన్నారు. నేటితరం పిల్లలు అన్ని విషయాల్లో అడ్వాన్స్‌డ్‌గా ఉంటున్నారని తెలిపారు. డీప్‌ఫేక్ సాంకేతికత వినియోగం విషయంలో కొన్ని నియంత్రణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్రంలో తమ

మిగతా 2వ పేజీలో...

మూడు నెలల్లో
16 వేల కోట్ల అప్పు

- 2024-25 తొలి త్రైమాసికంలో బహిరంగ మార్కెట్ నుంచి సేకరించనున్న రాష్ట్రం
- ఏప్రిల్, జూన్ నెలల్లో రూ.5 వేల కోట్లు చొప్పున, మేలో 6 వేల కోట్ల రుణ సేకరణకు ప్రణాళిక
- వివరాలు వెల్లడించిన ఆర్బీఐ
- 2024-25 బడ్జెట్‌లో రూ.59,625 కోట్ల రుణాల సేకరణకు సర్కారు ప్రతిపాదన

3

సిరియాపై ఇజ్రాయెల్ బాంబులు

42 మంది మృతి

మృతుల్లో హిజ్బుల్లా డిప్యూటీ కమాండర్

2

క్యాన్సర్ రోగుల్లో నొప్పి నివారణ ముఖ్యం

» ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ సదస్సులో ప్రముఖ వైద్య నిపుణులు.. కొత్త పరిశోధనల ఫలితాలపై చర్చ

హైదరాబాద్, మార్చి 29: క్యాన్సర్‌తో పోరాడుతున్న వ్యక్తుల జీవన నాణ్యతను మెరుగుపరచడానికి నొప్పి నివారణ, నిర్వహణ చాలా ముఖ్యమైనదని పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ విజయభాస్కర్ బండికట్ల అన్నారు. క్యాన్సర్ రోగుల్లో బాధకు పర్యాయపదంగా నొప్పి ఉండకూడదని ఆయన చెప్పారు. ఈ అంశంపై హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. క్యాన్సర్ రోగులకు నొప్పి నుంచి ఉపశమనం కలిగించడానికి, వారిలో కలిగే ఆందోళనను నివారించడానికి ఉన్న మార్గాలపై ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు చర్చించారు. డాక్టర్ బండికట్ల మాట్లాడుతూ దురదృష్టవశాత్తు క్యాన్సర్ రోగులు.. ముఖ్యంగా వ్యాధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్న వారు అధిక నొప్పిని అనుభవిస్తున్నారని తెలిపారు. కాబట్టి నొప్పిని తీవ్రరూపం దాల్చడానికి ముందే పరిష్కరించాలన్నారు. నొప్పి నిర్వహణ చురుగ్గా, సమగ్రంగా ఉండాలన్నారు. దీనికి ఇండో బ్రిటిష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్‌లో అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ సెంథిల్ మాట్లాడుతూ వైద్య శాస్త్రంలో అనేక పరిశోధనలు కొత్త ఆశను కలిగిస్తున్నాయని చెప్పారు. క్యాన్సర్‌కు శస్త్రచికిత్స సందర్భంలో జరిగే నరాలు, కణజాల నష్టం ద్వారా ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు కృషి జరగాలన్నారు. ఎంఎన్‌జే హాస్పిటల్ పాలియేటివ్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ గాయత్రి పాలట్ మాట్లాడుతూ క్యాన్సర్ కణితి తగ్గింపులో రేడియేషన్ థెరపీ ప్రభావవంతంగా ఉన్నా చుట్టుపక్కల కణజాలాలను దెబ్బతీయడం ద్వారా నొప్పిని పెంచుతోందన్నారు. న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల్లో దీర్ఘకాలిక నొప్పి నివారణకు అమర్చే పరికరాల గురించి వివరించారు. భవిష్యత్తులో రాబోయే క్యాన్సర్ చికిత్సా విధానాలపై ఒక నివేదిక అందించారు. క్యాన్సర్ పెయిన్ ట్రీట్‌మెంట్‌లో నిపుణుడైన డాక్టర్ బండికట్ల నేతృత్వంలో జరిగిన ఈ సెమినార్... నొప్పి నిర్వహణ వ్యూహాల్లో పురోగతి సాధించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

సిరియాపై ఇజ్రాయెల్ దాడి..42 మంది మృతి

టెల్ అవివ్, మార్చి 29: సిరియాపై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన గగనతల దాడుల్లో 42 మంది మరణించారు. అలప్పో ప్రావిన్స్‌లోని జిబ్రీన్‌లో ఉన్న లెబనాన్ ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు చెందిన ఆయుధ డిపోను, సమీపంలోని మిలటరీ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిగాయి. తెల్లవారు జామున యుద్ధ విమానాలు, డ్రోన్లు బాంబులు కురిపించడంతో 36 మంది సిరియా సైనికులు, ఆరుగురు హిజ్బుల్లా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో హిజ్బుల్లా డిప్యూటీ కమాండర్ అలీ అబెద్ అక్సాన్ నయీం కూడా ఉన్నారు. హెవీ వార్ హెడ్ రాకెట్లు ప్రయోగించడంలో ఆయన నిపుణునిగా పేరు పొందాడు. అంతకుముందు హిజ్బుల్లా దళాలు ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేయడంతో దానికి సమాధానంగా ఈ వైమానిక దాడులు జరిగాయి.

సత్యేందర్ జైన్‌పై సీబీఐ దర్యాప్తునకు అనుమతి

న్యూఢిల్లీ, మార్చి 29: ఆప్ సీనియర్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌పై సీబీఐ దర్యాప్తు జరిపేందుకు కేంద్ర హోం శాఖ అనుమతి ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరుగుతుందని శుక్రవారం అధికార వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన జైన్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. జైలునే ఉన్న ఆర్థిక నేరగాడు సుఖేష్ చంద్రశేఖర్ నుంచి లంచం తీసుకున్నట్టు వచ్చిన ఆరోపణలపై తాజా దర్యాప్తు జరగనుంది. జైలులో సౌకర్యాలు, రక్షణ కల్పిస్తానంటూ తన వద్ద రూ.10కోట్లు గుంజినట్టు సుఖేష్ చేసిన ఫిర్యాదుపై ఈ విచారణ జరగనుంది.

బెంగళూరు పేలుడు కేసులో నిందితుల ఆచూకీ చెబితే రూ.20లక్షలు


అబ్దుల్ మతీన్, ముస్సావీర్

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసు కీలక నిందితులుగా భావిస్తున్న వారి ఆచూకీ తెలిపితే రూ.20లక్షలు నజరానా ఇస్తామని ఎన్ఐఏ ప్రకటించింది. 'ఎక్స్'లో నిందితులు ఇద్దరి ఫొటోలు, వివరాలను శుక్రవారం పోస్టు చేసింది. ముస్సావీర్ హుసేన్ షాజిబ్ (30), అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా (30) ఆచూకీ చెప్పాలని కోరింది. వారి వివరాలను ప్రకటించింది. ఇద్దరి ఆచూకీ తెలిపితే తలా రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షల నజరానా ఇస్తామని ప్రకటించింది. ఆచూకీ తెలిపినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది. కాగా, బెంగళూరు రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసుకు సంబంధించి అనుమానిత ఉగ్రవాది ముజామిల్ షరీఫ్‌ను ఎన్ఐఏ అధికారులు గురువారం అరెస్టు చేశారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరు పరిచి, ఏడు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

మరో 28 లక్షలు చెల్లిస్తే .. రూ.35వేల పెన్షన్

» అధిక పింఛన్‌పై రిటైర్డ్ ఉద్యోగికి పీఎఫ్ సంస్థ సూచన

కోచి, మార్చి 29: అధిక మొత్తంలో నెలవారీ పింఛనును పొందాలంటే పెన్షన్ నిధికి అదనంగా చెల్లించాల్సిన మొత్తంపై ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) అఫిడవిట్ రూపంలో స్పష్టత ఇచ్చింది. నెలకు రూ.35,594 పింఛను రావాలంటే తాజా నిబంధనల ప్రకారం పెన్షన్ నిధికి అదనంగా రూ.28.29 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. కేరళ హైకోర్టులో తిరువనంతపురానికి చెందిన వి.ఆర్.బాలు అనే రిటైర్డు ఉద్యోగి వేసిన పిటిషన్‌కు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించింది. కేరళ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో పనిచేసిన ఆయన 2022లో పదవీ విరమణ చేశారు. అధిక పెన్షన్ కోసం చెల్లించాల్సిన అదనపు మొత్తాన్ని లెక్కించడంపై ఈపీఎఫ్ఓ సర్క్యులర్‌ను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు.

ముఖ్తార్ అన్సారీ మృతిపై జ్యుడీషియల్ విచారణ

లఖ్‌నవూ, మార్చి 29: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ మృతిపై బాందా జిల్లా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టు న్యాయ విచారణకు ఆదేశించింది. బాందా జైలులో శిక్ష అనుభవిస్తున్న ముఖ్తార్ గురువారం రాత్రి మృతిచెందాడు. అతను గుండెపోటుతో మరణించినట్టు జైలు అధికారులు, వైద్యులు ప్రకటించారు. ముఖ్తార్‌కు విషం ఇచ్చి చంపారని అతని సోదరుడు, ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్తార్ మృతిపై సీజేఎం భగవాన్ దాస్ గుప్తా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు.

రూ.1823 కోట్లు కట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఐటీ శాఖ మీద ఎవరు ఒత్తిడి తెస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రద్దు చేయటానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐలను దుర్వినియోగపరుస్తుందన్నారు. ఎటువంటి లెక్కలు, ఆధారాలు లేకుండా బీజేపీ సేకరించిన రూ.42 కోట్ల డిపాజిట్లపై ఐటీ శాఖ రూ.4,600 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని, కానీ ఆ పని చేయటం లేదన్నారు. అదే తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు డిపాజిట్ చేసిన రూ.14 లక్షల మొత్తంపైన మాత్రం రూ.132 కోట్ల జరిమానా కట్టాలని నోటీసులు పంపిందన్నారు. ఐటీ తాజాగా పంపించిన నోటీసుల తాలూకు వివరాలను ఖర్గే వెల్లడించారు. '1993-94 సంవత్సరానికి రూ.54 కోట్లు, 2016-17కి రూ.182 కోట్లు, 2017-18కి రూ.179 కోట్లు, 2018-19కి రూ.910 కోట్లు, 2019-20కి రూ.480 కోట్ల జరిమానా విధించారు' అని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ తన పూర్తి శక్తిసామర్థ్యాలతో పోటీ పడుతుందని, బీజేపీ నియంతృత్వం నుంచి దేశంలోని వ్యవస్థలను విడిపిస్తామని ఖర్గే పేర్కొన్నారు. ఐటీ తాజా నోటీసులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్న శక్తులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోసారి, ఇలాంటి పనులు చేయకుండా బుద్ధి చెబుతామని, ఇది తన గ్యారంటీ అని పేర్కొన్నారు. బీజేపీ టాక్స్ టెర్రరిజానికి పాల్పడుతోందన్నారు.

సీతారాం కేసరి కాలం నుంచి లెక్కలా?

ఐటీ నోటీసుల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, కోశాధికారి అజయ్ మాకెన్ ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీని ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసేందుకే ఈ నోటీసులు పంపారని విమర్శించారు.


మీడియాతో మాట్లాడుతున్న జైరాం రమేశ్, అజయ్ మాకెన్, పవన్ ఖేరా

ఇలాంటి నోటీసులకు తాము బెదరబోమని, మరింత దూకుడుగా ఎన్నికల్లో పోరాడతామని స్పష్టం చేశారు. తమ పార్టీ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తామని, తాము ప్రకటించిన హామీలను ప్రజలకు చేరవేస్తామని చెప్పారు. తమ పార్టీ కోశాధికారిగా సీతారాం కేసరి ఉన్నప్పటి కాలం నుంచి పన్నులను అక్రమంగా లెక్కిస్తున్నారని పేర్కొంటూ.. 1993 నుంచి 2020 వరకు బీజేపీ పాల్పడిన పన్ను ఉల్లంఘనలకు ఆ పార్టీపై రూ.4,600 కోట్ల మేర పన్ను విధించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మోసపూరిత ఆర్థిక కార్యకలాపాలను ఐటీ శాఖ పూర్తిగా విస్మరిస్తోందని, ఆ పార్టీకి నోటీసులు పంపటం, పార్టీ ఖాతాలను స్తంభింపజేయటం వంటి చర్యలేవీ తీసుకోవటం లేదని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సమయంలోనే కాంగ్రెస్ కార్యకలాపాలను అడ్డుకోవటానికి పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం ప్రారంభించారని.. ప్రకటనలు, ప్రయాణాలు, సిబ్బంది వేతనాలు తదితర ఖర్చులను నిలిపివేసి ఎన్నికల సమయంలో పార్టీని పూర్తిగా కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాగైతే ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా ఎలా జరుగుతాయని, అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయని జైరాం ప్రశ్నించారు. ఎన్నికల సంఘం మౌన ప్రేక్షక పాత్ర పోషిస్తోందని విమర్శించారు. ఐటీ చట్టం ప్రకారం రాజకీయ పార్టీలకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంటుందని, దీనిని బీజేపీకి మాత్రమే వర్తింపజేస్తూ కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలపైన మాత్రం ఐటీ శాఖను ప్రయోగిస్తున్నారని అజయ్ మాకెన్ దుయ్యబట్టారు. 'యడ్యూరప్ప డైరీలు, జైన్ డైరీలు, సహారా డైరీలు, బిర్లా డైరీలు, బీజేపీ మాజీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్‌కు విధించిన శిక్ష మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుని ఐటీ శాఖ బీజేపీపై చర్యలు ఎందుకు తీసుకోలేదు? దేశంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరపాల్సిన ఎన్నికల సంఘం ఎందుకు మౌనంగా ఉంటోంది? లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరుగుతాయని ఇక ఎవరైనా అనుకుంటారా?' అంటూ ప్రశ్నలు కురిపించారు.

దేశవ్యాప్త నిరసనలకు పిలుపు

ఐటీ నోటీసులపై శని, ఆదివారాల్లో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ తన అనుబంధ విభాగాలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో కార్యక్రమాలు జరపాలంటూ అన్ని పీసీసీలకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ లేఖ రాశారు. మరోవైపు, ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షంగా ఉన్న సీపీఐకి కూడా రూ.11 కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ఐటీ శాఖ నోటీసులు పంపించింది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	42.7	19.1
ఆదిలాబాద్	40.8	26.7
హైదరాబాద్	40.2	25.4
ఖమ్మం	39.0	26.0
సంగారెడ్డి	39.0	27.0
మహబూబ్‌నగర్	38.0	26.0

నేడు, రేపు పనిచేయనున్న బ్యాంకులు

» ఎల్ఐసీ కార్యాలయాలు కూడా

న్యూఢిల్లీ, మార్చి 29: ఈ ఆర్థిక సంవత్సరం(2023-24) చివరిలో ఈ నెల 29న గుడ్‌ఫ్రైడే, 31న ఆదివారం సెలవులు రావడంతో పన్ను చెల్లింపుదారులకు ఊరట కల్పిస్తూ రిజర్వు బ్యాంకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి సంబంధించిన చెల్లింపులు, వసూళ్లు జరిపే బ్యాంకులు సంబంధిత శాఖలను మార్చి 30, 31 తేదీల్లో(శని, ఆదివారాల్లో) తెరిచి ఉంచాలని రిజర్వు బ్యాంకు సూచించింది. ఈ రెండు రోజులు ప్రభుత్వ ఖాతాలకు సంబంధించిన చెల్లింపులు, వసూళ్లు చేసేందుకు సమర్పించే చెక్కులను క్లియర్ చేస్తారు. నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. అలాగే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) కార్యాలయాలూ మార్చి 30, 31 తేదీల్లో పనిచేయనున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్ను చెల్లింపుదారులు పన్ను తగ్గింపునకు పొదుపు చేసుకొనేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఐఆర్‌డీఏఐ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. తమ కార్యాలయాలు అధికారిక పనివేళల వరకు పనిచేయనున్నట్లు వెల్లడించింది.

భారత్‌లో రాజకీయ హక్కులకు రక్షణ ఉందని భావిస్తాం



(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో ఈడీ కేసులో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం, ఐటీ శాఖ కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడంపై విలేకరులు ఆ ప్రశ్న అడిగారు. స్టెఫానే స్పందిస్తూ "భారత్.. ఆ మాటకు వస్తే ఎన్నికలు జరిగే అన్ని దేశాల్లో.. ప్రతి ఒక్కరి పౌర, రాజకీయ సహా అన్ని హక్కులకు రక్షణ ఉంటుందని; స్వేచ్ఛగా నిజయితీగా జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసుకోగలుగుతారని ఎంతగానో ఆశిస్తున్నాం" అని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ అరెస్టుపై అసంతృప్తిని వ్యక్తం చేసే విధంగా అమెరికా వ్యాఖ్యానించగా అందుకు అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్ బుధవారం ఢిల్లీలోని ఆ దేశ దౌత్యాధికారిని పిలిపించి నిరసన తెలిపింది. అది జరిగిన గంటల్లోనే అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మ్యాథ్యూ మిల్లర్ స్పందించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహిస్తారని, సకాలంలో న్యాయ ప్రక్రియ జరుగుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ మాటలను బహిరంగంగానే చెప్పామని, ఇందుకు ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన పనిలేదని అన్నారు.

కేజ్రీవాల్‌కు మద్దతుగా రేపు ఢిల్లీలో బహిరంగ సభ

న్యూఢిల్లీ, మార్చి 29: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఇక్కడ విపక్షాల కూటమి 'ఇండియా' భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. రాంలీలా మైదానంలో ఈ సభ జరగనుంది. ఇందుకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా 13 పార్టీల నేతలు హాజరు కానున్నారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరేన్ భార్య కల్పనా సోరేన్, ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, శివసేన (ఠాక్రే) నాయకులు ఉద్ధవ్ ఠాక్రే, ఆదిత్య ఠాక్రే, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ, ఝార్ఖండ్ సీఎం చంపేయి రాయ్, తృణమూల్ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి తదితరులు ప్రసంగించనున్నారు. తానాషాహీ హటావో-లోక్‌తంత్ర బచావో (నియంతృత్వాన్ని పారదోలండి- ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) అన్న నినాదంతో ఈ మెగా ర్యాలీని నిర్వహించనున్నారు. కాగా, కేజ్రీవాల్‌కు ప్రజలందరి ఆశీర్వాదం కావాలని ఆయన భార్య సునీత కోరారు. సరికొత్తగా వాట్సాప్ ప్రచారాన్ని ప్రారంభించారు. "కేజ్రీవాల్ కోసం ప్రతి ఒక్కరూ 8297324624 వాట్సాప్ నంబరుకు మెసేజ్‌లు చేయండి" అని పిలుపునిచ్చారు.

దక్షిణాదికి డేంజర్ బెల్

» ప్రమాదకర స్థాయికి ప్రధాన డ్యామ్‌లు

» నిల్వ సామర్థ్యం కంటే 25% లోటు

» కేంద్ర జల కమిషన్ బులెటిన్ విడుదల

చెన్నై, మార్చి 29: దక్షిణ భారతదేశంలో ప్రధాన జలాశయాల నీటి మట్టాలు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని కేంద్ర జల కమిషన్ హెచ్చరించింది. తెలంగాణ-ఏపీ సరిహద్దుల్లోని నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లకు ప్రమాద ఘంటికలు మోగించింది. నీటి నిల్వ సామర్థ్యం కంటే సాగర్‌లో, శ్రీశైలంలో అధిక లోటు కనిపిస్తోందని కమిషన్ తన నివేదికలో హెచ్చరించింది. బెంగళూరును ఇప్పుడు అల్లాడిస్తున్న నీటి కరువు రానున్న కాలంలో దక్షిణాదిలోని మిగతా నగర ప్రాంతాలనూ తాకనున్నదని హెచ్చరించిన ఈ అధ్యయనం, కేరళలో మాత్రమే డ్యామ్‌లు నిర్దిష్ట జలప్రమాణాలతో ఉన్నాయని తెలిపింది. కర్ణాటక, తమిళనాడు, ఏపీ, తెలంగాణలో ప్రధాన డ్యామ్‌ల్లో నీటి నిల్వ సామర్థ్యం కంటే 25% లోటు నెలకున్నదని కమిషన్ వివరించింది. దీంతో, రానున్న నెలల్లో నీటికి తీవ్ర కొరత ఉంటుందేమోనన్న భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇక.. కర్ణాటకలోని తుంగభద్రలో ఐదు శాతం, తమిళనాడులోని మెట్టూరులో 30% మేర సామర్థ్యం కంటే లోటు కనిపిస్తోంది. గతేడాదితో పోల్చితే 17%, గత పదేళ్లతో పోల్చితే తొమ్మిది శాతం అధిక లోటు నమోదయిందని తెలిపింది. ఇక.. దేశమంతటా ఉన్న ముఖ్యమైన 150 డ్యామ్‌ల్లో సామర్థ్యం కంటే 38% లోటు నెలకొన్నదని పేర్కొంది. అయితే, దక్షిణాదితో పోల్చదగిన నీటి ఎద్దడి సమస్యలు తక్కిన భూభాగాల్లో కనిపించడం లేదని తెలిపింది. ఈమేరకు తన వారాంతర బులెటిన్‌ను కమిషన్ విడుదల చేసింది.

అప్పుడే పుట్టిన పిల్లలూ ఏఐ అంటారు



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తిరిగి ఏర్పాటైన వెంటనే గర్భాశయ క్యాన్సర్ నివారణకు అవసరమైన అధ్యయనానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ భేటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), భవిష్యత్ టెక్నాలజీ, మహిళా సాధికారత తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించే విషయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో భారత్ అనుసరిస్తున్న తీరును బిల్‌గేట్స్ ఈ సందర్భంగా ప్రశంసించారు. సాంకేతికతను ప్రజలకు చేరువచెయ్యడంలోనూ భారత్ తీరు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఏఐ గురించి మోదీ మాట్లాడుతూ.. దేశంలో చాలామంది అమ్మను ఆయ్(ఏఐ)ని పలుకుతారని, నేటి పరిస్థితులను చూస్తే పిల్లలు పుట్టిన వెంటనే ఏఐ(కృత్రిమ మేధ) అనేలా ఉన్నారని అన్నారు. ఏఐ గొప్ప సాంకేతిక పరిజ్ఞానమని పేర్కొన్న మోదీ.. ఆ సాంకేతికత వల్లే జీ20 సదస్సులో తన ప్రసంగం అనేక భాషల్లోకి సులువుగా అనువాదమైందని తెలిపారు. అదే సందర్భంగా డీప్ ఫేక్ టెక్నాలజీ వాడకంపై ప్రపంచం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో డీప్ ఫేక్‌ను ఎవరైనా స్వేచ్ఛగా వాడే వీలు ఉందన్నారు. డీప్ ఫేక్ కంటెంట్‌ను ఏఐ సృష్టిస్తున్న నేపథ్యంలో ఈ సాంకేతికత వినియోగం అంశంలో కొన్ని నియంత్రణలు తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. ఏఐను ప్రజలు ఓ సాధనంగా చూడాలని, ఆ సాంకేతికత వల్ల తప్పుదోవ పట్టకూడదని సూచన చేశారు. సాంకేతిక పరిజ్ఞానం దేశంలో అందరికీ అందుబాటులో ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంతోపాటు తగిన శిక్షణ ఇప్పించడం ద్వారా మహిళా సాధికారికత సాధించడం తన లక్ష్యమని ప్రధాని తెలిపారు. టెక్నాలజీ వినియోగంతో వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. కొవిడ్ సమయంలో కొవిన్ యాప్ ద్వారా వ్యాక్సినేషన్ ప్రక్రియను సులభతరం చేశామన్నారు. విద్యారంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచామని తెలిపారు. ఇక, వచ్చే ఎన్నికల తర్వాత కేంద్రంలో తమ ప్రభుత్వం తిరిగి ఏర్పాటైన వెంటనే గర్భాశయ క్యాన్సర్ అధ్యయనంపై దృష్టి పెడతామని, టీకా అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మోదీ ఈ సందర్భంగా ప్రకటించారు.

సమతామూర్తిని దర్శిస్తా

తమ స్వచ్ఛంద సంస్థ మహిళా సాధికారికత కోసం విశేష కృషి చేస్తుందని బిల్‌గేట్స్ తెలిపారు. హైదరాబాద్‌లోని సమతామూర్తి విగ్రహాన్ని త్వరలో సందర్శిస్తానని, ఆ సందర్భంలో కొన్ని మహిళా సంఘాలతో భేటీ అవ్వాలనుకుంటున్నానని బిల్‌గేట్స్ ప్రధాని మోదీతో చెప్పారు.

టెలికాంశాఖ పేరుతో ఫేక్ కాల్స్

న్యూఢిల్లీ, మార్చి 29: సైబర్ నేరగాళ్లు జనాల్ని బురిడీ కొట్టించేందుకు కొత్త దారులు వెతుకుతున్నారు. ఏకంగా టెలికాం శాఖ పేరుతో కాల్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కేంద్ర టెలి కమ్యూనికేషన్ (డీఓటీ) శాఖ మొబైల్ వినియోగదారులకు అడ్వయిజరీ జారీ చేసింది. కొందరు తమ డిపార్ట్‌మెంట్ పేరు చెప్పి కాల్స్ చేస్తున్నారని.. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినందుకు నంబర్ డిస్‌కనెక్ట్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపింది. 'టెలికాం శాఖ పేరు చెప్పి కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. విదేశీ మొబైల్ నంబర్ల (+92) నుంచి వాట్సాప్ ద్వారా కాల్ చేసి ప్రభుత్వ ఉద్యోగులమని నమ్మిస్తారు. వ్యక్తిగత సమాచారాన్ని తెలుసుకొని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విదేశాల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్ ఎత్తకండి' అని టెలికాం విభాగం అడ్వయిజరీలో పేర్కొంది. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. అలాగే సంచార్ సాథీ పోర్టల్ www.sancharsaathi.gov.in లో 'నో యువర్ మొబైల్ కనెక్షన్' ఆప్షన్ ద్వారా తమ పేరున ఇతర మొబైల్ నంబర్ కనెక్షన్ ఉంటే సరి చూసుకోవాలని, సంబంధం లేని నంబర్లు ఉంటే రిపోర్టు చేయాలని తెలిపింది. కాగా, సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో యూఎస్ఎస్‌డీ (అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డేటా) ఆధారిత కాల్ ఫార్వర్డింగ్ సేవలను ఏప్రిల్ 15 నుంచి నిలిపేయాలని టెలికాం ఆపరేటర్లకు టెలికాం విభాగం ఆదేశించింది.

రెండాకులకు కషాయం

డీఎంకేకు దీటుగా బీజేపీ వ్యూహాలు.. తమిళనాట పొత్తుల్లో కమలం దూకుడు

» అన్నాడీఎంకేకు ఎదురవుతున్న పెను సవాళ్లు

» గత చరిత్రకు భిన్నంగా రెండాకులు ఢీలా

(చెన్నై-ఆంధ్రజ్యోతి)



తమిళనాట జరగనున్న తొలివిడత లోక్‌సభ ఎన్నికల్లో పాలక పక్షం డీఎంకేతో పోటీపడేలా బీజేపీ వ్యూహ రచనలు చేసింది. డీఎంకే కూటమిలో పాతమిత్రపక్షాలే కొనసాగాయి. సినీనటుడు కమల్‌హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీదిమయ్యం పార్టీ ఆ కూటమిలో చేరినా దానికి సీట్లివ్వలేదు. ఆ పార్టీకి వచ్చే ఏడాది రాజ్యసభ సీటు కేటాయించేలా డీఎంకే ఒప్పందం చేసుకుంది. ఈమేరకు డీఎంకే కూటమి అభ్యర్థులకు కమల్ ప్రచారం చేయనున్నారు. డీఎంకేతో పోటీపడేలా వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో అన్నాడీఎంకే వెనకపడింది. డీఎంకే కూటమిని తలదన్నేలా మెగా కూటమిని ఏర్పాటు చేస్తామన్న పళనిస్వామి ప్రకటన కార్యరూపందాల్చలేదు. అదేసమయంలో బీజేపీ.. వన్నియార్ల ఓటు బ్యాంకు మెండుగా ఉన్న పాట్టాలిమక్కల్ కట్చితో పొత్తుపెట్టుకుంది. సినీనటుడు శరత్‌కుమార్ నాయకత్వంలోని సమత్తువ మక్కల్ కట్చి పార్టీని బీజేపీలో విలీనం చేసుకుంది. అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు దినకరన్, మాజీ సీఎం పన్నీర్‌సెల్వంలతోనూ బీజేపీ పొత్తుపెట్టుకుంది. ప్రధాని మోదీ సేలం సభలో పాల్గొనడానికి ముందే ఇవన్నీ జరిగాయి.

ఇక తమిళనాడు ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఎన్నిక ఏదైనా నిర్ణయాలు తీసుకోవడంలో అన్నాడీఎంకే ముందంజలో ఉండేది. పొత్తులు, మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు, ఏనియోజకవర్గాలు ఇవ్వాలి? అనే విషయాలపై అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, ఆయన రాజకీయ వారసురాలు జయలలిత వేగంగా నిర్ణయాలు తీసుకునేవారు. జయలలిత మరణం తర్వాత సీఎం అయిన పళనిస్వామి కూడా గత మూడేళ్లుగా ఆమెలాగే వేగంగా నిర్ణయాలు తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకుని పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కల్పించారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తువల్ల బీజేపీ 4 అసెంబ్లీ స్థానాల్లో గెలిచింది. ఆ తర్వాత పార్టీ పగ్గాలను చేపట్టడంలో చాకచక్యంగా వ్యవహరించారు. పార్టీలో ఏకనాయకత్వం అవసరమని, తానే ప్రధాన కార్యదర్శినంటూ సమన్వయకర్తగా వ్యవహరించిన పన్నీర్‌సెల్వంను దూరంగా పెట్టారు. పార్టీ వ్యవహారాల్లో, న్యాయ పోరాటాల్లో విజయం సాధించి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పార్టీపై ఆధిపత్యం సంపాదించుకోగలిగారు. అలాంటి ఆయన ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం పట్ల పార్టీ నేతలే దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకూటమి నుంచి వైదొలగే నిర్ణయం తీసుకున్న పళనిస్వామి లోక్‌సభ ఎన్నికల్లో వన్నియార్ల ఓటు బ్యాంక్ కలిగిన పీఎంకేతో పొత్తు కుదుర్చుకోవడంలో జాప్యంచేశారని చెబుతున్నారు. అదేసమయంలో బీజేపీ సుడిగాలిలా పీఎంకేను చుట్టేసింది. ఎక్కువ సీట్లిస్తామనే హామీతోపాటు అవసరమైతే అన్బుమణికి మంత్రి పదవిచ్చేందుకు సిద్ధమేనని ప్రకటించింది. దీం తో పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి బీజేపీ కూటమిలో చేరారు. ఈ పరిణామం పళనిస్వామికి దిగ్భ్రాంతి కలిగించింది. చిన్నాచితకా పార్టీలతో పొత్తును ఖరారు చేసుకున్న పళనిస్వామి డీఎండీకేను కూటమిలో చేర్చుకోవటంలో సఫలీకృతులయ్యారు. ఏపార్టీతో పొత్తు కుదుర్చుకోవాలో గురువారం చెబుతానన్న డీఎండీకే నాయకురాలు ప్రేమలతతో చర్చించి ఒకరోజు ముందే పొత్తుపెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే మెగా కూటములు తలపడాల్సి ఉండగా..బీజేపీ సృష్టించిన రాజకీయ తుఫానులో పరిస్థితులు మారాయి. ఈసారి డీఎంకే మెగా కూటమితో బీజేపీ మెగా కూటమి తలపడే పరిస్థితి నెలకొంది.

9 మంది ఎంపీలపై మర్డర్ కేసులు

వీరిలో ఐదుగురు బీజేపీ సభ్యులే

» 28 మందిపై హత్యాయత్నం కేసులు: ఏడీఆర్

న్యూఢిల్లీ, మార్చి 29: లోక్‌సభలోని 514 మంది ఎంపీల్లో 225(44%) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు స్పష్టమైంది. వారు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లను అధ్యయనం చేసిన అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) ఈ వివరాలను వెల్లడించింది. ఇక, వీరిలో 5 శాతం మంది ఎంపీలు రూ.100 కోట్లకు పైబడి ఆస్తులు కలిగినట్టు తెలిపింది. నివేదిక వివరాలు ఇలా ఉన్నాయి. 29 శాతం మంది సభ్యులపై అతి తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో హత్య, హత్యా ప్రయత్నం, మతపరమైన హింసను ప్రేరేపించడం, కిడ్నాపులు, మహిళలపై దాడులు, లైంగిక నేరాలు ఉన్నాయి. 9 మంది ఎంపీలపై హత్య కేసులు నమోదయ్యాయి. వీరిలో ఐదుగురు బీజేపీ సభ్యులే. 28 మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వీరిలో 21 మంది బీజేపీకి చెందిన వారే. 16 మందిపై మహిళలకు సంబంధించిన నేరాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు అత్యాచార కేసులు కూడా ఉన్నాయి. రాష్ట్రాలవారీగా చూస్తే ఏపీ, తెలంగాణ, యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎంపీల్లో సగం మంది(50%)కిపైగా క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. అత్యధిక మొత్తంలో ఆస్తులు కలిగి ఉన్న తొలి ముగ్గురు ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన నకుల్‌నాథ్, డీకే సురేశ్ ఉన్నారు. మూడో ఎంపీ ఏపీకి చెందిన రఘురామకృష్ణరాజు ఉన్నారు. మొత్తం ఎంపీల్లో గ్రాడ్యుయేట్ లేదా అంతకన్నా ఎక్కువ చదువుకున్న వారు 73% మంది. లోక్‌సభలో మొత్తం ఎంపీల్లో మహిళలు 15% మంది మాత్రమే.

'సీ-విజిల్'కు 79 వేల ఫిర్యాదులు

న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పలు పార్టీల నాయకులు చేసిన పనులపై భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందాయని ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. ఈ నెల 16 నుంచి 29వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 79 వేల ఫిర్యాదులు సీ-విజిల్ యాప్ ద్వారా అందాయని తెలిపింది. వీటిలో 99 శాతం ఫిర్యాదులను పరిష్కరించామని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, లోక్‌సభ, 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్ నిర్వహణ, ప్రచురణ, ప్రసారంపై ఈసీ నిషేధం విధించింది. ఏప్రిల్ 19వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటల నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఈ నిషేధం అమలులో ఉంటుంది.

మూడు రోజులు మండే ఎండలే!

నల్లగొండ జిల్లా నాంపల్లిలో 43 డిగ్రీలు.. వడదెబ్బతో ఆశా కార్యకర్త మృతి

హైదరాబాద్/నల్లగొండ/తిమ్మాపూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడ్రోజుల పాటు సాధారణం కంటే గరిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ కె.నాగరత్న తెలిపారు. 2 డిగ్రీల నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశమున్నట్లు వెల్లడించారు. దక్షిణ దిశ నుంచి కిందిస్థాయి గాలులు వీస్తున్నాయని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మూడ్రోజులు వడగాడ్పులు వీస్తాయని వివరించారు. ఏప్రిల్ 1 నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలపైనే నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలో 43, యాదాద్రి భువనగిరి జిల్లా మల్యాలలో 42.6, సూర్యాపేట జిల్లా దిర్శించర్లలో 42.2 డిగ్రీల చొప్పున రికార్డయ్యాయి. కాగా, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నేదునూర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి (43) వడదెబ్బతో మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం రాజేశ్వరి గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే అస్వస్థతకు గురికాగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె ఆరోగ్యం విషమించడంతో గురువారం రాత్రి మరణించారు.

లక్ష్మీనృసింహుడి భక్తులకు చల్లచల్లగా..

యాదగిరిగుట్టపై హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డు


యాదగిరిగుట్ట తిరువీధుల్లో ఏర్పాటు చేస్తున్న షెడ్డు


తాత్కాలిక చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

భువనగిరి అర్బన్, మార్చి 29: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దర్శనానికి వచ్చే భక్తులు ఎండ వేడిమితో ఇబ్బంది పడకుండా చల్లదనం కలిగించేలా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌తో కొండపై షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. దీనికి ఆలయ అధికారులు కోరడంతో పలువురు దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. కొన్ని రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో కొండపై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది వరకే చలువ పందిళ్లు వేసినా అవి సరిపోవడం లేదు. తిరుమాడ వీధుల్లో భక్తులు నడిచేందుకు వీలుగా నీడ కల్పించాలని నిర్ణయించారు. ముందుగా ఉత్తర దిశగా హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌తో షెడ్డు నిర్మిస్తున్నారు. దాతల సహకారం ఇంకా ఉంటే ఇలాంటి షెడ్లను మిగిలిన మూడు దిక్కులా విస్తరించనున్నారు. అయితే ఈ షెడ్డు వల్ల ఆలయ సహజత్వం దెబ్బతింటుందని పలువురు భక్తులు అంటుండగా.. ఇది వేసవిలో మాత్రమే ఉంటుందని, తర్వాత తొలగించవచ్చని అధికారులు వివరిస్తున్నారు. షెడ్డు నిర్మాణంతో ఎలాంటి నష్టం లేదని, భక్తులకు సదుపాయాలే ముఖ్యమని చెబుతున్నారు. కాగా, ఆలయ ప్రహరీ వెంట శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్న రూ.150 టికెట్ దారి (షెడ్డు నిర్మాణం) మాదిరిగానే ఆలయం చుట్టూ కూడా నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. దీని వల్ల ఎండా వానల నుంచి రక్షణ ఉంటుందంటున్నారు.

గ్రూప్-1 ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.4.50 కోట్లు వసూలు చేసిన ముఠా
- ఒకరి అరెస్టు.. 25 లక్షల నగదు, స్వాధీనం

వరంగల్ క్రైం, మార్చి 29: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గ్రూపు-1 ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసిన తొమ్మిది మంది ముఠా సభ్యుల్లో ఒకరిని సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ పిన్నవారి వీధికి చెందిన కొత్త వీరేశం అనే వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకుని రూ.25 లక్షల విలువ కలిగిన నగదు, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తన కుమారుడికి గ్రూప్-1 ఉద్యోగం ఇప్పిస్తానని కొత్త వీరేశం 2020లో తన నుంచి రూ.2.5 కోట్లు తీసుకుని మోసం చేశాడని వారం శ్రీదేవి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. వీరేశంను గురువారం రాత్రి నగరంలో అదుపులోకి తీసుకుని విచారించారు. డబ్బు సంపాదించాలనే అత్యాశతో వీరేశం, తన కుమారుడు గోపీనాథ్, హైదరాబాద్‌కు చెందిన మిత్రుడు గూడూరు పవన్, అతడి భార్య వెంకట పద్మజ... మరో ఐదుగురు ముఠాగా ఏర్పడి ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి డబ్బులు వసూలు చేశారని చెప్పారు. ఐదుగురి నుంచి రూ.4 కోట్ల 50 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. వీరేశం, అతడి స్నేహితుడు పవన్.. పెద్దవారితో పరిచయాలున్నాయని.. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారని పేర్కొన్నారు. వీరేశం నుంచి రూ.25 లక్షల విలువగల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల్లో వీరేశంతోపాటు హైదరాబాద్‌కు చెందిన గూడూరు పవన్, గూడూరు పద్మజ, వరంగల్‌కు చెందిన కొత్త గోపీనాథ్, ఖమ్మంకు చెందిన ఉటుకూరి శ్రీనివాస్‌రావు, ప్రకాశం జిల్లాకు చెందిన బుచ్చిబాబు, నర్సంపేటకు చెందిన బోయినపల్లి రవిందర్‌రావు, వరంగల్‌కు చెందిన కొత్త అరుంధతి, కొత్త పూజిత ఉన్నారు. పరారీలో ఉన్న వారిని పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. విలేకర్ల సమావేశంలో సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ సాంబయ్య పాల్గొన్నారు.

అప్పు కడతారా? ఆస్తులు అమ్మేయాలా?

కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఆర్‌ఈసీ హెచ్చరిక

- మూడు నెలల వాయిదాల కింద 1441 కోట్లు కట్టాలంటూ నోటీసు
- చెల్లించకపోతే దివాళా సంస్థగా ప్రకటిస్తాం
- తాకట్టు పెట్టిన ఆస్తులను అమ్మేస్తాం : ఆర్‌ఈసీ



హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం చెల్లించకపోతే కాళేశ్వరం కార్పొరేషన్‌ను దివాళా సంస్థగా ప్రకటించి, తాకట్టుపెట్టిన ఆస్తులను అమ్మకానికి పెడతామని రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) హెచ్చరించింది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలలకుగాను రుణాల అసలు కింద రూ.1441 కోట్లను కట్టాలని కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఆర్‌ఈసీ తాజాగా నోటీసు ఇచ్చింది. నిర్ణీత వ్యవధిలోగా కట్టకపోతే దివాళా సంస్థగా ప్రకటిస్తామని తెలిపింది. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో దివాళా పిటిషన్ వేసి, తాకట్టుపెట్టిన ఆస్తులను అమ్మకానికి పెడతామని పేర్కొంది. సొంతంగా ఎటువంటి ఆదాయం లేని కాళేశ్వరం కార్పొరేషన్.. ఆర్‌ఈసీ నోటీసుల గురించి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

రాబడి అంచనాలు పెంచి భారీగా రుణ సేకరణ

కాళేశ్వరం పంప్‌హౌస్‌ల నిర్మాణానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.37,737.11 కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.30,536.08 కోట్ల రుణాలు మంజూరు అయ్యాయి. అయితే, పరిమితికి మించి రుణాలు తీసుకున్నారనే కారణంతో కేంద్రం ఆంక్షలు విధించడంతో కొంత మేర రుణాలు ఇప్పటికే ఆగిపోయాయి. ఇక పీఎఫ్‌సీ రుణాలకు అసలు/వడ్డీ చెల్లింపు ప్రక్రియ 2022 అక్టోబరు నుంచి ప్రారంభం కాగా... ఆర్‌ఈసీకి 2023 జూన్ నుంచే చెల్లింపులు చేస్తున్నారు. కాళేశ్వరం ద్వారా వ్యవసాయానికి సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా, ప్రజలకు తాగునీరుతో పాటు చేపల పెంపకం ఇతరత్రా మార్గాల ద్వారా ఏటా రూ.21,682.34 కోట్ల ఆదాయం వస్తుందని గత ప్రభుత్వం లెక్కల్లో చూపించింది. రుణాలు తీసుకోవడానికి వీలుగా ఈ విధంగా ఆదాయం అంచనాలను ఎక్కువ చేసి చూపారని తర్వాత వెల్లడైంది. రాబడి రూ.14,709 కోట్లకు మించి రాదని కాగ్ ఇటీవల తేల్చి చెప్పింది. వాస్తవానికి ఆ పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే, వ్యవసాయానికి ఉచితంగానే నీటిని ఇస్తుండగా... తాగునీటికి రుసుము వసూలు చేయడం లేదు. పారిశ్రామిక అవసరాలకు నీటిని ఇచ్చే పరిస్థితి ఈ పథకంలో అసలు లేనేలేదు. పథకంలోని హెడ్‌వర్క్‌లు (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపులు) పూర్తికాగా.. నిర్మాణ వైఫల్యాలతో బ్యారేజీలు ప్రస్తుతం ఉపయోగంలో లేవు. ఈ నేపథ్యంలో ఆదాయమే లేని కాళేశ్వరం కార్పొరేషన్‌కు రుణాల కోసం నోటీసులు వస్తే... ప్రభుత్వం వైపు చూడటం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ అప్పులు తీరాలంటే 2035 ఆగస్టు దాకా కట్టాల్సిందే. కాళేశ్వరం పథకం నిర్వహణకు ఏటా రూ.21 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్ల దాకా అవసరం అవుతుంది. వార్షిక రుణాల చెల్లింపులకే రూ.14 వేల కోట్ల దాకా వ్యయం చేయాల్సి ఉంటుంది. ఇక బ్యారేజీలను పునరుద్ధరిస్తే... విద్యుత్ ఛార్జీల రూపంలో ఏటా రూ.10 వేల కోట్లు అవసరం అవుతాయి.

కాళేశ్వరం వార్షిక నిర్వహణ వ్యయం అంచనాలు

సంవత్సరం	రుణాల చెల్లింపు	విద్యుత్ ఛార్జీలు	వార్షిక నిర్వహణ మొత్తం
2024-25	రూ.14,462.15 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.25,109.41 కోట్లు
2025-26	రూ.14024.69 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.24,671.95 కోట్లు
2026-27	రూ.13,302.50 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.23,949.76 కోట్లు
2027-28	రూ.12,593.51 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.23,240.77 కోట్లు
2028-29	రూ.11,859.19 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.22506.45 కోట్లు
2029-30	రూ.11,135.93 కోట్లు	రూ.10,374.56 కోట్లు	రూ.21,783.19 కోట్లు

కాళేశ్వరం రుణాలు

రుణ సంస్థ	రుణం కోట్లలో	వడ్డీ శాతం	చెల్లింపు మొదలు	చెల్లింపు ముగిసేది	వాయిదాలు
పీఎఫ్‌సీ	రూ.25,312	9.45-10.9	15-10-2022	15-7-2034	48-144 నెలలు
ఆర్‌ఈసీ లింక్-1	రూ.4,657.95	10.90	30-9-2023	30-8-2035	144 నెలలు
ఆర్‌ఈసీ లింక్-2	రూ.11,784.7	10.90	1-6-2023	1-5-2035	144 నెలలు
ఆర్‌ఈసీ లింక్-4	రూ.14,093	10.90	30-9-2023	30-8-2035	144 నెలలు

3 నెలల్లో రూ.16 వేల కోట్ల అప్పు

- 2024-25 తొలి త్రైమాసికంలో బహిరంగ మార్కెట్ నుంచి సేకరించనున్న రాష్ట్రం
- ఏప్రిల్, జూన్ నెలల్లో రూ.5 వేల కోట్ల చొప్పున..
- మేలో రూ.6 వేల కోట్ల రుణ సేకరణకు ప్రభుత్వ ప్రణాళిక
- వివరాలు వెల్లడించిన ఆర్బీఐ

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంకానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ద్వారా నిధులు సమకూర్చుకోవడంపై దృష్టిసారించింది. ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే 2024-25 ఆర్థిక సంవత్సరంలో తీసుకునే అప్పులపై ప్రణాళికను రూపొందించుకున్న ప్రభుత్వం నెలవారీగా, త్రైమాసికంవారీగా తీసుకోవాలనుకునే రుణాలపై ఒక అవగాహనకు వచ్చింది. ఇందులో భాగంగా ఏప్రిల్, మే, జూన్‌తో కూడిన మొదటి త్రైమాసికంలో రూ.16వేల కోట్ల రుణాలు బహిరంగ మార్కెట్ ద్వారా సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆర్బీఐకి అప్పుల సేకరణ వివరాలు పంపింది. ఆయా వివరాలను ఆర్బీఐ తాజాగా వెల్లడించింది. మొదటి త్రైమాసికంలో దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తంగా రూ.2,54,040 కోట్ల అప్పులు తీసుకోనుండగా.. ఇందులో తెలంగాణ తీసుకోనున్న అప్పు రూ.16 వేల కోట్లు. ఈమేరకు ఏప్రిల్ 2న రూ.1,000 కోట్లు, 8న రూ.2,000 కోట్లు, 23న రూ.2,000 కోట్లు కలిపి రూ.5,000 కోట్ల అప్పు సేకరించనుంది. తర్వాత మే 7న రూ.2,000 కోట్లు, 14న రూ.2,000 కోట్లు, 28న రూ.2,000 కోట్లు కలిపి రూ.6,000 కోట్లు.. జూన్ 4న రూ.1,000 కోట్లు, 11న రూ.2,000 కోట్లు, 25న రూ.2,000 కోట్లు కలిపి రూ.5,000 కోట్ల రుణం సేకరించనుంది. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో రూ.59,625 కోట్లు బహిరంగ మార్కెట్ రుణాలు సేకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇదికాక కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల కింద రూ.1,000 కోట్లు.. డిపాజిట్లు, అడ్వాన్సుల కింద రూ.4,060 కోట్లు కూడా సేకరించనున్నట్లు ప్రకటించింది. ఇలా అప్పుల రూపంలో మొత్తంగా రూ.68,585 కోట్లు సమకూర్చుకోనున్నట్లు తెలిపింది. ఆర్బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా తీసుకునే బహిరంగ మార్కెట్ రుణాలే రూ.59,625 కోట్ల వరకు ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం వరకు బడ్జెట్‌లో అంచనా వేసిన మేర అప్పు తీసుకోనుంది. నెలకు సగటున రూ.5,000 కోట్ల అప్పు తీసుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

దేశవ్యాప్తంగా ఎన్టీఆర్ సంక్షేమ పథకాలే

- నందమూరి రామకృష్ణ

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో అమలు చేస్తున్నారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు ఎన్టీఆర్ అందరి గుండెల్లో ఉంటారన్నారు. ప్రజల కోసం ఆయన ఎంతో త్యాగం చేశారని గుర్తుచేశారు. టీడీపీ 42వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, శుక్రవారం ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ జెండాను రామకృష్ణ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్‌చేశారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింలు మాట్లాడుతూ... ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతే అన్ని వర్గాలకు రాజకీయ ప్రవేశం లభించిందన్నారు.

పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో పొగలు

కాజీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ బీ-4 బోగి కింద భాగంలోని బ్యాటరీలో శుక్రవారం రాత్రి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చేరుకోగానే బీ-4 బోగీ కింద చిన్నగా పొగలు రావడం గమనించిన ప్రయాణికులు, రైలు కాజీపేటలో హాల్టింగ్ కాగానే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన రైల్వే అధికారులు.. బోగీ వద్దకు చేరుకుని సమస్యను గుర్తించారు. ఎలక్ట్రికల్ స్టాఫ్‌కు, ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎలక్ట్రికల్ సిబ్బంది దెబ్బతిన్న బ్యాటరీని తొలగించి కొత్త దాన్ని అమర్చారు. ఈ క్రమంలో రైలు రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

రైతుబంధు @ రూ. 5,575 కోట్లు!

- రాష్ట్రంలోని 64,75,819 మంది రైతుల ఖాతాలకు నగదు బదిలీ పూర్తి
- యాసంగి గణాంకాల వెల్లడి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, కూకట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 2023- 24 యాసంగి పంట కాలానికి సంబంధించి రైతుబంధు పథకం కింద రూ.5,575 కోట్ల పైచిలుకు నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం నాటికి 64,75,819 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందని, మొత్తం 1,11,49,534 ఎకరాలకు పెట్టుబడి సాయం అందించామని వెల్లడించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఒక ఎకరం లోపు భూమి ఉన్న 22,24,870 మంది రైతులు, రెండెకరాల లోపు 17,72,675 మంది, మూడెకరాల లోపు 11,30,788 మంది, నాలుగెకరాల లోపు 6,54,419 మంది, ఐదు ఎకరాలలోపు 4,92,568 మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 92.68 శాతం మంది రైతులకు, ఐదెకరాల భూవిస్తీర్ణం కలిగిన రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టుగానే కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తొలి వంద రోజుల్లోనే దాదాపు 80 శాతం మంది రైతులకు రైతుబంధు చెల్లింపులు పూర్తి చేశారు. ఒక ఎకరం నుంచి మొదలుపెట్టి రెండు, మూడు ఎకరాల వరకు చెల్లింపులు చేశారు. మార్చి నెలాఖరుకు ఐదెకరాల వరకు భూములున్న రైతులందరికీ పెట్టుబడి సాయం అందజేశారు. కాగా, రైతుబంధుకు బదులుగా త్వరలోనే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఆర్థిక స్థితి దిగజారినా అమలు: తుమ్మల

గత ప్రభుత్వ అనాలోచిత చర్యలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారినప్పటికీ రైతుల శ్రేయస్సు దృష్ట్యా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సీజన్ లోనూ మూడు నెలల కంటే తక్కువ రోజుల్లో రైతుబంధు నగదు బదిలీ చేయలేదని చెప్పారు. గత ప్రభుత్వం పంటల బీమా పథకం అమలుచేసి ఉంటే ప్రస్తుత ప్రతికూల వాతావరణంలో రైతులకు నష్టపరిహారం వచ్చేదని తుమ్మల తెలిపారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించినట్లు పునరుద్ఘాటించారు. గతంలో చేసిన తప్పులను కప్పి పుచ్చుకోవటానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేయాలని బ్యాంకర్లతో కలిసి విధివిధానాల రూపకల్పన చేస్తున్నామని తుమ్మల వెల్లడించారు.

బీఆర్ఎస్‌కు అభ్యర్థుల కరువు

స్కాంల బీఆర్ఎస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువయ్యారని తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ తరఫున మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తోన్న సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్, కూకట్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో తుమ్మల మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తుండడంతో బీఆర్ఎస్ నుంచి టికెట్ పొందిన వారు కూడా పోటీచేసేందుకు వెనకాడుతున్నారని తుమ్మల అన్నారు.

చీపురుపల్లిలో బొత్స వర్సెస్ కళా

- భీమిలి బరిలో గంటా
- పెండింగ్ సీట్లకు టీడీపీ అభ్యర్థుల ప్రకటన
- వీటిలో 9 అసెంబ్లీ, 4 లోక్‌సభ స్థానాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి): ఏపీలో పెండింగ్‌లో ఉన్న శాసనసభ, లోక్‌సభ స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను ప్రకటించింది. శుక్రవారం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన విడుదల చేసిన నాలుగో జాబితాలో 9 అసెంబ్లీ, 4 పార్లమెంటు స్థానాల అభ్యర్థులు ఉన్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణతో మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకట్రావు తలపడనున్నారు. ఇక్కడ పోటీచేస్తారనుకున్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తిరిగి భీమిలి టికెట్ సాధించారు. చీపురుపల్లిలో బొత్సను దీటుగా ఎదుర్కొనే క్రమంలో పార్టీ నాయకత్వం కళావెంకట్రావుకు టికెట్ ఇచ్చింది. వైసీపీ నుంచి ఇటీవలే వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు అనంతపురం జిల్లా గుంతకల్లు సీటు కేటాయించారు. ఆలూరు సీటును లింగాయత్ సామాజికవర్గానికి చెందిన వీరభద్ర గౌడ్‌కు ఇచ్చారు. అనంతపురం సీటు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి సమీప బంధువైన దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు లభించింది. టీడీపీ సీనియర్ నేత దివంగత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడి కుమారుడు సుగవాసి సుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ సీటు ఇచ్చారు. ప్రకాశం జిల్లా దర్శి సీటు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి లభించింది. అల్లూరి జిల్లా పాడేరు (ఎస్టీ) సీటును పార్టీలోకి కొత్తగా వచ్చిన రమేశ్‌నాయుడికి కేటాయించారు.

మాగుంటకే చాన్సు

ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరును ప్రకటించారు. ముందు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని నిలపాలనుకున్నారు. అయితే ఢిల్లీ మద్యం పాలసీ స్కాం కేసు తీవ్రత నేపథ్యంలో ఆయన్ను కాదని చివరకు శ్రీనివాసులరెడ్డికే కేటాయించారు. కడప లోక్‌సభ సీటు అనూహ్యంగా జమ్మలమడుగు నేత చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డికి లభించింది. ఆయన ఇప్పటి దాకా జమ్మలమడుగు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆ సీటు పొత్తులో బీజేపీకి పోవడంతో కడప ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. విజయనగరం జిల్లా ఎచ్చెర్ల సీటు కోసం పోటీపడిన యువ నేత, తూర్పు కాపు సామాజికవర్గానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడుకు విజయనగరం లోక్‌సభ సీటు లభించింది. వివాదరహితుడు కావడంతో ఆయనకు అక్కడ అవకాశం ఇచ్చారు. అనంతపురం లోక్‌సభ స్థానానికి బోయ సామాజికవర్గానికి చెందిన అంబికా లక్ష్మీనారాయణను ఎంపిక చేశారు. ఈయన పార్టీలో హిందూపురం ప్రాంతానికి చెందిన సీనియర్ నేత.

రఘురామకు సీటు ఖాయం

నరసాపురం సిటింగ్ ఎంపీ రఘురామరాజుకు సీటు ఖాయమని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆయనకు సీటివ్వాలని టీడీపీ-జనసేన-టీడీపీ ఒక నిర్ణయానికి వచ్చాయని, ఆయనను ఎక్కడ నిలిపితే బాగుంటుందనే దానిపై సమాలోచనలు జరుగుతున్నాయని, ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంలో ఆయన్ను నిలిపే అవకాశం ఉంది.

టీడీపీలో చేరిన సినీ నటుడు నిఖిల్

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.. పార్టీ కండువా కప్పి నిఖిల్‌ను టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన ఏపీలో పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొంటారని సమాచారం.

టెట్‌కు 13,163 దరఖాస్తులు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఇప్పటి వరకు 13 వేల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మార్చి 14న టెట్ నోటిఫికేషన్ జారీ కాగా 27 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ 10 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 13,163 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. ఇందులో పేపర్-1కు 5,030, పేపర్-2కు 6,817 దరఖాస్తులు, రెండు పేపర్లకు మరో 1,316 దరఖాస్తులు వచ్చాయి.

ఏపీ హౌసింగ్ బోర్డు కేసులో వైవీ క్వాష్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం వైఎస్ జగన్ అక్రమాస్తులకు సంబంధించిన ఏపీ హౌసింగ్ బోర్డు కేసులో 6వ నిందితుడు వైవీ సుబ్బారెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన పెట్టుకున్న క్వాష్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఈ వ్యవహారంతో తనకు సబంధం లేదని.. ఏపీ మాజీ సీఎం వైఎస్‌ఆనఖ తోడల్లుడినన్న కారణంతో తనను ఇరికించారని ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా ఒక్క సాక్షిగాగానీ, డాక్యుమెంట్‌గానీ లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న జస్టిస్ కే.లక్ష్మణ్ ధర్మాసనం.. ఇదే కేసులో ఇతర నిందితులు దాఖలు చేసినక్వాష్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసిందని గుర్తుచేసింది. సుబ్బారెడ్డి పోషించిన పాత్రపై సీబీఐ కచ్చితమైన అభియోగాలు మోపిందని.. 48 మంది సాక్షుల్లో ఆరుగురు సాక్షులు సుబ్బారెడ్డి పాత్రపై వాంగ్మూలాలు ఇచ్చారని పేర్కొంది. అందువల్ల ఇది క్వాష్ చేయడానికి తగిన కేసు కాదని స్పష్టం చేసింది.

అన్నారం బ్యారేజీ వద్ద భారీగా పేరుకుపోయిన ఇసుక



ఇసుక తొలగిస్తేనే మరమ్మతులు

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో భారీగా ఇసుక మేటలు
- హైడ్రో గ్రాఫిక్ సర్వేతో 2022లోనే గుర్తించిన ఇంజనీర్లు

భూపాలపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణ పనులపై అనిశ్చితి నెలకొంది. దెబ్బతిన్న, బుంగలు పడి నీరు లీకవుతున్న పియర్ల మరమ్మతులకు.. భారీగా పేరుకుపోయిన ఇసుక మేటలు అడ్డంకిగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ, అన్నారం వద్ద నిర్మించిన సరస్వతి బ్యారేజీల్లో భారీ పరిమాణంలో ఇసుక మేటలు వేయడంతో ఈ బ్యారేజీల నీటి నిల్వ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఇంజనీర్లు గుర్తించారు. అంతేకాదు ఇటీవల దెబ్బతిన్న పియర్లను పరిశీలించేందుకు వచ్చిన ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం కూడా ఇసుక నిల్వలను తొలగిస్తే తప్ప మరమ్మతులు సాధ్యం కాదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. భారీగా పేరుకుపోయిన ఇసుక నిల్వలను తొలగిస్తే తప్ప ఈ బ్యారేజీల్లో సమస్యలను పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. దీంతో రెండు బ్యారేజీల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద అత్యధికంగా 36 లక్షల టన్నుల ఇసుక మేటలు వేసినట్టు నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించారు. అలాగే అన్నారం బ్యారేజీలో కూడా దాదాపు 9 లక్షల టన్నుల మేర ఇసుక నిల్వలున్నాయని గుర్తించి, వాటిని తొలగించాలంటూ టీఎస్‌ఎండీసీకి లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా, అన్నారం, మేడిగడ్డ లో భారీగా ఇసుక మేటలు వేశాయన్న విషయం 2022లోనే నీటిపారుదల శాఖ ఇంజనీర్లు హైడ్రోగ్రాఫిక్ సర్వేద్వారా గుర్తించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటల వెనుక మాయలు

న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని, ఎన్నికలవేళ ఆ సర్వోన్నత వ్యవస్థను అప్రదిష్ఠపాల్జేసే యత్నాలు సాగుతున్నాయంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్‌కు ఏకంగా ఆరువందలమంది న్యాయవాదులు మూకుమ్మడి లేఖ రాయడం చిన్న విషయమేమీ కాదు. ఎంతో కీలకమైన అంశాల్లో అన్నివందలమంది ఏకాభిప్రాయాన్ని కలిగివుండటం, వాటిని గుదిగుచ్చి, న్యాయవ్యవస్థను రక్షించుకోండంటూ సీజేఐకు హెచ్చరికలాంటి జాగ్రత్తలు చెప్పడం విశేషమే. న్యాయవ్యవస్థ పరువును దిగజార్చేందుకు, దానిని భయంలో ముంచెత్తి తీర్పులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్న బృందాలు, కుట్రదారులు, విచ్ఛిన్నకరశక్తులు ఎవరో ఈ లేఖలో లేదు కానీ, దానిని సంధించిన ఆరువందలమందిలో ప్రముఖంగా కనిపించిన పేరు హరీశ్ సాల్వే. ప్రముఖులపక్షాన మాత్రమే వాదించే ఈ ప్రముఖ న్యాయవాది ఇటీవల ఎన్నికలబాండ్ల కేసులో గుప్తదానాల గుట్టును సుప్రీంకోర్టు బహిరంగపరచడాన్ని వ్యతిరేకించిన విషయం తెలిసిందే. న్యాయవ్యవస్థకు కొన్ని హెచ్చరికలు, కాసిన్ని జాగ్రత్తలు చెప్పిన ఈ లేఖమీద ప్రధాని నరేంద్రమోదీ స్పందించడం మరో విశేషం. ఆయన దానిని బేఖాతరుచేసివుంటే ఇంత ప్రాధాన్యత రాకపోయి వుండేది. కానీ, ఆ లేఖను ఆయన సద్వినియోగం చేసుకున్నారు. వేధించడం కాంగ్రెస్‌కు అనాదిగా ఉన్న అలవాటేనంటూ, ఐదుదశాబ్దాలక్రితమే 'కమిటెడ్ జుడీషియరీ'ని ఆ పార్టీ కోరుకుందని విమర్శించారు. ఇందుకు జవాబుగా కాంగ్రెస్ కూడా మోదీ హయాంలో న్యాయవ్యవస్థలో సంభవించిన వివిధ పరిణామాలను గుర్తుచేసి, ప్రతీవ్యవస్థనూ మీరే భ్రష్టుపట్టించేశారంటూ ప్రతివిమర్శలు చేసింది.

లేఖలో ఉన్న అంశాల లోతుపాతుల్లోకి పోవాల్సిన అవసరం లేదు కానీ, న్యాయవ్యవస్థను, దాని స్వతంత్రతను కాపాడటానికి ఉద్దేశించే ఎటువంటి ప్రయత్నమైనా అది సద్బుద్ధితో జరిగినపక్షంలో ప్రశంసించాల్సిందే. లేఖలోని అంశాలకంటే దానిని మోదీ ముందుకు తోయడం, ఆ తరువాత రవి శంకర్ ప్రసాద్ మీడియా సమావేశంలోనూ అవే విమర్శలు కొనసాగించడంతో చాలామందికి ఈ లేఖ వెనుక ఉన్న లక్ష్యాలమీద అనుమానాలు కలగడం మొదలైంది. కుట్రదారులు, వెన్నుపోటుదారుల నుంచి న్యాయవ్యవస్థను రక్షించేందుకు ఉద్దేశించినట్టుగా ఉపరితలంలో కనిపిస్తున్న ఈ వ్యవహారాన్ని తెరవెనుకనుంచి నడిపిస్తున్నది పాలకులేనని వారి అనుమానం. న్యాయవ్యవస్థను కొందరు శాసిస్తున్నారని, తీర్పులను ప్రభావితం చేస్తున్నారని, ముఖ్యంగా అవినీతి కేసుల్లో ఇరుకున్న రాజకీయనాయకుల విషయంలో కోర్టులమీద ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఒత్తిడితెస్తున్నారంటూ ఈ లేఖలో ప్రస్తావించిన అంశాలు ఇప్పటి రాజకీయవాతావరణంలో ఎవరి పక్షాన ఎవరు చేస్తున్న ఆరోపణలో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు.

తీర్పులను ప్రభావితం చేసేందుకు కొంతమంది కుట్రలు చేస్తున్నారన్నది లేఖలో ఓ ప్రధాన ఆరోపణ. నిజానికి, సుదీర్ఘకాలంగా సర్వోన్నతన్యాయస్థానం నుంచి కేంద్రంలోని ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పడవేసే తీర్పులేవీ వెలువడలేదు. ఇటీవల ఎన్నికలబాండ్ల కేసులో తీర్పు ప్రజాస్వామ్య ప్రియులకు కాస్తంత ఉపశమనాన్ని ఇచ్చింది. బీజేపీ ప్రభుత్వం ఏరికోరి తెచ్చుకున్న ఈ విధానం రాజ్యాంగవ్యతిరేకమనీ, అప్రజాస్వామికమని అంటూ సుప్రీంకోర్టు దానిని కొట్టివేసింది. అంతటితో ఊరుకోకుండా ఆ గోప్యతను బద్దలు కొట్టే దిశగా పట్టుబట్టిమరీ జారీ చేసిన ఆదేశాలు పాలకులను ఇబ్బందిలో పడవేసిన మాట నిజం. అధికారపక్షానికి మొత్తంగా ఎంత ముట్టిందన్నది అటుంచితే, ఎవరు ఎప్పుడు ఆ పార్టీకి ఎందుకు విరాళం ఇచ్చారన్న అనంతర విశ్లేషణలు దానిని ఎన్నికల ముందు ఇబ్బంది పెడుతున్నాయి. ఎన్నికలబాండ్ల కేసులో హరీశ్ సాల్వే పాత్ర అందరికీ తెలుసు. ఇక, ఈ బాండ్ల లావాదేవీలను బహిర్గతం చేయకుండా, కార్పొరేట్ కంపెనీలకూ రాజకీయపార్టీలకు మధ్య ఉన్న లాలూచీ బయటపడకుండా సుప్రీంకోర్టును నియంత్రించాల్సిందిగా రాష్ట్రపతికి లేఖరాసిన మరో వ్యక్తి ఈ లేఖమీద సంతకం చేసిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ అగర్వాలా. రామమందిరం ఆరంభోత్సవం నాడు న్యాయవ్యవస్థకు సెలవుదినంగా ప్రకటించాలని అభ్యర్థించిన బార్ కౌన్సిల్ ఆఫ్ చైర్మన్ సంతకం చేసినవారిలో మరొకరు. ఈవీఎంలు, సీఏఏ ఇత్యాది కీలకమైన కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానం నుంచి రాబోయే రోజుల్లో తీర్పులు వెలువడాల్సి ఉంది. పౌరసమాజం, మీడియా, రాజకీయం ఇత్యాది రంగాలనుంచి అరెస్టయిన అసమ్మతి గొంతులను అది వింటున్నది. న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికో, హద్దుల్లో ఉంచడానికో పాలకపక్షంనుంచి ఏవో ప్రయత్నాలు జరగడం కొత్తేమీ కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్దేశించిన భవిష్యత్ తీర్పులను ఈ విన్యాసాలు ప్రభావితం చేయకూడదని సామాన్యుడి ఆకాంక్ష.

వికసిత భారత్ విశ్వరూపం!

ఆర్థికాభివృద్ధిలో దేశం ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నది. ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థికశక్తిగా రూపుదిద్దుకుంది. బ్రిటన్‌ను మించిపోయింది. ఐదేళ్లలో జర్మనీని, జపాన్‌ను కూడా దాటేసి తృతీయ ఆర్థికశక్తిగా ఆవిర్భవిస్తోందని జోస్యాలు వెలువడ్డాయి. ఇండియా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు ఈ ఏడాది 6.5 శాతానికి చేరుకుంటుందని ప్రపంచ ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇది 8 శాతాన్ని తాకుతుందని కేంద్ర ఆర్థికశాఖ సగర్వంగా చాటుకుంటోంది. త్వరలోనే సంపన్నదేశం కావడం ఖాయమని, అయితే వచ్చే పాతికేళ్లపాటు ఏటా 8 శాతం వృద్ధిని సాధిస్తే తప్ప ఆ స్థాయిని చేరుకోలేమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలా, వృద్ధిరేటు గురించి ఇంత గొప్పలు పోతున్నప్పటికీ మానవాభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నాము. వ్యవసాయరంగం మీద ఆధారపడి బతుకులీడుస్తున్న అసంఖ్యాకమైన మిగులు కార్మికశక్తిని ఇతర లాభసాటి ఉత్పాదకరంగాల్లోకి బదలాయిస్తేనే దేశం నిజంగా అభివృద్ధి చెందినట్లని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్నీ నొక్కి చెబుతున్నారు. ఇంజనీరింగ్ వంటి పట్టభద్రుల్లో సైతం ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కొరవడిన చేదు వాస్తవం మన ముందు ఉంది. మన దేశంలో తయారీరంగం ఇంకా పుంజుకోవలసి ఉంది. చైనా ఆ రంగంలో దూసుకెళ్లడం వల్లే విశేష స్థాయిలో ఉద్యోగాలు కల్పించగలిగింది.

చైనాతో విసిగిపోయిన బహుళజాతి సంస్థలు తమ పెట్టుబడులను మన దేశానికు తరలిస్తాయన్న అంచనాలు ఫలించలేదు. పాలకవర్గాలే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మతపరంగా విభజించి నిరంతరం ఘర్షణ వాతావరణాన్ని పోషిస్తుంటే పెట్టుబడులు ఏ విధంగా తరలి వస్తాయి? అందుకే మన తయారీరంగం ఇంకా దేశీయ మార్కెట్ దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి బతుకుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌ను ఆకట్టుకుని ఎగుమతులను పెంచుకోలేకపోతున్నది. ఉత్పత్తిని బట్టి ప్రోత్సాహం (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్-పిఎల్‌ఐ) పథకమూ ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు.

మన జీడీపీలో సర్వీసుల రంగం వాటా 50 శాతం పైనే ఉండగా తయారీరంగం అట్టడుగున 16–17 శాతం దాటడం లేదు. దాన్ని 25 శాతానికి పెంచాలనే లక్ష్యంతో 2014లో ప్రధాని నరేంద్ర మోడీ మేక్ ఇన్ ఇండియాను ఆవిష్కరించినా అది విఫలమయింది. తయారీ రంగంలో పరిశ్రమలు అధికసంఖ్యలో ఏర్పాటయితే తప్ప వ్యవసాయ రంగం నుంచి అదనపు కార్మికశక్తిని బదలాయించడం సాధ్యపడదు. సర్వీసుల రంగంలో విశేష ప్రగతికి తోడ్పడుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) వంటి రంగాలకు అవసరమైన ఉన్నత విద్యావంతులు సాగురంగంలోని కార్మిక శక్తి నుంచి లభించరు. వారికి ఉపాధి కల్పించగల ప్రత్యామ్నాయరంగం తయారీరంగమే. దేశంలోని మొత్తం కార్మికశక్తిలో 45.76 శాతం మంది ప్రస్తుతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారని పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే -పీఎల్ఎఫ్ఎస్ గణాంకాలు వెల్లడించాయి.

దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న పేదల బతుకులను బాగుపరచనంతవరకు ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా ఎదిగామని, మూడో స్థాయికి దూసుకుపోతున్నామని చెప్పుకుని మురిసిపోయే హక్కు, అర్హత మనకు ఉండవు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా ఆహారోత్పత్తి చేసే దేశాల్లో మన దేశం రెండోస్థానంలో ఉన్నా ప్రపంచ ఆకలి సూచీలోని 125 దేశాల్లో మన ర్యాంకు మాత్రం 111. ప్రపంచంలో పోషకాహారం లభించని జనంలోని పావు వంతు మందికి మన దేశం నిలయంగా ఉంది. 19 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు. 2022లో వెలువరించిన ప్రపంచ ఆకలిసూచీ ప్రకారం 121 దేశాల్లో ఇండియా ర్యాంకు 107 కాగా, మనకంటే ఎంతో మెరుగైన స్థితిలో పాకిస్తాన్ (99వ స్థానం), నైజీరియా (103వ స్థానం) ఉండడం గమనించవలసిన విషయం. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం దేశంలో ఐదు ఐదేళ్ల లోపు పిల్లల్లో మూడింట ఒక వంతు మంది వయసుకు తగ్గ పొడవులో లేరు. ప్రతి ఐదుగురిలో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరు.

గత పదేళ్లలో దేశంలో పాతికకోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారనే ఒక ప్రచారం ఈ మధ్య హఠాత్తుగా ఊపు అందుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 2022–23 నాటికి 24.8 కోట్ల మంది పేదలు బహుముఖీన పేదరికం నుంచి విముక్తి పొందారని నీతి ఆయోగ్ తన కొత్త నివేదికలో వెల్లడించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని నరేంద్ర మోడీ వంటి వారు దీనిని పదే పదే చెప్పుకుంటున్నారు. అయితే చాలామంది ఆర్థికవేత్తలు దీనిని సహేతుకమైన ప్రశ్నలతో, ప్రతివాదనలతో ఖండించారు. 2014 నుంచి 2022 వరకు 8 సంవత్సరాల పాటు వినియోగఖర్చుకు సంబంధించిన సర్వేలు జరుపకుండా బహుముఖీన దారిద్ర్య సూచిని రూపొందించడం ఒక రాజకీయ కుట్ర అని బాత్ యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్ర ఎండగట్టారు. నీతి ఆయోగ్ చెబుతున్నట్టు ప్రజల బతుకుల్లో ఏమైనా మెరుగుదల వచ్చిందీ అంటే, మోడీ పాలన కంటే ముందున్న ప్రభుత్వాలు ఆరోగ్యం, విద్య, సంక్షేమరంగాల్లో వేసిన పునాది, చేసిన కృషి వల్ల సాధ్యమైనదిమాత్రమేనని మెహ్రోత్ర వాఖ్యానించారు. పూర్వపు యూపీఏ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని, ఆహార భద్రతాచట్టాన్ని తెచ్చి విద్య, ఆరోగ్య, ఆహారరంగాల్లో బాగా నిధులు వినియోగించిన విషయాన్ని మెహ్రోత్ర గుర్తు చేశారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిన దాఖలాలు లేకుండా బహుముఖీన పేదరికం నుంచి బయటపడినట్టు చెప్పలేమని నిపుణులెందరో అభిప్రాయపడుతున్నారు.

ప్రధాని మోడీ ప్రభుత్వం 2014 నుంచి అమలు చేసిన అనేక పథకాలు ప్రజలను పేదరికం ఊబిలోనుంచి బయటకు లాగాయని బీజేపీ పెద్దలు చెప్పుకుంటున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా ఉచితంగా ఆహారధాన్యాల సరఫరా, పీఎం ఆవాస్ యోజన ద్వారా పేదలకు ఇళ్ళు, జన్‌ధన్ యోజన ద్వారా నగదు బదిలీ, ఇంకా ఉజ్వల యోజన ద్వారా చౌక వంటగ్యాస్ వంటి అనేక పథకాలు పేదల బతుకులను మార్చివేశాయని అమిత్ షా వంటి పెద్దలు చాటింపు వేస్తున్నారు. ఈ పథకాలు చేస్తున్న మేలు సముద్రంలో నీటి బొట్టు కంటే బహు తక్కువ అనడం అసంబద్ధం కాబోదు. అలాగే ఇవి మోడీ ప్రభుత్వమే కొత్తగా ప్రవేశపెట్టినవి కావు. దక్షిణాదిలో రూపాయికే కిలోబియ్యం, ఉచితబియ్యం, అమ్మ కాంటీన్లు, అన్న కాంటీన్లు, ఉచితఇళ్ళు వంటి పథకాలు ఎన్నో చిరకాలంగా అమలవుతున్నాయి. ఎన్ని చేసినా అవి కలిగించే ప్రయోజనాన్ని అదుపులేని ద్రవ్యోల్బణం, అధిక ధరలు హరించివేస్తున్నాయి. పేదల బతుకులను ఉన్నచోటి నుంచి అరసెంటిమీటరైనా ముందుకు జరపలేకపోతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఏ చిన్న పథకమూ అమలు చేయనక్కరలేదు. ధరలను కొంతకాలమైనా సహేతుకస్థాయిలో నిలిపి ఉంచితే చాలు. పేదరికం తప్పనిసరిగా తగ్గి తీరుతుంది. అది చేయకుండా ఇంకేమి చేసినా వృథాయే.



> దక్షిణాదిలో రూపాయికే కిలోబియ్యం, ఉచితబియ్యం, అమ్మ కాంటీన్లు, అన్న కాంటీన్లు, ఉచితఇళ్ళు వంటి పథకాలు ఎన్నో చిరకాలంగా అమలవుతున్నాయి. ఎన్ని చేసినా అవి కలిగించే ప్రయోజనాన్ని అదుపులేని ద్రవ్యోల్బణం, అధిక ధరలు హరించి వేస్తున్నాయి. పేదల బతుకులను ఉన్నచోటి నుంచి అరసెంటిమీటరైనా ముందుకు జరపలేకపోతున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఏ చిన్న పథకమూ అమలు చేయనక్కరలేదు. ధరలను కొంతకాలమైనా సహేతుకస్థాయిలో నిలిపి ఉంచితే చాలు. పేదరికం తప్పనిసరిగా తగ్గి తీరుతుంది. అది చేయకుండా ఇంకేమి చేసినా వృథాయే.

గోరు చుట్టు మీద రోకటి పోటులా దేశంలో ఆర్థికవ్యత్యాసాలు గత పదేళ్లలో ఎంతగా పెరిగిపోయాయో గణాంక వివరాలు కళ్ళకు కడుతున్నాయి. ఈ వ్యత్యాసాలు బ్రెజిల్, దక్షిణాఫ్రికా, అమెరికాలో కంటే భారత్‌లో ఎక్కువగా, మరీ ఘోరంగా ఉన్నాయని రుజువైంది. మన దేశంలో అత్యంత ఐశ్వర్యవంతులయిన ఒక్కశాతం మంది గుప్పెట్లోనే 40.1 శాతం సంపద కేంద్రీకృతమైనట్టు నివేదిక చాటింది. నలుగురు ఆర్థికవేత్తలు 2022–23లో పారిస్ నుంచి నిగ్గుతేల్చిన ఈ స్థాయి వ్యత్యాసాలను ఇండియాలో 1961 నుంచి ఎన్నడూ చూడలేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. సంపాదనలోనే కాదు, ప్రజల ఆదాయాల్లోనూ ఈ తేడా కొట్టొచ్చినట్టుగా ఉందని పేర్కొంది. భారత్‌లో బిలియనీర్ రాజ్ ఏలుబడి సాగుతోందని ఆ ఆర్థికవేత్తలు వ్యాఖ్యానించారు. కుల, మత శ్రేణుల వారీగా అసమానతలు పేరుకుపోయాయని అభిప్రాయపడ్డారు. భారతీయ సమాజం కర్మ సిద్ధాంతం ఇరుసు మీద తిరుగుతున్నదని వ్యాఖ్యానించారు. మరోవైపు గత పదేళ్ల ఎన్‌డీఏ పాలనలో పెన్షన్, గ్రాట్యుటీ వంటి సామాజిక భద్రత కలిగిన స్థిరమైన ఉద్యోగాల కల్పన లేనే లేదని శాస్త్రీయ సర్వేలు స్పష్టం చేశాయి. దేశంలోని 34 శాతం కుటుంబాలు రోజుకు రూ.375 (జాతీయ క్షేత్రస్థాయి కనీస వేతనం) కంటే తక్కువ సంపాదిస్తున్న చేదు వాస్తవాన్ని ఎత్తి చూపాయి. దేశంలోని నిరుద్యోగ యువతలో సెకండరీ లేక ఉన్నత విద్య చదువుకున్నవారు 2000లో 35 శాతం కాగా 2022 నాటికి 65.7 శాతానికి పెరిగిందని అంతర్జాతీయ కార్మికసంస్థ నివేదిక తేల్చి చెప్పింది. మానవాభివృద్ధి సంస్థ కూడా ఇదే మాట నొక్కి చెప్పింది. అంతమందికి ప్రభుత్వం నేరుగా ఉద్యోగాలు కల్పించడం కష్టం అనే మాట వాస్తవమే. ప్రైవేటురంగంలో పెట్టుబడులను విశేషంగా ఆకర్షించి భారీసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కలిగించే దిశగా కృషి చేయాలి.

2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా చేస్తామని ప్రధాని నరేంద్ర మోడీ గొప్పలు పోవడాన్ని చూసి రఘురామ్ రాజన్ వంటి ఆర్థికవేత్తలు నవ్వుకుంటున్నారు. చాలా మందికి ఉన్నత పాఠశాల విద్య కూడా అందుబాటులో లేని పరిస్థితిలో అది దుస్సాధ్యమని రాజన్ చేసిన హెచ్చరిక గమనించదగినది. 140 కోట్ల జనాభాలో సగం కంటే ఎక్కువ మంది 30 సంవత్సరాల లోపు వారు కావడం వరమైతే వారికి సరైన చదువు, నైపుణ్యాలు కొరవడడం శాపమని ఆయన చేసిన విశ్లేషణ కొట్టివేయదగింది కానే కాదు.

• జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

'రంగం' తరహాలో కేజ్రీవాల్ రాజకీయం!

తొమ్మిదేళ్ళ క్రితం ఢిల్లీ మహానగరంలో అన్నా హజారే నేతృత్వంలో సాగిన లోక్‌పాల్ బిల్లు సాధనా ఉద్యమం, తర్వాత జరిగిన నిర్భయ ఉద్యమం సాధారణ ప్రజలు, విద్యార్థులు, విద్యావంతులు, మేధావులను విశేషంగా ఆకర్షించి ఢిల్లీ రాజకీయాలను ప్రత్యామ్నాయ మార్పు దిశగా మళ్ళించాయి. కానీ అన్నా హజారే నేతృత్వంలో సాగిన ఈ అవినీతి వ్యతిరేక మహా ఉద్యమంలో అవకాశవాద శక్తుల చేరిక ప్రత్యామ్నాయ మార్గాన్ని సమూలంగా మార్చివేసిందని చెప్పవచ్చు. కమ్యూనిస్టు భావజాలంతో ప్రభావితమైన అరవింద్ కేజ్రీవాల్ గాంధేయ మార్గంలో కొనసాగుతున్న అన్నా హజారే ఉద్యమాన్ని హైజాక్ చేశారన్న విషయాన్ని ఇప్పటివరకు యావత్ దేశ ప్రజలు ముఖ్యంగా ఢిల్లీ వాసులు ఎవరూ గ్రహించలేకయారు. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని కేజ్రీవాల్ చాకచక్యంగా వాడుకోగలిగారు. మరోవైపు మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని అప్పటి యూపీఏ ప్రభుత్వం అవినీతి, దీర్ఘకాలం ఢిల్లీ ముఖ్యమంత్రిగా సాగిన షీలా దీక్షిత్ పాలన కేజ్రీవాల్ నాయకత్వానికి వరంగా మారింది.

ముందస్తు ప్రణాళికలో భాగంగానే మావోయిస్టు భావజాలం కలిగిన అరవింద్ కేజ్రీవాల్ సమయ సందర్భాలను అంచనా వేసి 2012లో ఆమ్ ఆద్మీ పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. కేవలం సామాజిక దృక్పథంలో సాగిన అన్నా హజారే నేతృత్వంలోని ఉద్యమాన్ని రాజకీయాలకు వాడుకోగలిగారు కేజ్రీవాల్. 2013లో జరిగిన ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల్లో మొదటిసారి పోటీచేసిన ఆప్ పార్టీ విజయం సాధించి కేవలం 49 రోజులు మాత్రమే అధికారంలో ఉండగలిగింది. అనంతరం 2015, 2020 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి మరో రెండుసార్లు అధికారంలోకి వచ్చారు కేజ్రీవాల్.



> కేవలం సామాజిక దృక్పథంలో సాగిన అన్నాహజారే నేతృత్వంలోని ఉద్యమాన్ని రాజకీయాలకు వాడుకోగలిగారు కేజ్రీవాల్. 'రంగం' సినిమాలో మాదిరిగా రాజకీయరంగంలో కేజ్రీవాల్ ఎన్నో కుట్రలు కుతంత్రాలు నడిపారు.

దశాబ్దం క్రితం 2011లో తమిళంలో 'కో' అన్న పేరుతోనూ, తెలుగులో 'రంగం' అన్న పేరుతోనూ విడుదలై భారీ విజయం సాధించిన సినిమా కథకు, అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ జీవితానికి పోలికలు ఇప్పుడు బైట పడుతున్నాయి. 'రంగం' సినిమాలో మాదిరిగానే కేజ్రీవాల్ రాజకీయ రంగంలో ఎన్నో కుట్రలు కుతంత్రాలు నడిపారు. రంగం సినిమాలో నక్సలైట్ నేత బోస్ వెంకట్ బృందం బ్యాంకు దోపిడీ చేసిన తరహాలోనే ఆర్థిక నేరాలకు పాల్పడిన కొంతమంది కేజ్రీవాల్ పార్టీ నిర్వహణకు, ఎన్నికలకు సహకరించారన్న ఆరోపణలు గతంలో వచ్చిన విషయం విదితమే. సినిమా క్లైమాక్స్‌లో నక్సలైటు నేత పాత్రలో కనిపించిన బోస్ వెంకట్ 'విశ్వవిద్యాలయాల్లో, అధికార వర్గాల్లో, చివరకు మీడియాలో సైతం మా వాళ్ళు ఉన్నారు' అన్నట్టుగానే ఢిల్లీ మహానగరంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో మేధావులుగా చలామణి అవుతున్న అర్బన్ నక్సలైట్లు, వామపక్ష నాయకత్వం, విశ్వవిద్యాలయాల్లో తిష్ట వేసిన పలు సంస్థలు, సంఘాల నాయకత్వం అంతా కేజ్రీవాల్‌ను గెలిపించిందన్నది వాస్తవం. అంతేకాదు సినిమాలో బాంబు పేలుడును జర్నలిస్టు పాత్రధారి సరస్వతి గుర్తించి హత్యకు గురైన మాదిరిగానే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అన్వర్ తారీఖ్, ఆయన అనుచరుల చేతిలో ఢిల్లీ నిఘా విభాగం అధికారి అంకిత శర్మ దారుణ హత్యకు గురయ్యారు. సినిమాలో రేణుక-అశ్వత్థామ (జీవా-కార్తీక నాయర్) పాత్రలు నవతరం రాజకీయ పార్టీ నేత వసంత్‌కు ప్రచార ప్రసార సాధనాలుగా సహకరించిన మాదిరిగానే బీజేపీని ఈ పరిస్థితుల్లో అధికారంలోకి రాకుండా చేయాలన్న ఉద్దేశంతో పని చేసిన అర్బన్ నక్సలైట్లు, వామపక్ష నాయకత్వం, ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రభావం చూపగల ఖలిస్తాన్ లాంటి వేర్పాటువాద జాతి వ్యతిరేక గ్రూపులన్నీ ఆప్ పార్టీని అధికారంలోకి వచ్చేలా చేశాయి. సినిమాలో లాగానే ఆమ్ ఆద్మీ పార్టీ నిజ స్వరూపం త్వరలోనే బయటపడే అవకాశాలు అధికంగానే ఉన్నాయి.

ఢిల్లీ అల్లర్ల నేపథ్యంలో ఆప్ నేత తారిక్ అన్వర్ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు పలుమార్లు ఫోన్‌కాల్స్ చేశారన్న విషయం బయటకు రావడమే నిదర్శనంగా చెప్పవచ్చు. ఎన్నికల అనంతరం ఢిల్లీలో జరిగిన అల్లర్లలో సిరియా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, సౌదీ దేశాల్లో వినియోగించిన విధ్వంస సాధనాల వంటివే ఆప్ నేతల నివాస ప్రాంతాల్లో కనిపించడాన్ని బట్టి ఆప్ పార్టీ వ్యవహార శైలి బట్టబయలవుతోంది. పూర్వ ఆప్ పార్టీ నేత కుమార్ విశ్వాస్ కేజ్రీవాల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. పంజాబ్‌కు విస్తరించే క్రమంలో ఖలిస్తాన్‌తో చేతులు కలిపి భవిష్యత్తులో ప్రత్యేక పంజాబ్ దేశానికి ప్రధానమంత్రి కావాలన్న తన మనోగతాన్ని కేజ్రీవాల్ తనకు వివరించాడని బాహాటంగా పత్రికలకు వివరించాడు కుమార్ విశ్వాస్. 2014 నుంచి 2022 వరకు 16 మిలియన్లు అంటే దాదాపు రూ.134 కోట్లు ఆప్ పార్టీకి విరాళాలు ఇచ్చామని, అందుకు ప్రతిగా ఖలిస్తాన్ ఉగ్రవాద నేత దేవేందర్ పాల్ సింగ్ బుల్లర్‌ను జైలు నుంచి విడుదల చేస్తామని కేజ్రీవాల్ తమకు హామీ ఇచ్చాడని ప్రత్యేక ఖలిస్తాన్ ఉగ్రవాదనేత గురు పత్వంత్ పున్నన్ ఆరోపించిన విషయం విదితమే. అరవింద్ కేజ్రీవాల్ రైతుల ఉద్యమం పేరిట షహీన్ బాగ్ అల్లర్ల పేరిట దేశ రాజధాని ఢిల్లీలోను, పంజాబ్, గోవాల్లోను విచ్ఛిన్నకర జాతి వ్యతిరేక కుట్రలు అమలు చేశాడన్నది నేటి పరిస్థితులను చూస్తే అవగతమవుతుంది. చీమలు పెట్టిన పుట్టల్లో పాములు దూరినట్టు సమాజ హితాన్ని కోరి ప్రారంభించిన ఉద్యమాన్ని హైజాక్ చేసిన కేజ్రీవాల్ అవినీతి కుంభకోణంలో దోషిగా నిలబడడం పట్ల అన్నా హజారే, సంతోష్ హెగ్డే తీవ్ర మనోవేదనకు గురయ్యారని వారి ప్రకటనలు తెలియజేస్తున్నాయి. ఏది ఏమైనా రాజకీయ అధికారం కోసం నీతిమంతులుగా చెలామణీ అవుతూ తెర వెనక కుట్రలూ కుతంత్రాలకు పాల్పడే కొంతమంది నేతల తీరును కళ్లకు కట్టినట్లు చూపించిన 'రంగం' సినిమాలో దర్శకుడు కె.వి. ఆనంద్‌ను అభినందించాల్సిందే.

■ కొట్టె మురళీకృష్ణ

ఆర్బీఐ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటం!

భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఏప్రిల్ 1న తన 89వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. నిజానికి, వందేళ్ళ క్రితం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహకారం లేకుంటే నేడు ఈ రిజర్వు బ్యాంక్ ఉనికిలోనే ఉండేది కాదు. 1770లో కలకత్తాలో 'బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్' ఏర్పడి పన్నెండేళ్ళకే మూతబడింది. తర్వాత కాలక్రమంలో బ్యాంక్ ఆఫ్ బెంగాల్, బ్యాంక్ ఆఫ్ బొంబాయి, బ్యాంక్ ఆఫ్ మద్రాస్ వంటివి ఏర్పడ్డాయి. మొట్టమొదటి స్వదేశీ బ్యాంక్ 'అలహాబాద్ బ్యాంక్' 1865లో కలకత్తాలో ఏర్పడింది. మొదటి ప్రపంచయుద్ధం తరువాత, బ్రిటిష్ ప్రభుత్వం 1921లో అప్పటివరకూ ఉన్న బ్యాంకులన్నింటినీ కలిపి ఇంపీరియల్ బ్యాంక్ ఏర్పాటు చేసినప్పటికీ, దేశం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించడంలో అప్పటి బ్యాంకింగ్ వ్యవస్థ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించలేకపోయింది. ఈ ఆర్థిక సంక్షోభ స్థితిగతుల నేపథ్యంలోనే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన 32వ ఏట రాసిన ఓ పుస్తకం భారత ఆర్థిక వ్యవస్థకు మార్గదర్శిగా నిలిచింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ డిగ్రీ కోసం ఆయన చేసిన పరిశోధన ఆధారంగా, 1923లో లండన్‌లో వెలువరించిన 'ద ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ' గ్రంథం అప్పటి ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బాటలు పరిచింది. భారత కరెన్సీ సంస్కరణలపై బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులకు ఈ పుస్తకం కరదీపిక అయింది. అర్థశాస్త్రంతో సంబంధం ఉన్న ప్రతిఒక్కరూ అప్పట్లో ఈ పుస్తకంపై చర్చలు జరిపారు. హిల్టన్ యంగ్ ఆధ్వర్యంలో నియమించిన రాయల్ కమిషన్‌కు అంబేడ్కర్ లోతైన సూచనలు చేశారు. తదనుగుణంగా కరెన్సీ చలామణి, మారకం రేటు నిర్వహణ ఇత్యాది అంశాలపై పూర్తి నియంత్రణాధికారాలు గల సర్వస్వతంత్ర కేంద్రీయ బ్యాంక్ ఏర్పాటుకు అనుగుణంగా కమిషన్ నివేదిక ఇచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఏర్పాటుకు 1927లోనే బ్రిటిష్ ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ, వివిధ కారణాలరీత్యా అది వాయిదాపడి చివరకు 1935 ఏప్రిల్ 1న రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పడింది. దీనికి ముందు దేశ ఆర్థికవ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొన్న సమస్యలు, సంక్షోభాల రీత్యా ఆ కేంద్రీయ బ్యాంక్ ఏర్పాటు ద్వారా అంబేడ్కర్ ఈ దేశానికి చేసిన సహాయం, దిశానిర్దేశం విస్మరించలేనివి. ఈ నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటా తన వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ప్రముఖంగా ఉంచాలి, ఆయనకు అంజలి ఘటించాలి.

– జెరిపోతుల పరుశురాం
(కరెన్సీపై అంబేడ్కర్ ఫోటో సాధన సమితి)

అయోమయంలో అపర చాణక్య!

చావుదలకు చాలా మందికి జ్ఞాన బోధ కలుగుతుంది. సామాన్యుడి నుంచి సకల భోగాలు అనుభవించిన వ్యక్తి దాకా ఎవరైనా కన్న తల్లిని పుట్టి పెరిగిన ఊరిని తలచుకుంటారు చివరి దశలో అక్కడికి చేరుకోవాలని తపిస్తారు, తెలంగాణా రాజకీయాల్లో తలపండిన నేత డా. కె.కేశవరావుకు అలా అనిపించడంలో తప్పేమీ లేదు. ఆయనకు కొంత ఆలస్యంగా ఎనభై నాలుగేళ్ల వయసులో ఈ విషయం బోధపడింది. సరిగ్గా పదకొండేళ్ల క్రితం ఆయన కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి తెలంగాణా తల్లిని ఆవాహన చేసుకున్నారు. నిజానికి కేశవరావు మొదటినుంచీ తెలంగాణాకోసం మాట్లాడేవారు. కాంగ్రెస్ పార్టీలో అదే ఆయనకు గుర్తింపు, గౌరవం, పదవులు రావడానికి కారణం అయ్యింది. ఎన్నడూ ప్రజాక్షేత్రంలో లేకపోయినా, ప్రత్యక్షంగా శాసనసభకు ఎన్నిక కాకపోయినా ఆయనకు కాంగ్రెస్ పార్టీ అనేక అవకాశాలు ఇచ్చింది. శాసనమండలి సభ్యుడిగా ఆయనకు రెండుసార్లు అవకాశం ఇవ్వడమే కాకుండా 1980 నాటినుంచే మంత్రిగా కూడా అవకాశాలు ఇచ్చింది. భవనం వెంకట్రామ్ మంత్రి మండలిలో ఆయన అతి చిన్న వయసులో విద్యాశాఖ మంత్రిగా ఆ తరువాత పరిశ్రమలశాఖా మంత్రిగా అనేక కీలక హోదాల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. జాతీయ స్థాయిలో కూడా కొంతకాలం ఆయన చక్రం తిప్పారు. అత్యున్నత విధాన నిర్ణాయక విభాగం అయినా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, నాలుగైదు కీలక రాష్ట్రాలకు ఇంఛార్జిగా ఎదిగారు. ఏ పదవిలో ఉన్నా తన లౌక్యం, మాటతీరుతో నెగ్గుకువచ్చిన కేకే చాణక్యం ఆయనను పార్టీ పదవుల్లోనే కాకుండా, మూడు దఫాలుగా రాజ్యసభలో ఉండేలా చేసింది. మొదట కాంగ్రెస్ నుంచి 2006–12 మధ్యకాలంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్న ఆయన తన పదవీ కాలం ముగిసిన వెంటనే అప్పటి టీఆర్ఎస్‌లో చేరి 2014లో మళ్లీ రాజ్యసభకు టీఆర్ఎస్ నుంచి నామినేట్ అవడం అప్పటి తెలంగాణా ఉద్యమకారులను ఆశ్చర్యపరిచింది. తెలంగాణా ఉద్యమం మొదలుపెట్టిన వారినీ, ఆ తరువాత టీఆర్ఎస్ పుట్టిన నాటినుంచీ పనిచేసిన అనేకమంది మేధావులను, ఉద్యమకారులను కాదని కేసీఆర్ ఎందుకోగానీ కేకేను గట్టిగా నమ్మారు. అప్పుడు తెలంగాణా ఏర్పాటు డోలాయమానంగా ఉన్న కారణంగా కేకేకు కాంగ్రెస్‌తో ఉన్న అనుబంధం లాబీయింగుకు పనికొస్తుందని అందరూ దానిని ఆమోదించారు. ఆ తరువాత రెండోసారికూడా అప్పటికే తెలంగాణా పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఉన్న ఆయనను టీఆర్ఎస్ మరోసారి రాజ్యసభకు పంపించింది. ఇప్పుడు తన పదవీకాలం ఇంకా రెండొంతులు మిగిలి ఉండగానే ఆయన భారత రాష్ట్ర సమితిని వదిలి కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. చనిపోయేముందు కాంగ్రెస్ పార్టీలో ఉండాలని అనుకుంటున్నట్టు మీడియాలో వచ్చిన వార్తలు రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇది ఒక్క కేకే విషయంలోనే కాదు. గతంలో ధర్మపురి శ్రీనివాస్ విషయంలో కూడా ఇదే జరిగింది. తెలంగాణా ఏర్పడకముందు కాంగ్రెస్ పార్టీకి ఆయన అధ్యక్షుడు కూడా. ఆయన కూడా కాంగ్రెస్ ప్రభుత్వాల్లో మంత్రిగా ఉన్నారు. తీరా 2014లో ఆయన టీఆర్ఎస్‌లో చేరిందే తడవుగా కేసీఆర్ ఆయనను రాజ్యసభకు పంపించారు కానీ ఆయనకు కూడా నాలుగేళ్ల తిరగక ముందే కన్నతల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ గుర్తుకు వచ్చి రాజీనామా చేయకుండానే ఆ వొడిలో వాలిపోయారు. అప్పుడు ఆయన చెప్పిన మాటే ఇప్పుడు కేకే కూడా చెపుతున్నారు. దానం నాగేందర్ కూడా దాదాపు అదే చెపుతున్నాడు. ఈ ముగ్గురు కాంగ్రెస్ పార్టీ పాత కాపులకు దక్కిన మర్యాద, మన్నన కేసీఆర్ దగ్గర ఉద్యమకారులకు కూడా దక్కలేదన్నది వాస్తవం.

భారతదేశంలో ప్రజలు ఎవరికయినా సరే శాశ్వతంగా విధేయులుగా ఉండరు. ప్రజలకు తమ జీవితానుభవం, సామాజిక సంపర్కం ద్వారా సంక్రమించిన జ్ఞానం ఉంటుంది. ఇది ఇప్పుడే కాదు. గతంలో ఇండియాకు తానే ప్రతిరూపం అనుకున్న ఇందిరా గాంధీ, తెలుగుజాతికి స్ఫూర్తి దీపం అనుకున్న ఎన్‌టీరామారావుకు కూడా చరిత్రలో ప్రజలు ఇలాంటి పాఠాలు చెప్పారు. ఆ అనుభవాలను కూడా కేసీఆర్ ఆకళింపు చేసుకోలేకపోయారు. నమ్మాల్సిన వారిని నమ్మకపోవడం, అసలే నమ్మగూడని వారిని అందలం ఎక్కించడం కొన్నిసార్లు ఆశ్చర్యం కలిగించేది. అది ఆయనకు, ఆయన పార్టీకే కాదు తెలంగాణాకు కూడా చాలా నష్టం కలిగించింది. కోదండరాం విషయమే తీసుకుందాం, ప్రొఫెసర్ జయశంకర్ ప్రోది చేసిన విద్యావంతుల వేదిక నుంచి మొదలై, టీఆర్ఎస్‌కు తిరుగులేని పౌరసమాజ బలాన్ని సమకూర్చి, రాజకీయ ఐక్యకార్యాచరణలో కలిసి నడిచిన ఆయనను, ఆయన లాంటి అనేకమందిని అనుమానించి దూరం చేసుకున్నాడు. పది ఇరవై ఏళ్లుగా తెలంగాణా కోసం పనిచేసిన అనేకమంది మేధావులు, బుద్ధి జీవులు, ప్రజాసంఘాల నాయకులు, దళితులు, ముస్లింలు, మహిళలు, ఆదివాసీ బిడ్డలు, అటుకులు బుక్కి, అంబలి తాగి పోరాటంలో నిలబడ్డ వాళ్ళు తెలంగాణా పునర్నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోయారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా అప్పుడు అధికారంలో, పదవుల్లో, ఆంధ్ర పార్టీలతో అంటకాగిన వాళ్ళు తెలంగాణలో మంత్రులై , అధికారులే ఆధిపత్యం చెలాయించారు. దానం నాగేందర్, పట్నం మహేందర్ రెడ్డి చివరకు కడియం శ్రీహరి లాంటి అనేకమంది అయాచితంగా అధికారం చెలాయించారు. నిజానికి కడియం శ్రీహరి చివరంటా చంద్రబాబు నాయుడు వెంటే ఉన్నారు. ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌లో చేరి నేరుగా ఉపముఖ్యమంత్రి కాగలిగారు. ఎంపీగా, ఎంఎల్సీగా, ఎమ్మెల్యేగా అనేక అవకాశాలు పొందారు. చివరకు తన కూతురికి కూడా కేసీఆర్ అవకాశం ఇచ్చారు. కానీ ఆయన విధేయత చూపలేదు సరికదా ఇప్పుడు ఉన్నట్టుండి ఎదురు తిరిగారు. వ్యక్తిగతంగా అంతో ఇంతో విలువలతో బతికిన శ్రీహరి గారికి జీవిత చరమాంకంలో కూతురు భవిష్యత్తు ముఖ్యమని అనిపించింది. మంద కృష్ణ చెప్పినట్టు ఆయన ఒక్కడి వల్ల అక్కడ కనీసం నలుగురైదుగురు నాయకులు నష్టపోయారు. కేవలం కేసీఆర్ గుడ్డి నమ్మకం వల్లనే ఇదంతా జరిగింది అనే వాళ్ళూ బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఇలాంటి అంచనాలు తప్పడం మూలంగా ఇప్పుడు ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

> నిజానికి కేసీఆర్ అపరచాణక్యుడని ఇప్పుడు పార్టీ వీడుతున్న వారితో సహా చాలామంది అంటుంటారు కానీ అది ఉట్టి ప్రచారం అని తేలిపోతోంది. తెలంగాణాలో ఒక తిరుగులేని అస్తిత్వ శక్తిగా ఉండి తెలంగాణా సాధనను సాకారం చేసి, పదేళ్ల పాటు తెలంగాణా రాష్ట్రాన్ని తిరుగులేకుండా తీర్చిదిద్దామని చెప్పిన పార్టీ ఇప్పుడు దిక్కుతోచని దయనీయ స్థితిలో పడిపోయిందంటే కేసీఆర్ రాజకీయ చాణక్యం పనిచేయడం లేదని అర్థం అవుతోంది.



నమ్మాల్సిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని, పొంగులేటి శ్రీనివాస రెడ్డిని, నయాన్నో భయాన్నో కాపాడుకోవాల్సిన ఈటెల రాజేందర్‌ను కాపాడుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

నిజానికి కేసీఆర్ అపరచాణక్యుడని ఇప్పుడు పార్టీ వీడుతున్న వారితో సహా చాలామంది అంటుంటారు కానీ అది ఉట్టి ప్రచారం అని తేలిపోతోంది. తెలంగాణాలో ఒక తిరుగులేని అస్తిత్వ శక్తిగా ఉండి తెలంగాణా సాధనను సాకారం చేసి, పదేళ్ల పాటు తెలంగాణా రాష్ట్రాన్ని తిరుగులేకుండా తీర్చిదిద్దామని చెప్పిన పార్టీ ఇప్పుడు దిక్కుతోచని దయనీయ స్థితిలో పడిపోయిందంటే కేసీఆర్ రాజకీయ చాణక్యం పనిచేయడం లేదని అర్థం అవుతోంది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ఎందుకోగానీ కేసీఆర్ తనకు తిరుగులేదని అనుకున్నారు, తన మాటే శాసనం అనుకుని ప్రజల మనసులో ఏముందో గుర్తించలేకపోయారు. పద్నాలుగేళ్ల పాటు ప్రజల్లో ఉండి నడిపించిన నాయకుడు ప్రజల ఆలోచనలను గమనించలేక దూరమయ్యాడు. పార్టీ నిర్మాణం కూడా అవసరం లేదనే అభిప్రాయంలో తెలంగాణా అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణా అన్న ధోరణిలోకి వెళ్లారు. ప్రజలతో, పార్టీ శ్రేణులతో సంబంధం లేకపోవడం, పరిపాలన మీద పట్టు సడలడంతో పాటు ఇదంతా అహంకారం, దొరతనం, కుటుంబ ఆధిపత్యం అనే ప్రచారం ప్రజల్లోకి వెళ్లడం ఆ పార్టీని పదవిలోకి రాకుండా చేసింది. నిజానికి ఎన్నికల ప్రచారం నాటికి అవినీతి, అభివృద్ధి జరుగలేదనే విమర్శ పెద్దగా లేదు. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న కథనాలేవీ అప్పటికి బయటపడలేదు. అయినా ప్రజలు ఆ పార్టీని నమ్మలేదు. ఆ విషయాన్ని ఇప్పటికీ ఆ పార్టీ నమ్మడం లేదు, ప్రజల అభిప్రాయాన్ని గౌరవించడం లేదనుకోండి అది వేరే విషయం.

ఈ ఎన్నికల్లో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే పోటీ మొత్తం బీఆర్ఎస్ వెర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టుగా సాగుతోంది. ఇటువంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ ఎదురుకాలేదు. మల్కాజిగిరిలో ఈటెల రాజేందర్, సునీతా రెడ్డి, చేవెళ్లలో ప్రత్యర్థులుగా ఉన్న విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ తీర్చిదిద్దిన నాయకులే. రేపు వరంగల్ బరిలో కూడా ముగ్గురూ బీఆర్ఎస్ మూలాలనుంచి వచ్చిన వాళ్ళే పోటీ పడబోతున్నారు. ఆదిలాబాద్, జహీరాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్, మహబూబాబాద్, మెదక్ నియోజకవర్గాల్లో కూడా బీఆర్ఎస్ పోటీ పడుతున్నది పాత టీఆర్ఎస్ నేతలతోనే. వీళ్లంతా నాయకుడి అవిశ్వాసం వల్ల మాత్రమే బయటకు వెళ్లారు. ఈటెల, విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, బూర నర్సయ్య, సీతారాం నాయక్ వంటి తెలంగాణా ఉద్యమంలో ఉన్న వాళ్ళను ఒకరకంగా బలవంతంగా బయటకు పంపారు. ఇది ఇప్పుడు మొదటికే మోసం వచ్చే విధంగా తయారయ్యింది. రాజకీయాల్లో నిజానికి పార్టీ శ్రేణులకు అనుగుణంగా నడుచుకోవాలి. నాయకత్వం ప్రజాస్వామికంగా ఉండాలి. ఎదిగి వచ్చిన నాయకులను గౌరవించాలి. వారి శక్తి సామర్థ్యాలు గుర్తించాలి. మరోవైపు సిద్ధాంత ప్రాతిపదికన ఎదిగి నిలదొక్కుకోవాలి. కాంగ్రెస్ పార్టీ ఆ పని చేసింది, రేవంత్ రెడ్డి ఆ పార్టీలో చేరిన నాలుగేళ్లలో అక్కడ నాయకుడు కాగలిగాడు. అవసరాన్ని గుర్తించిన పార్టీ నలభై ఏళ్లుగా ఉన్న వాళ్ళను కూడా పక్కకు నెట్టి ఆయనను కూర్చోబెట్టి తెలంగాణలో నిలదొక్కుకోగలిగింది. భారతీయ జనతా పార్టీ తన సిద్ధాంతాన్ని తాను ప్రోది చేసుకుంటూనే నడిసొచ్చిన నేతలందరినీ తనలో కలుపుకుంటూ విస్తృతం అవుతోంది. ఈటెల రాజేందర్‌కు ఆ పార్టీ ఇస్తోన్న ప్రాధాన్యమే దానికి ఉదాహరణ. బీఆర్ఎస్‌లో ఈ రెండూ లోపించడం వల్లే ఇవాళ దూదిపింజలా తేలిపోతోంది. చాణక్య నీతి అంటే బలహీనుడైన శత్రువుతో స్నేహం చేసుకోవడం తప్ప బలహీనులను శత్రువులు చేసుకోవడం కాదు. అలా అయిన వాళ్లందరినీ బలహీనులని వదిలేసుకోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి. నిజానికి బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ఇంకా బలంగానే ఉంది. కొన్నిచోట్ల తన ప్రత్యర్థులకంటే కూడా. కానీ నాయకత్వం నైరాశ్యంలో పడిపోతోంది. రాజకీయాల్లో ఓడిపోతున్నామని తెలిసినా పోరాడి తీరాలి. గెలుస్తామన్న భరోసా శ్రేణులకు కలిగించాలి. ఈ విషయం తెలంగాణా ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్‌కు బాగా తెలుసు. కానీ ఆయన ఎందుకో అయోమయంలో ఉన్నట్టు కనిపిస్తోంది. అది కేవలం ఆ పార్టీకే కాదు. తెలంగాణాకు కూడా నష్టం. బీఆర్ఎస్ ఉనికిలో ఉండడం తెలంగాణ అవసరం.

○ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
(రాజకీయ విశ్లేషకులు)



లోక రక్షకా..





ఆబిడ్స్‌లో ఏసుప్రభువు శిలువ ప్రదర్శన దృశ్యం

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని నగరంలోని పలుచోట్ల క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తుకు శిలువ వేసిన క్రమాన్ని నాటకరూపంలో ప్రదర్శించి అప్పటి పరిస్థితులను కళాకారులు సాక్షాత్కరించారు. మియాపూర్ కల్వరీ టెంపుల్‌కు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఫాస్టర్ సతీష్‌బాబు ఏసు సందేశాన్ని, గుడ్‌ఫ్రైడే పవిత్రతను వివరించారు.



కల్వరిటెంపుల్‌లో ప్రార్థనలకు విచ్చేసిన భక్తులు

పిల్లలకు చదువు.. పెద్దలకు ఉపాధి

- యాచకులపై దృష్టిపెట్టిన స్త్రీ, శిశు సంక్షేమశాఖ
- బెగ్గర్ ఫ్రీ సిటీ దిశగా అడుగులు
- రోడ్ల వెంట, ఆలయాల వద్ద భిక్షాటన చేస్తున్న పిల్లలే లక్ష్యం
- నెలరోజుల వ్యవధిలో 223 మంది గుర్తింపు
- కలెక్టర్ అనుదీప్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా తనిఖీలు

నగరాన్ని బెగ్గర్‌ఫ్రీ సిటీగా మార్చేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యవేక్షణలో తనిఖీలు చేపడుతూ యాచకులను గుర్తిస్తున్నారు. పిల్లలకు చదువులు, పెద్దలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు కల్పిస్తున్నారు. కొందరిని ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు పంపిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు మహానగరానికి తరలి వస్తూ జీవనోపాధి పొందుతున్న విషయం తెలిసిందే. కొంతమంది రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవిస్తుండగా, మరికొందరు సులువైన యాచక వృత్తిని ఎంచుకుంటున్నారు. బడికి వెళ్లాల్సిన పిల్లలను తమతోపాటు వెంట పెట్టుకుని భిక్షాటన చేయిస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు.

24 గంటలపాటు బెగ్గింగ్..

సికింద్రాబాద్‌లోని సంగీత్ చౌరస్తా, ప్యారడైజ్, ప్యాట్నీ,

మిగతా 8వ పేజీలో..



- మూసాపేట, కుత్బుల్లాపూర్‌లో 42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు
- వడగాల్పులతో బెదురుతున్న ప్రజలు
- మరో రెండురోజులు ఇవే ఉష్ణోగ్రతలు : అధికారులు

రారెత్తిస్తున్న ఎండలు..!

గత పదేళ్లలో మార్చిలో నమోదైన రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు

సంవత్సరం	ఉష్ణోగ్రతలు (తేది)
2024	40.2 (29)
2023	39.4 (19)
2022	41.4 (21)
2021	39.8 (31)
2020	37.2 (30)
2019	40.2 (31)
2018	40.1 (31)
2017	40.5 (30)
2016	41.2 (19)

- భానుడి భగ.. భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి

గ్రేటర్‌లో ఎండలు రారెత్తిస్తున్నాయి. భానుడి భగభగలకు గ్రేటర్‌వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మధ్యాహ్నం బయట అడుగుపెట్టాలంటే బెంబేలెత్తుతున్నారు. ఉదయం 11 గంటల తర్వాత వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందని, జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్‌లో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యాయి. మూసాపేటలో 42.1, కుత్బుల్లాపూర్‌లో 42.0, హయత్‌నగర్‌లో 41.7, కాప్రాలో 41.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో కొనసాగితే ఏప్రిల్ రెండో వారానికి 45-46 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు చమటలు కక్కుతున్నారు. బయట తిరిగేవారు వడగాల్పులకు భయపడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో చిన్న పిల్లలు, సీనియర్ సిటిజన్లు బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గతేడాది మార్చితో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2023 మార్చి 19న అత్యధికంగా 39.4 డిగ్రీలు కాగా, ఈ ఏడాది మార్చి 29న 40.2, 2022 మార్చి 21న 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పదేళ్లలో నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇప్పటి వరకు ఇవే అత్యధికమని అధికారులు చెబుతున్నారు. కాగా, గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు ఇదే తరహా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని బేగంపేటలోని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

శుక్రవారం పలు ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం
మూసాపేట	42.1
కుత్బుల్లాపూర్	42.0
హయత్‌నగర్	41.7
కార్వాన్	41.7
ఖైరతాబాద్	41.5
కాప్రా	41.4
శేరిలింగంపల్లి	41.2
యూసుఫ్‌గూడ	41.1
బేగంపేట	41.0

- ఎండలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్
- రికార్డుస్థాయిలో 79.48 ఎంయూలు
- మార్చిలోనే మే తరహా వినియోగం



గిరగిరా మీటర్లు

ఎండ వేడికి విద్యుత్ వినియోగం పెరగడంతో మీటర్లు గిరగిరా తిరుగుతున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, కమర్షియల్ భవనాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం భారీగా పెరిగింది. దీంతో గ్రేటర్ జోన్‌లో గురువారం రికార్డు స్థాయిలో 79.48 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ డిమాండ్ నమోదైంది. సాధారణంగా ఏటా మేలో ఈ తరహా వినియోగం ఉంటుంది.

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గతేడాది మార్చిలో అత్యధికంగా 67.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదవగా, ఈ సంవత్సరం 79.48 ఎంయూలకు పెరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అత్యధిక డిమాండ్ ఇదే. ఉష్ణోగ్రతలు ఇదే తరహాలో పెరిగితే ఏప్రిల్‌లో 85-90 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంటుందని ఆ శాఖ అంచనా వేస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడ్ పడకుండా చర్యలు తీసుకుంటోంది. డిమాండ్ అధికంగా ఉంటున్న సైబర్‌సిటీ, మేడ్చల్, రాజేంద్రనగర్, హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్, సరూర్‌నగర్ సర్కిళ్లలోని సబ్‌స్టేషన్లను ఉన్నతాధికారులు పరిశీలించి అవసరమైనచోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు.

24/7 పర్యవేక్షణ..

గ్రేటర్‌లో పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో సరఫరా ఇబ్బందులు తలెత్తకుండా దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూక్‌తో పాటు మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ సీజీఎంలు, 9 సర్కిళ్ల ఎస్ఈలు 24 గంటలూ పర్యవేక్షిస్తున్నారు. డిమాండ్ ఏ స్థాయిలో పెరిగినా తట్టుకునేలా చర్యలు చేపడుతున్నారు. గ్రేటర్ పరిధిలోని 212 సెక్షన్ స్థాయి ఎఫ్ఓసీ కేంద్రాల్లో 800 మంది సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండేలా విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది. పీక్ అవర్స్ ముగిసేవరకు రోజూ రాత్రి తొమ్మిది గంటల వరకు ఇంజనీరింగ్ అధికారులు విధుల్లో ఉండాలని, సీజీఎంలు, ఎస్ఈలు విధిగా బస్తీలు, కాలనీల్లో పర్యటించాలని సీఎండీ ఆదేశించారు.

30 నిమిషాల్లో లైన్‌క్లియరెన్స్‌కు అనుమతులు

విద్యుత్ మరమ్మతులు, అభివృద్ధి పనుల నిర్వహణకు ప్రతి శనివారం ఉదయం ఒక్కో సబ్‌డివిజన్ పరిధిలోని 6 ఫీడర్లలో 30 నిమిషాల్లో లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకునే విధంగా డిస్కం ఆదేశాలు జారీచేసింది. ఎల్‌సీ ఏ ఫీడర్‌లో తీసుకున్నా రికార్డుపరంగా సమయం వివరాలు పక్కాగా నమోదయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అరగంట దాటితే సంబంధిత అధికారులపై చర్యలుంటాయని, ఎల్‌సీల అంశంపై నిర్లక్ష్యం వద్దని ఉన్నతాధికారులను సీఎండీ ఆదేశించారు.

రంగంలోకి కేటీఆర్

- లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- అంబర్‌పేటలో నేడు పాదయాత్ర



హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి బీఆర్ఎస్ నేడు శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే అభ్యర్థులు క్షేత్రస్థాయిలో పర్యటనలు, సమావేశాలు నిర్వహిస్తుండగా, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం నుంచి రంగంలోకి దిగనున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో అభ్యర్థి పద్మారావుగౌడ్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించనున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని పటేల్‌నగర్ నుంచి మొదలయ్యే పాదయాత్ర.. అక్కడి పలు కాలనీలు, బస్తీల్లో కొనసాగనుంది. మహానగరంలోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో గెలుపు కోసం బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఇక్కడి ప్రచారంపై పార్టీ పెద్దలు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల పార్టీ శ్రేణులతో తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. త్వరలో నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలూ నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు భిన్నంగా మహానగరవాసులు అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీకి పట్టం కట్టారు. గ్రేటర్‌లోని 24 నియోజకవర్గాలకు గాను 16 చోట్ల పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు కూడగట్టేందుకు తామే అభ్యర్థులుగా ప్రతి కార్యకర్త శ్రమించాలని సూచించిన కేటీఆర్ స్వయంగా క్షేత్రస్థాయి ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు.

సోషల్ వారియర్స్

- సోషల్‌మీడియా నిపుణులకు పార్లమెంట్ ఎన్నికల వేళ డిమాండ్
- రూ. లక్ష నుంచి లక్షన్నర ప్యాకేజీ
- ప్రత్యర్థులకు దీటుగా ప్రచారం చేసేలా అభ్యర్థుల వ్యూహం



హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగరంలో సోషల్ మీడియా వారియర్స్‌కు మళ్లీ డిమాండ్ పెరుగుతోంది. మంచి కంటెంట్‌తో పాటు సోషల్ మీడియాలో అనుభవం, రాజకీయ అవగాహన ఉన్న నిపుణులను ఆయా పార్టీల అభ్యర్థులు నియమించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోటీలో ఉంటున్న అభ్యర్థులు క్షేత్రస్థాయి ప్రచారం ఇప్పటికే మొదలుపెట్టారు. బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుంటున్నారు. కుల సంఘాలతో ఆత్మీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈమేరకు రోజువారీగా తాము చేస్తున్న ప్రచారాన్ని పార్టీకి చెందిన సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. సొంతంగా వారియర్స్ నియమించుకుని తమ పోస్టులను ప్రచారం చేయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి లక్షన్నర

ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థులు ప్రజలకు అతి త్వరగా చేరువయ్యేందుకు సోషల్‌మీడియాను నమ్ముకుంటున్నారు. తమ ప్రచార అంశాలను, వ్యక్తిత్వం, సేవాగుణం, గెలిస్తే పార్లమెంట్ సెగ్మెంట్‌లో చేపట్టనున్న పనులు, తదితర అంశాలకు సంబంధించిన వివరాలను సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు చేరవేసేందుకు

మిగతా 8వ పేజీలో..



ఫ్రాన్స్ రాయబారి బృందంతో అధికారులు

ఎల్‌అండ్‌టీని సందర్శించిన ఫ్రాన్స్ రాయబారి బృందం

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రోరైలు సంస్థను ఫ్రాన్స్ రాయబారి బృందం శుక్రవారం సందర్శించింది. భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ, ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ థియెరీ బెర్తెలాట్, హైదరాబాద్‌లోని బ్యూరో డి ఫ్రాన్స్‌లో డిప్యూటీ కాన్సుల్ పాస్కల్ లోరో, రీజినల్ ఎకానమిక్ సర్వీస్ (దక్షిణ భారతదేశం) ఎకానమిక్ కౌన్సెలర్ బెర్ట్రాండ్ డెలా ఫారెస్ట్ డీవోస్‌లకు.. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, ఎల్‌అండ్‌టీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్ చిప్లుంకర్‌తోపాటు కియోలిస్ హైదరాబాద్ ఎండీ ఎస్‌సీ విశ్రా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రోరైలు ఆపరేషన్స్, మెయింటనెన్స్ భాగస్వామిగా వ్యవహరిస్తున్న ఎల్‌అండ్‌టీ, కియోలిస్ పనితీరును ఫ్రాన్స్ బృందానికి అధికారులు వివరించారు. కాగా, హెచ్ఎంఆర్ నిర్వహిస్తున్న అధునాతన ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)ని ఫ్రాన్స్ బృందం సందర్శించింది. మొత్తం నెట్‌వర్క్‌కి సంబంధించిన రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు ఓసీసీ సెంట్రల్ హబ్‌గా వ్యవహరిస్తోందని ఎల్‌అండ్‌టీ అధికారులు వారికి వివరించారు. అనంతరం డాక్టర్ థియెరీ మాథ్యూ మాట్లాడుతూ హెచ్ఎంఆర్ పనితీరుకు సంబంధించి వివిధ అంశాలను తెలుసుకునేందుకు ఈ పర్యటన తమకు దోహదపడిందన్నారు.



ఎడాపెడా పేలుళ్లు!

- భవన నిర్మాణాల కోసం ఇష్టారాజ్యంగా ..
- కార్మికుల ప్రాణాలకు ముప్పు
- పక్కనున్న భవనాలపైనా ప్రభావం
- పట్టించుకోని నిర్మాణ సంస్థలు
- అనుమతి లేకుండానే మెజారిటీ బ్లాస్టింగ్‌లు
- హానర్స్ హోమ్ సైట్‌లో పేలుళ్లతో ప్రమాదం..
- ఇద్దరు కార్మికులకు తీవ్రమైన గాయాలు
- 20న అనుమతి ముగిసినా ఇంకా కొనసాగుతున్న బ్లాస్టింగ్

పట్టించుకోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీసులు

నిబంధనలను పట్టించుకోకుండా, కనీస జాగ్రత్తలు తీసుకోకుండా బడా నిర్మాణ సంస్థలు ఇష్టానికి స్టోన్ బ్లాస్టింగ్ చేస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగడంతోపాటు సైట్‌లో పని చేస్తోన్న కార్మికుల ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతున్నా పకడ్బందీ చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రస్తుతం వందల సంఖ్యలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఫౌండేషన్, సెల్లార్ల కోసం మెజార్టీ నిర్మాణదారులు 30 నుంచి 40 అడుగుల లోతు తవ్వుతున్నారు. దక్కన్ పీఠభూమి అయిన హైదరాబాద్ భూగర్భంలో ఎక్కువగా రాళ్లు ఉంటాయి. సెల్లార్ల నిర్మాణం కోసం తవ్వుతోన్న క్రమంలో ఆ రాళ్లను పేలుస్తున్నారు. ఇదే పలు ప్రాంతాల్లో ప్రమాదాలకు దారి తీస్తోంది. నగరంలో గతంలోనే బ్లాస్టింగ్ సందర్భంగా దుర్ఘటనలు జరిగాయి. వీటిలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. ఇంకొందరు గాయాలపాలయ్యారు.

అనుమతి లేకుండా..

భవన నిర్మాణాలకు సంబంధించి స్టోన్ బ్లాస్టింగ్‌కు స్థానిక పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్ణీత సమయంలోనే పేలుళ్లు చేయాలి. కానీ చాలా నిర్మాణ సంస్థలు అనుమతి తీసుకోకుండానే బ్లాస్టింగ్ చేస్తున్నాయి. కూకట్‌పల్లిలోని హానర్ హోమ్స్ సంస్థ బ్లాస్టింగ్‌కు తీసుకున్న అనుమతి ఈ నెల 20వ తేదీన ముగిసిందని పోలీసులు చెబుతున్నారు. అయినా ఆ సంస్థ బ్లాస్టింగ్ కొనసాగుతోంది. ఇదే విషయంపై పోలీసులు ప్రశ్నించగా.. ఎక్స్‌టెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం.. ఆ పత్రాలు అందజేస్తామని చెప్పినట్టు తెలిసింది. రాజకీయంగా, అధికారికంగా పలుకుబడి ఉండడంతో నిర్మాణ సంస్థలు ఇష్టానికి వ్యవహరిస్తున్నాయి. కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు నామ్ కే వాస్తేగా వారం, పది రోజులకు అనుమతి

మిగతా 8వ పేజీలో..

రైతు బ్రెయిన్‌డెడ్


జితేందర్‌రెడ్డి(ఫైల్)

● అవయవాలను సేకరించిన జీవన్‌దాన్

సనత్‌నగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్ అయిన రైతు అవయవాలను జీవన్‌దాన్ సభ్యులు సేకరించారు. మహబూబాబాద్ తొర్రూరుకు చెందిన రైతు విర్యాల జితేందర్‌రెడ్డి(48)కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 26న జితేందర్‌రెడ్డి బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినా స్పందించకపోవడంతో వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ సభ్యులు జితేందర్‌రెడ్డి కుటుంబసభ్యులను అవయవదానానికి ఒప్పించారు. జితేందర్‌రెడ్డి నుంచి లివర్, 2 కిడ్నీలు, 2 కార్నియాలు సేకరించారు.

ప్రేమించిన యువతికి మరో వ్యక్తితో పెళ్లి

●మనస్తాపంతో రైలుకింద పడి ప్రియుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యవతికి మరో వ్యక్తితో పెళ్లి అవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ ప్రేమికుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లికి చెందిన సందీప్ కుష్వా(21) పెయింటర్‌గా పనిచేశాడు. ఓ అమ్మాయిని ప్రేమించగా ఈ మధ్యే ఆమె మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం మేడ్చల్- గుండ్ల పొచంపల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల్‌రెడ్డిని అభినందిస్తున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన ఎన్నికల ఫలితాలను రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌రెడ్డి పామ్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ గులగారి, సంయుక్త కార్యదర్శిగా రాధాకృష్ణ బొమ్మరాజు, మహిళా సంయుక్త కార్యదర్శిగా మీనాక్షి, కోశాధికారిగా కీర్తికుమారి గుర్రంపల్లి, లైబ్రేరియన్‌గా రాములు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా అశోక్ అందేకార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్‌కుమార్‌గౌడ్, రవి బుక్యా, సందీప్ బద్దెల, శైలజ చింతల, స్వప్న కొంద్ర, వంశీకృష్ణ బొరంపేట, విజయ్‌చంద్ర కిరణ్ ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి ప్రకటించారు. వీరి పదవికాలం 2024-25 వరకు ఉంటుందన్నారు.

పీఎఫ్ క్లెయిమ్స్‌పై 'గీతమ్'లో చర్చాగోష్ఠి

పటాన్‌చెరు రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): భవిష్యనిధి (పీఎఫ్) క్లెయిమ్‌లు, చట్టబద్ధమైన అంశాల పునరావలోకనంపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో చర్చాగోష్ఠి నిర్వహించారు. హైదరాబాద్ ఇన్‌స్వాలెన్సీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(హెచ్‌ఐపీఏ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఎఫ్ క్లెయిమ్, ఇన్‌స్వాలెన్సీ అండ్ బ్యాంకు రప్సీకోడ్, 2016 (ఐబీసీ) గురించి చర్చించి, వాటికి పరిష్కారమార్గాలను చూపారు. పటాన్‌చెరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-1 విశాల్ అగర్వాల్, చార్టర్డ్ అకౌంటెంట్, ఇన్‌స్వాలెన్సీ ప్రొఫెషనల్ మల్లికార్జున్, మహదేవ్ తిరునగరి హాజరై అవగాహన కల్పించారు. ఉద్యోగుల భవిష్యనిధి ప్రభావం గురించి న్యాయవాది, కంపెనీ సెక్రటరీ షేక్ గౌస్ వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఐసీపీఏ సభ్యులు, ఉద్యోగుల భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయం పటాన్‌చెరు, బర్కత్‌పుర, మాదాపూర్, కూకట్‌పల్లి అధికారులు పాల్గొన్నారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, తదితరులు

భాగ్యలక్ష్మి ఆలయంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ పూజలు

చార్మినార్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 15 స్థానాలు బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఎంపీగా గెలిచేలా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో సునీల్, జైశంకర్, నరేందర్ యాదవ్, యాదగిరి, రవి, కుమార్, సరస్వతి, జ్యోతి, నవీన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న డీసీపీ పరవస్తు మధుకర్‌స్వామి

ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ

కార్వాన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికంగా ఎదగడానికి స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని అంబర్‌పేట్ పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్, డీసీపీ పరవస్తు మధుకర్‌స్వామి అన్నారు. మల్లేపల్లి సీతారాం బాగ్‌లోని ఈశ్వరచంద్ర చారిటబుల్ ట్రస్ట్‌లో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ సహకారంతో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధుకర్‌స్వామి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాంబాగ్ పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ మహిళలకు పలు స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ చైర్మన్ ముప్వ రాంరెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, డాక్టర్ విద్యాభూషన్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎయిర్ పిస్తోల్ చూపుతున్న మీర్ చౌక్ ఏసీపీ

పెట్రోల్‌బంక్‌లో ఎయిర్‌గన్‌తో హల్‌చల్ చేసిన యువకుల అరెస్ట్

చార్మినార్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్యూ లైన్‌లో రాకుండా పెట్రోల్ పంపులో పెట్రోల్ పోయాలంటూ పిస్తోల్ చూపించి బెదిరించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎయిర్ పిస్తోల్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం మీ చౌక్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై అరుణోదయతో కలసి వివరాలను వెల్లడించారు. ఏతేబర్ చౌక్‌లోని పెట్రోల్ పంపులో క్యూలైన్‌లో రాకుండా అడ్డంగా వచ్చి పెట్రోల్ పోయాలని ఇద్దరు యువకులు గొడవకు దిగగా పెట్రోల్ బంక్ సిబ్బంది క్యూ లైన్‌లో రావాలని చెప్పారు. దాంతో ఓ యువకుడు రాడ్డుతో దాడికి ప్రయత్నించగా అతడిని అడ్డుకున్నారు. మరో వ్యక్తి పెట్రోల్ బంక్ సిబ్బందిపై తుపాకీ ఎక్కుపెట్టడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది ధైర్యం చేసి ఆ ఇద్దరిని పట్టుకున్నారు. వారిని మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్తుండగా రెప్పపాటులో పరారయ్యారు. పెట్రోల్ బంక్ మేనేజర్ వినయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌చౌక్ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తు, శుక్రవారం ఇద్దరు బర్కత్ అలీ అలియాస్ జహిద్(24) మొహమ్మద్ అర్షద్ అలియాస్ అషలను గంగనగర్ వద్ద అదుపులోకి తీసుకోని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. ఎయిర్ గన్ తో బెదిరించమని అంగీకరించారు. వారిపై ఇప్పటికే పదహారు ఇ పిట్టి కేసులు ఉన్నాయని జైలు శిక్ష కూడా పడిందని తెలిపారు. ఇద్దరిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని ఏసీపీ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్

వీడియో వైరల్ చేసిన నలుగురి అరెస్ట్

చార్మినార్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ రోజు మక్కా మసీద్ వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసిన వీడియో వైరల్ చేసిన సంఘటనలో నలుగురు యువకులను చార్మినార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం చార్మినార్ ఏసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. హోలీ పండుగ రోజు మక్కా మసీదు వద్ద ఓ వ్యక్తిపై దాడి చేస్తూ వీడియో రికార్డ్ చేసి వైరల్ చేశారు. ఈ విషయంపై చార్మినార్ ఎస్సై మహమ్మద్ ఖలీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చార్మినార్ పోలీసులు సీసీ టీవీలు పరిశీలించి వీడియో వైరల్ చేసిన సంఘటనలో బార్కస్‌కు చెందిన షేక్ అయ్యాన్, వెంకటాపూర్‌కు చెందిన సయ్యద్ ఫిరదోస్, బండ్లగూడకు చెందిన మొహమ్మద్ షహెబాజ్, శాలిబండకు చెందిన మొహమ్మద్ ఫర్హాన్ అహ్మద్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు, ఎవరైనా అమాయకులపై దాడులు చేసి వీడియో రికార్డింగ్ చేసి వైరల్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలిక మృతి

గోషామహల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలిక ఉరేసుకుని చనిపోయిన సంఘటన శుక్రవారం షాహినాథ్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... గోషామహల్ జోషివాడకు చెందిన డిల్లు, ఆస్మితలు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వృత్తిరీత్యా డిల్లు పాత సామాగ్రిని కొనుగోలు చేసి విక్రయిస్తాడు. భార్యాభర్తలిద్దరూ పని కోసం బయటికి వెళ్లే ముందు ముగ్గురు పిల్లలను ఇంట్లోనే ఉంచి వెళ్లారు. గురువారం కూతురు పవిత్ర(6) ఇంట్లో ఆడుకుంటుండగా మధ్యాహ్నం సమయంలో తల్లి ఇంటికి వచ్చి అన్నం పెట్టి తిరిగి పనికి వెళ్లింది. పని ముగించుకొని రాత్రి 8.30 గంటలకు తల్లి ఇంటికి చేరుకొని తలుపులు తెరిచి చూసేసరికి పవిత్ర చున్నీ బిగించుకొని అపస్మారకస్థితిలో ఉంది. వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పవిత్ర (ఫైల్)

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

రాజేంద్రనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యేసు క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను చర్చీలకు చెందిన ఏడుగురు సభ్యులు వివరించారు. తండ్రియైన యెహోవా దేవుని ఆజ్ఞానుసారం భూలోకానికి వచ్చిన యేసుక్రీస్తు ముప్పైమూడు సంవత్సరాలు జీవించి సర్వ మానవాళి పాప పరిహారార్థం కలువరి గిరిలో సిలువపై మరణించి మూడవ దినమున లేచిన గొప్ప దేవుడని గుర్తు చేసుకుంటు ప్రార్థనలు చేశారు.

రాజేంద్రనగర్ మన్నా చర్చిలో.....

రాజేంద్రనగర్ మన్నా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్‌మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు జరిగాయి. ఈ సందర్భంగా సిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను సిస్టర్ పి.అనిత, సిస్టర్ ఇ.సుష్మ, సిస్టర్ డి.అమృత, సిస్టర్ బి.సంగీత, సిస్టర్ డి.సుష్మ, బ్రదర్ ఎ.డానియేల్, సిస్టర్ శాంతి వివరించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్‌మోజెస్ గుడ్ ఫ్రైడే ప్రత్యేకతను వివరించారు. సిస్టర్ సీహెచ్ ప్రభావతి ప్రార్థనలు చేశారు. క్వయర్ బృందంచే క్రైస్తవ ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు.



బైబిల్ సందేశాలను వివరిస్తున్న రెవరెండ్ సీహెచ్ జాన్‌మోజెస్

వివిధ చర్చీలలో

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వివిధ చర్చీలలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు ఘనంగా జరిగాయి. బుద్వేల్ సాయి కృష్ణకాలనీలో బెథెస్తా మిషన్ గాస్పెల్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ కె.నతానియేల్, కోనేటి ప్రార్థన మందిరం రెవరెండ్ ఎస్.యేసుమణి, అత్తాపూర్ రాక్ చర్చిలో రెవరెండ్ సుందర్‌పాల్, ఉప్పర్‌పల్లి హోరేబు గాస్పెల్ చర్చిలో రెవరెండ్ పి.స్వర్ణకుమార్‌తో పాటు అత్తాపూర్, హైదర్‌గూడ చర్చీలలో బ్రదర్ రాజ్‌కుమార్, పాస్టర్ పాల్మాకుల మధు, రెవరెండ్ జేపీ పాల్, బవానీ కాలనీలో రెవరెండ్ ఎమనోహరం, దుర్గానగర్ ఎలోహిం ప్రార్థన మందిరంలో రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, లక్ష్మీగూడ జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్‌లో పాస్టర్ జాన్‌వెస్లీ, మధుబన్‌కాలనీలో రెవరెండ్ విజయ్‌కుమార్, పాస్టర్ షాలేం రాజు, పాస్టర్ పాల్‌దేవరాజుల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు జరిగాయి.

మాత విశాల్ జాగరణకు ఆహ్వానం

గోషామహల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ నియోజకవర్గంలో ఏప్రిల్ 10వ తేదీన లోధ్ యువ సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ మాత విశాల్ జాగరణ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నంద కిశోర్ వ్యాస్ బిలాల్‌కు ఆహ్వానం పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా లోధ్ యువ సంఘటన్ అధ్యక్షులు బల్దీప్ సింగ్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గంగాబౌలి రాణి అవంతిభాయి భవన్ వద్ద పెద్ద ఎత్తున మాత విశాల్ జాగరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరవుతారని.. వారందరికీ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యువ సంఘటన్ నాయకులు అర్జున్ సింగ్, తుల్జారాం సింగ్, దుర్గేశ్ సింగ్, రాజేశ్వర్ సింగ్, నర్సింగ్ సింగ్, ఆశీష్ పండిత్ తదితరులు పాల్గొన్నారు.



నందకిశోర్ వ్యాస్‌బిలాల్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బల్దీప్ సింగ్, అర్జున్ సింగ్



ఈటల రాజేందర్‌తో బేగంబజార్ బీజేపీ నాయకులు శ్రీకాంత్, కుంతిబర్ శివాజీ

ఈటలను గెలిపిస్తాం: బీజేపీ నాయకులు

గోషామహల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ 14 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని బీజేపీ నాయకులు శ్రీకాంత్, కుంతిబర్ శివాజీ అన్నారు. శుక్రవారం ఈటల రాజేందర్‌ను బీజేపీ కార్యాలయంలో కలిసి ఎన్నికల ప్రచారం పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్, కుంతిబర్ శివాజీ మాట్లాడుతూ ఈటల రాజేందర్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రాజేంద్రనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, హైదర్‌గూడ చౌరస్తా, ఉప్పర్‌పల్లిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు.

హైదర్‌గూడ చౌరస్తాలో

అత్తాపూర్, హైదర్‌గూడ చౌరస్తాలలో టీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్‌టీ రామారావును గుర్తు చేసుకున్నారు. పార్టీ స్థాపించిన ఆరు నెలల్లోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన గొప్ప నాయకుడు నందమూరి తారకరామారావు అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమారం రాజ్‌కుమార్, కృష్ణారెడ్డి, ఎస్.శేఖర్ రెడ్డి, బి.జంగయ్య, ఎ.బాల్‌రాజ్, జి.రాఘవులు, కె.తామోదన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జయవంత్‌రావు, ఆర్.బాలప్ప, చంద్రశేఖర్ పాండ, గోపాల్, సోమేశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



అత్తాపూర్, హైదర్‌గూడ చౌరస్తాలో టీడీపీ జెండాను ఎగురవేస్తున్న మ్యాడం రామేశ్వర్‌రావు

ఉప్పర్‌పల్లిలో

ఉప్పర్‌పల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డి కేక్ కట్ చేశారు. తెలుగు దేశం పార్టీ అన్ని వర్గాల పార్టీ అని గుర్తు చేశారు.

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలిపింది తెలుగుదేశం ప్రభుత్వ హయంలోనేనని గుర్తు చేశారు.



చాంద్రాయణగుట్టలో ఎన్టీరామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



స్వాధీనం చేసుకున్న బైకులతో నిందితుడు మహ్మద్ అక్బరుద్దీన్

బైక్ స్క్రాప్‌తో బైకుల తయారీ

- ఛాసిస్ నెంబర్ మార్చి నకిలీ పత్రాల తయారీ
- నిందితుడి అరెస్ట్. 7 బైకులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్క్రాప్ వాహనాల నుంచి విడి భాగాలు సేకరించి తయారు చేసిన వాహనాలకు నకిలీ ఛాసిస్ నంబర్లు, నకిలీ పత్రాలు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్, ఆబిడ్స్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. కింగ్ కోఠి షేర్‌గేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అక్బరుద్దీన్ (34) లేట్ మిషన్ పని చేసేవాడు. వచ్చిన సంపాదన అవసరాలకు సరిపోకపోవడంతో స్క్రాప్ వాహనాలు తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటి స్పేర్ పార్ట్‌లను కలిపి బైకులను తయారు చేస్తున్నాడు. ఈ వాహనాలకు తన వద్ద ఉన్న ఉపకరణాలతో ఛాసిస్ నెంబర్లు వేసి, నకిలీ పత్రాలను సృష్టిస్తున్నాడు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇతడి దందాపై పక్కా సమాచారమందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఆబిడ్స్ పోలీసులతో కలిసి ఇతడి దుకాణంపై దాడి చేశారు. అతడి వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన 7 బైకులు, కటింగ్ మిషన్, 40 ఆల్ఫాబెట్ డైలు, 9 నెంబర్ డైస్‌లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఆబిడ్స్ పోలీసులకు అప్పగించారు.



సామూహికంగా ఉపవాసం విరమిస్తున్న ముస్లింలు

పాతబస్తీలో ఇఫ్తార్ విందుల సందడి

మదీన, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాసదీక్షల సందర్భంగా పాతబస్తీలో ఎక్కడ చూసినా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. ముస్లింలే కాకుండా హిందువులు కూడా తమ దుకాణాలకు వచ్చే వినియోగదారులకు ఇఫ్తార్ విందు ఏర్పాట్లు చేస్తున్నారు. చార్మినార్, లాడ్‌బజార్, పటేల్ మార్కెట్ తదితర ప్రధాన మార్కెట్లలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమకు పరిచయమున్న ముస్లిం స్నేహితులను ఇఫ్తార్ విందులకు ఆహ్వానించి సోదరభావాన్ని, మతసామరస్యాన్ని చాటుకుంటున్నారు. పాతబస్తీలోని అనేక ప్రభుత్వ, ప్రైయివేటుట్ కార్యాలయాలల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నారు.

నగరంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ప్రముఖ పారిశ్రావికవేత్త శరద్ పిట్టిని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ ఆధ్వర్యంలో ఆయనకు అయోధ్య రామ మందిర నమునాను అందజేసి ఘనంగా సత్కరించారు.
-గోషామహల్, ఆంధ్రజ్యోతి



స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

▸▸ రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం

శంషాబాద్, మార్చి 29: స్క్రాప్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న ఘటన శుక్రవారం ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడలో గల ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ(ఇండేన్) సమీపంలో ఉన్న కేబీఎస్ ఐరన్, స్టీల్ అండ్ ఓల్డ్ స్క్రాప్ దుకాణంలో ఉదయం 8.30 గంటలకు మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల ఇళ్లలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. మంటలు అంటుకున్న గంట తర్వాత ఫైర్ ఇంజన్ రావడంతో సిబ్బంది మంటలార్పే యత్నం చేశారు. కాగా, స్క్రాప్ దుకాణంలో పెద్దఎత్తున సామగ్రి ఉండటంతో మంటలు భారీఎత్తున ఎగిసిపడ్డాయి.

మంటలు అదుపులోకి రాకపోవడంతో మరో ఫైర్ ఇంజన్‌ను తెప్పించారు. అయినా, నీరు సరిపోకపోవడంతో స్థానికులు, అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. శంషాబాద్-షాబాద్ ప్రధాన రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. అయితే, పక్కనే ఉన్న గ్యాజ్ ఏజెన్సీలో సిలిండర్లు ఉండటంతో.. ఒకవేళ వాటికి మంటలు అంటుకుంటాయేమోనని ప్రజలు, పోలీసులు, ఫైర్ సిబ్బంది భయందోళనకు గురయ్యారు. స్థానికులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్లను అక్కడి నుంచి దూరంగా తరలించారు. కాగా, ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్క్రాప్ దుకాణం యాజమాని ఫిర్యాదు చేశాడు. ఈమేరకు గ్యాజ్ ఏజెన్సీ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాల్‌రాజ్ తెలిపారు. దాదాపు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇళ్ల మధ్య నుంచి స్క్రాప్ షాపును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4cvAPNB **లో చదవండి.**
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminar**లో చూడగలరు.**
నోట్: htpps://epaper.andhrajyothy.com**లో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.**

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పహాడి షరీఫ్ మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్‌లో 11 కేవీ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7.30 నుంచి 8.00 గంటల వరకు ఈ క్రింది ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని పహాడిషరీఫ్ ఏఈ సత్యనారాయణ తెలిపారు. పహాడి షరీఫ్, దేవేందర్ కాలనీ, రంగనాయకుల కాలనీ, పహాడిషరీఫ్ దర్గా, అబ్బుషేర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి, సహకరించగలరని కోరారు.

రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ ఏఈ హథీరామ్ తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 8:30 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా సత్సంగ్ విహార్, గోల్డెన్ హైట్స్ కాలనీ, జనచైతన్య ఫేజ్-2, జనచైతన్య ఫేజ్-3 లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కాటేదాన్‌లో...

కాటేదాన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గగన్‌పహడ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు. శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 9 గంటల వరకు గంగోత్రి పారిశ్రామిక ప్రాంతం, అమ్మా గార్డెన్, టీఎన్‌జీవోస్ కాలనీ, గణేశ్‌నగర్, స్వప్న థియోటర్ ప్రాంతాలలో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నార్సింగ్‌లో..

నార్సింగ్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు.

11 కేవీ సెక్రటరియేట్ ఫీడర్ పరిధి, 33/11 కేవీ పుప్పాల్‌గూడ ఎస్ఎస్ ఫీడర్ పరిధిలోని సెక్రటరియేట్ కాలనీ, ఆధిత్య ఫోర్ట్ విల్లాస్ నుంచి చింతచెట్టు వరకు ఉదయం 6:30 గంటల నుంచి 7:00 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయబడుతుంది.

11 కేవీ ల్యాంకోమిల్స్, 33/11 కేవీ పుప్పాల్‌గూడ ఎస్ఎస్ ఫీడర్ పరిధిల్లోని అల్కాపూర్ రోడ్డు నెంబర్-1 అండ్ 13 వరకు ఉదయం 7:30 నుంచి 8:00 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయబడుతుంది.

11 కేవీ హనుమాన్ నగర్‌ఫీడర్, 33/11 కేవీ మణికొండ ఎస్ఎస్ ఫీడర్ పరిధిలోని హనుమాన్‌నగర్, శివపురి కాలనీ, మర్రిచెట్లు నుంచి పంచవటి రోడ్డు వరకు ఉదయం 8:30 నుంచి 9:00 గంటల వరకు కరెంటు నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస చారి

చార్మినార్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వై శ్రీనివాసచారి, ఉపాధ్యక్షుడిగా ఎం. ప్రవీణ, ప్రధాన కార్యదర్శిగా హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా రాజేష్ కుమార్, లైబ్రేరియన్‌గా సుధాంశు కుమార్, కోశాధికారిగా విశాల్ సింగ్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా సైదిరెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్‌గా జస్వంత్ కౌర్, కార్యవర్గ సభ్యులుగా అశోక్, భానుచందర్, మహమ్మద్ బర్కత్ అలీ, రాజు, వాస మధుసూదన్, వినోద్ కుమార్, సవిత మిశ్రా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి దీపక్ సంచెటి తెలిపారు.




శ్రీనివాస చారి అధ్యక్షుడు



207 పిల్లర్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందిపై దాడి చేస్తున్న చిరు వ్యాపారులు

జీహెచ్ఎంసీ కార్మికులపై చిరు వ్యాపారుల దాడి

రాజేంద్రనగర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం జీహెచ్ఎంసీ కార్మికులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని 207 పిల్లర్ దగ్గర ఫుట్‌పాత్‌పై కొందరు కొబ్బరి బోండాలు విక్రయిస్తున్నారని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు కొందరు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల సూచన మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనం సిబ్బంది అక్కడికి వెళ్లి కొబ్బరి బోండాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో ముగ్గురు చిరు వ్యాపారులు అక్కడికి చేరుకుని కట్టెలతో, రాళ్లతో జీహెచ్ఎంసీ సిబ్బందిపై దాడులకు దిగారు. దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని జైపాల్‌రెడ్డి కోరారు.



మిత్రకృష్ణకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ, రోహిన్‌రెడ్డి, ముల్బార్‌ఖాన్

కాంగ్రెస్ గూటికి మిత్రకృష్ణ

కార్వాన్, గోషామహల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మిత్రకృష్ణ బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, అంబర్‌పేట్ కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ముల్బార్‌ఖాన్ ఆధ్వర్యంలో మిత్రకృష్ణ కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మిత్రకృష్ణకు దీపాదాస్ మున్షీ, రోహిన్‌రెడ్డిలు కాంగ్రెస్ కండువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యువనాయకుడు మిత్ర అభిషేక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో భారతీయ కళాకృతుల ప్రదర్శన


విగ్రహం గురించి వివరిస్తున్న మాల్కమ్ టోడీవాలా

హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహోన్నత భారతీయ కళా వైభవానికి ప్రతీకగా నిలిచే విగ్రహాలు, పెయింటింగ్స్ వెండి నాణెములతో ఒక ప్రదర్శనను బంజారాహిల్స్‌లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్నారు. త్వరలో ముంబైలో నిర్వహించనున్న వేలంలో అందుబాటులో ఉంచనున్న ఈ కళాకృతులను అభిరుచి కలిగిన నగరవాసుల కోసం ప్రత్యేకంగా తీసుకువచ్చి ప్రదర్శిస్తున్నామని టోడీవాలా ఆక్షన్స్ హెడ్ మాల్కమ్ టోడీవాలా తెలిపారు. ఏప్రిల్ 1 వరకూ కళాకృతి ఆర్ట్‌గ్యాలరీలో వీటిని ప్రదర్శించనున్నామని తెలిపారు. 9-10 శతాబ్దాల నాటి శిల్పకళా సౌందర్యంతో పాటుగా 18వ శతాబ్దంలో మొఘల్ ఆర్టిస్ట్ ముహ్మద్ అఫ్జల్ చిత్రించిన దివాలీ, 400ఏళ్ల నాటి రామాయణ చిత్రాలు వంటివి కూడా ప్రదర్శిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా పలు నగరాలలో ఈ ప్రదర్శనలను చేస్తున్నామని, ఏప్రిల్ 16న ముంబైలో వీటిని వేలం వేయనున్నామని తెలిపారు.

ముక్తార్ అన్సారీ మృతిపై విచారణ జరిపించాలి

● మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ

మదీన, మార్చి29(ఆంధ్రజ్యోతి): జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ ముక్తార్ అన్సారీ మరణంపై నిష్పాక్షిక విచారణ జరిపించాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో కేసు వేసినపుడు ముక్తార్ అన్సారీని జైలులోనే హతం చేస్తారేమోనని కుటుంబసభ్యులు ఆందోళన చెందారని ఒవైసీ గుర్తు చేశారు. జైలులోనే స్లోపాయిజన్ ఇచ్చి ముక్తార్‌ను అంతం చేశారని ఆయన కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా ఆయన అస్వస్థతకు గురైనపుడు ఆస్పత్రికి తరలించి పూర్తిగా కోలుకోకముందే తిరిగి జైలుకు తరలించారని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో తుపాకీ పాలన సాగుతున్నదని ఆరోపించారు. అన్సారీ మరణంపై న్యాయవిచారణకు ఆదేశించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒవైసీ డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోర్రా ఈశ్వర్‌లాల్

డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సర్వీస్‌ను కంటిన్యూ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కోర్రా ఈశ్వర్‌లాల్, ప్రధాన కార్యదర్శి బుచ్చిపాల్‌రెడ్డి, కోశాధికారి నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 1600మంది గెస్ట్‌లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పీరియడ్ విధానాన్ని రద్దు చేసి 12నెలలకు పూర్తి జీతాలు చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గెస్ట్ లెక్చరర్లకు రూ.50వేల వేతనం చెల్లించాలని కోరారు. గెస్ట్ లెక్చరర్‌లకు ఈఎస్ఎస్‌తోపాటు 10లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని వారు కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

గుండ్లకమ్మ-దర్శి మధ్య కొత్త రైల్వే లైన్ షురూ

●దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని నడికుడి- శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వేలైన్ ప్రాజెక్ట్‌లో భాగంగా గుండ్లకమ్మ-దర్శి మధ్య 27కిమీ మేర కొత్త రైలుమార్గం పనులు పూర్తి కావడంతో రైళ్ల రాకపోకలను ప్రారంభించినట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. దీంతో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పరిసర కొత్త ప్రాంతాలకు రైలు నెట్‌వర్క్ విస్తరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. నడికుడి-శ్రీకాళహస్తిల మధ్య 2011-12 సంవత్సరంలో 309కి.మీ మేర నూతన రైల్వేలైన్ ప్రాజెక్టును రూ. 2,289 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్టు అధికారులు వివరించారు. రైల్వే- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 50-50 భాగస్వామ్య ప్రాతిపదికన ప్రాజెక్టునకు రూపకల్పన చేసినట్టు పేర్కొన్నారు. ఐదు దశల్లో చేపట్టిన ప్రాజెక్టులో మొదటిదశలో పిడుగురాళ్ల- శావల్యాపురం (47 కి.మీ) ఇప్పటికే పూర్తి చేసినట్టు వివరించారు. నడికుడ-పిడుగురాళ్ల మధ్య ఉన్న సెక్షన్ బీబీనగర్‌ను గుంటూరుతో కలిపే లైన్‌లో ఉందన్నారు. శావల్యాపురం- గుండ్లకమ్మ మధ్య ఉన్న సెక్షన్ గుంటూరును గుంతకల్‌తో కలిపే ప్రస్తుత రైలు మార్గంలో వస్తుందని తెలిపారు.

తాజాగా రెండోదశ గుండ్లకమ్మ- దర్శి మధ్య 27కి.మీల విస్తరణ పూర్తి చేసి ప్రారంభించడంతో నడికుడ- దర్శి మధ్య నిరంతరాయంగా 122 కిలోమీటర్ల రైలుమార్గంలో రైళ్ల రాకపోకలకు అవకాశం లభిస్తుందన్నారు. మూడో దశ దర్శి- కనిగిరి 52కి.మీ, వెంకటగిరి- అల్తూరిపాడు 15కి.మీ, నాల్గోదశ కనిగిరి- పామూరు 35కి.మీ, అట్లూరిపాడు- వెంకటాపురం 43 కి.మీ, ఐదవ దశలో పామూరు- ఓబులాయపల్లె- వెంకటాపురం 90కి.మీ వరకు రైలుమార్గాన్ని విస్తరించాల్సి ఉన్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసిన పక్షంలో ఇది విజయవాడ- చెన్నై మధ్య ప్రస్తుత కోస్టల్ రైల్వేలైన్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుందన్నారు.అలాగే ఖనిజ సంపన్న బెల్ట్‌లో సరుకు రవాణాను సులభతరం చేస్తుందని తెలిపారు. ప్రధానంగా ప్రాజెక్టు పనులు పూర్తయితే గుంటూరు- తిరుపతి మధ్య షార్ట్ రూట్ మార్గంగా ఉపయోగపడుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

31న సికింద్రాబాద్‌నుంచి సిల్చార్‌కు ప్రత్యేక రైలు

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు మార్చి 31 ఆదివారం సికింద్రాబాద్ నుంచి సిల్చార్‌కు వన్‌వే ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలియజేశారు. సికింద్రాబాద్ నుంచి (07050) ప్రత్యేక రైలు 16:35 గంటలకు బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు జంక్షన్, విజయవాడ జంక్షన్, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం జంక్షన్, శ్రీకాకుళం రోడ్, పలాస, బెర్హంపూర్, బలుగాన్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ కె.రోడ్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్ జంక్షన్, దంకుని, బోల్పూర్ రాంపూర్ హాట్, న్యూ ఫరక్కా జంక్షన్, మాల్డాటౌన్, బర్సోయ్‌జంక్షన్, కిషన్‌గంజ్, న్యూ జల్‌పాయిగురి, న్యూ కూచ్ బెహార్, న్యూ అలిపుర్‌దర్, న్యూ బొంగైగాన్, రంగీయా జంక్షన్, కామాఖ్య, గౌహతి, జాగీ రోడ్, హోజై, మాండర్‌డిసా, న్యూ హాఫ్లాంగ్, బదర్‌పూర్ జంక్షన్ స్టేషన్‌ల మీదుగా సిల్చార్‌కు 23:20కి చేరుతుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

సోషల్‌వారియర్స్

(5వ పేజీ తరువాయి)

వారియర్స్‌ను నియమించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కొంత మంది అభ్యర్థులు నెలకు రూ.30 వేల నుంచి రూ.50వేలు ఇచ్చి సోషల్ మీడియా టీమ్‌ను ఏర్పాటు చేసుకోగా, పార్లమెంట్ నేపథ్యంలో రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యటించడం కష్టంగా ఉంటున్న తరుణంలో మంచి సందేశాలు, కంటెంట్లు తయారుచేసి ఎప్పటికప్పుడు పోస్టులు చేసే అనుభవం కలిగిన సోషల్ వారియర్స్‌ను నియమించుకుంటున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్‌లో టెక్నాలజీపరంగా పట్టుకలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వాట్సప్‌లో బ్రాడ్‌కాస్టింగ్‌ను వినియోగించి పోస్టులను అభ్యర్థి అనుచరులకు, కార్యకర్తలకు పంపుతున్నారు. అక్కడి నుంచి డివిజన్లు, బస్తీల వారీగా ఉన్న వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అభ్యర్థుల గెలుపులో సోషల్‌మీడియా వారియర్స్ కీలకపాత్ర పోషించారు.

ఎండాకాలం.. జర పైలం

● బయటి ఆహారం, నీళ్లు, జ్యూస్‌తో వ్యాధులు ● కలుషిత ఆహారంతో జాండిస్, టైఫాయిడ్ ● తరచూ నీళ్లు తాగితే డీహైడ్రేషన్‌కు చెక్



హైదరాబాద్ సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. బయటకు వెళ్లినప్పుడు వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ఏదో ఒకటి తాగేస్తాం. బహిరంగ మార్కెట్లో కనిపించే సోడా, లెమన్‌జ్యూస్, మ్యాంగో, పుచ్చకాయ, మజ్జిగ, లస్సీ ఇలా.. రకరకాలుగా జ్యూస్‌లలో ఏదో ఒకటి తాగి గొంతును తడుపుకొంటాం. అయితే, ఎక్కడ పడితే అక్కడ, ఏది పడితే అది తాగితే ఎండ వేడిమికి ఉపశమనం మాటేమో కానీ, లేనిపోని జబ్బులు వచ్చే ముప్పు మాత్రం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏ రకం జూస్ అయినా సరే వాటిని ఇంట్లోనే తయారు చేసుకుని తాగడం మంచిదని, రోడ్లపై విక్రయించే వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వేసవికాలంలో ఇలాంటి వేడి వాతావరణం వైరస్‌లు, బాక్టీరియాలు ఇన్‌ఫెక్షన్లకు కారణమవుతాయని, ఇలాంటి సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు.

ఇలా చేస్తే..

సరైన ఆహారం తీసుకోవాలి: తేలికపాటి ఆహారం తరచూ తినాలి. నీటిశాతం ఎక్కువగా ఉన్న కూరగాయలు, పుచ్చకాయ, నారింజ, నిమ్మకాయ, తదితర పండ్లను తప్పనిసరిగా తీసుకోవాలి. వేసవిలో రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తీసుకోవాలి. నీటితోపాటు కొబ్బరిబొండాం, రసాలు, మజ్జిగ వంటివి కూడా తీసుకోవడం మంచిది. ఇవి శరీర జీవక్రియను పెంచుతాయి.

ఇంట్లోనే ఉండాలి: వేసవి కాలంలో బహిరంగ కార్యక్రమాలలో పాల్గొనకుండా జాగ్రత్త వహించాలి. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండేందుకు ప్రయత్నించాలి. తప్పనిసరి వెళ్లాల్సి వస్తే టోపీలు, గొడుగులు వినియోగించాలి. కళ్లకు సన్ గ్లాసెస్ ధరించడం మంచిది. చర్మానికి సన్‌స్క్రీన్‌లోషన్ అప్లయ్ చేసుకోవాలి.

ఇంట్లో ఆహారం జాగ్రత్త : వేసవిలో ఆహారం చాలా త్వరగా పాడైపోతుంది, కాబట్టి ఆహారానికి సరైన శీతలీకరణ చాలా అవసరం. నిల్వ ఉన్న ఆహారం తినడం మానుకోవాలి.

తేలికపాటి దుస్తులు : తేలికపాటి దుస్తులు ధరించడం మంచిది. ముదురు రంగులు వేడిని గ్రహిస్తాయి, శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. ఈ కాలంలో కాటన్, లేతరంగుల దుస్తులు వేసుకోవాలి.

అల్కహాల్, కెఫిన్ మానుకోవాలి : ఆల్కహాల్, కెఫిన్ వంటి పానీయాలు తీసుకోవడం వల్ల త్వరగా డీహైడ్రేషన్‌ను కలిగిస్తాయి. ఈ సీజన్‌లో ఇలాంటి పానీయాలను తీసుకోకపోవడం మంచిది. వీటికి బదులుగా నీరు, జ్యూస్‌లు, కొబ్బరి నీరు, మజ్జిగ తీసుకుంటే శరీరంలోని హైడ్రేషన్‌ను నిర్వహించడానికి తగినంతగా తోడ్పడుతాయి.



వర్కౌట్‌లకు వేళలు: ఈ కాలంలో వర్క్ అవుట్‌ల రెజీమ్‌ని ఉదయం లేదా సాయంత్రం వేళల్లో చేసేలా ప్లాన్ చేసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో పనిచేస్తే, అది మీ శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది.



రోడ్డు సైడ్ ఆహారం వద్దు : పానీపూరీ, చాట్ తదితర బయటి ఆహారం, హానికరమైనది. డయేరియా, జాండిస్ మొదలైన రూపంలో ఇన్ఫెక్షన్లకు కారణం కావచ్చు. కొన్నిసార్లు ఈ ఇన్ఫెక్షన్లు చాలా తీవ్రంగా ఉంటాయి, చికిత్స కోసం ఆస్పత్రిలో చేరాల్సి ఉంటుంది.

ఆదమరిస్తే జబ్బులు



వేసవి కాలంలో సాధారణంగా సన్‌బర్న్, ఫుడ్ పాయిజనింగ్, జాండీస్, హెపటైటిస్, హీట్‌స్ట్రోక్, వైరల్ ఇన్ఫెక్షన్ల వంటి ఇబ్బందులు ఎక్కువగా వస్తుంటాయి. సన్ బర్న్ వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయి. అలాంటి సమయంలో వైద్యుల సలహా మేరకు సరైన సన్‌స్క్రీన్ ఉపయోగించాలి. ఫుడ్ పాయిజనింగ్‌ను నివారించడానికి రోడ్లపై వీధి ఆహారాన్ని తీసుకోకుండా జాగ్రత్త పడాలి. కలుషిత ఆహారం, నీరు కారణంగా టైఫాయిడ్ బారిన పడే ప్రమాదముంది. సాధారణంగా కలుషిత ఆహారం, నీరు.. జాండీస్, హెపటైటిస్ ఏ వంటి ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే హీట్‌స్ట్రోక్ వచ్చే ముప్పు ఉంటుంది. అలాంటి సమయంలో తీవ్రమైన జ్వరం, డీ హైడ్రేషన్, తరచూ వాంతులతో ఇబ్బంది పడుతుంటారు. వెంటనే వైద్యులకు చూపించుకోవాలి.

- డాక్టర్ కిరణ్మయి పగడాల, జనరల్ ఫిజీషియన్, మెడికవర్ ఆస్పత్రి

బిడ్డ ఆస్తి తనదంటూ.. తండ్రి హంగామా

● ఇంట్లోకి చొరబడి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

యుసుఫ్‌గూడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భార్యకు పుట్టింటి వారు బహుమతిగా ఇచ్చిన ఇళ్లు తనదని తనకు సంబంధం లేకుండా విక్రయించడం అన్యాయమంటూ ఫిర్యాదు చేసినా పోలీసులు తనకు అన్యాయం చేస్తున్నారని ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో ఇంట్లో దూరి హల్‌చల్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. మధురానగర్‌లో జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్‌కు చెందిన ఇప్పావుల శ్రీనివాస్, రేఖ దంపతులకు కుమార్తె సాయిశ్రేయ ఉంది. యోగా మాస్టర్ అని చెప్పుకునే శ్రీనివాస్ భార్యను కుమార్తెను పట్టించుకోకుండా వేధించేవాడు. దీంతో ఆరేళ్ల క్రితమే కుమార్తెతో కలిసి రేఖ పుట్టింటికి వెళ్లింది. ఇటీవల రేఖ తల్లి అరుణాబాయి తన మనుమరాలు సాయిశ్రేయకు రహ్మత్‌నగర్‌లోని ఇంటిని గిఫ్ట్‌గా రాసిచ్చింది.

ఉన్నత చదువుల కోసమని రేఖ ఆ ఇంటిని మరొకరికి అమ్మేసింది. విషయం తెలిసిన శ్రీనివాస్ ఆ ఇంటిని మామ తనకు గిఫ్ట్‌గా ఇచ్చాడని, ఆ ఆస్తి తనదని కొనుగోలు చేసిన వారిని బెదిరిస్తున్నాడు. తరచూ ఇంట్లోకి చొరబడి రభస చేస్తున్నాడు. పైగా తన తల్లిని హింసిస్తున్నాడని, అమ్మ తరపు వారిపై అనుచిత వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని సాయిశ్రేయ తండ్రిపై ఈ నెల 18వ తేదీన మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా శుక్రవారం సాయంత్రం శ్రీనివాస్ తన ఇంటిని తనకు ఇప్పించాలని అమ్మిన ఆ ఇంట్లోకి చొరబడి లోపల గడియ పెట్టుకొని పెట్రోల్ బాటిల్ చేతపట్టుకుని ఓ హెచ్చరిక వీడియో విడుదల చేశాడు. పోలీసులు అన్యాయం చేస్తున్నారని, ఇలా చేస్తే తను పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంటానని ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. విషయం తెలిసి వచ్చిన పోలీసులు శ్రీనివాస్‌ను గదిలోంచి బయటకు రప్పించేందుకు ప్రయత్నించారు. శుక్రవారం రాత్రి వరకూ ఆయన బయటకు రాలేదు.

పిల్లలకు చదువు.. పెద్దలకు ఉపాధి

(5వ పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, నానల్‌నగర్, మాసబ్‌ట్యాంక్, హైటెక్‌సిటీ చౌరస్తా, తదితర ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలు 24 గంటలపాటు భిక్షాటన చేస్తుంటారు. అలాగే జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి, బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ మహంకాళి ఆలయం, సికింద్రాబాద్‌స్టేషన్ వెనకాల ఉండే గణపతి ఆలయం వద్దపెద్ద ఎత్తున యాచిస్తుంటారు. అయితే నగరాన్ని బెగ్గర్ ఫ్రీ సిటీగా ఉంచాలని, యాచకవృత్తిని చేపడుతున్న పిల్లలను వసతిగృహాల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు 'ఆపరేషన్ భిక్షాటన్' కింద గత ఫిబ్రవరి 19 నుంచి ఈనెల 24 వరకు జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ ప్యారడైజ్, ప్యాట్నీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, మైత్రివనం, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయం, ఐఎస్ సదన్, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట, పెద్దమ్మ గుడిని హాట్‌స్పాట్ కేంద్రాలుగా ఎంపిక చేశారు.

నెల రోజుల్లో 223 మంది గుర్తింపు

నెలరోజుల వ్యవధిలో ఆయా హాట్‌స్పాట్ కేంద్రాల్లో మొత్తం 223 మంది యాచకులను గుర్తించారు. ఇందులో 156 మంది పిల్లలుకాగా, 67 మంది వారి తల్లిదండ్రులు, సంరక్షకులు ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, తనిఖీల్లో ఎక్కువగా మహారాష్ట్రలోని బీదర్, కలబురిగి, బల్లారి, రాయచూర్, సోలాపూర్, తుల్జాపూర్, ఏపీలోని అనంతపురం, తెలంగాణలోని వికారాబాద్, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు చెందిన పిల్లలున్నారని చెప్పారు. రోజువారీ కూలీ పనుల కంటే యాచకవృత్తి ద్వారా ఎక్కువగా సంపాదించవచ్చనే ఆశతో నగరానికి వచ్చినట్టు వెల్లడించారు. కాగా, తనిఖీల్లో పట్టుకున్న వారిని ఇటీవల ప్రత్యేక బస్సుల్లో వారి స్వస్థలాలకు తరలించారు. చదువుకునే పిల్లలతో భిక్షాటన చేయించడం నేరమని, మరోసారి నగరంలో కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ బీసీలకు సగం స్థానాలను కేటాయించాలి: జాజుల

రాంగోపాల్‌పేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు దామాషా ప్రకారం సగం పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారితో కలిసి ఆయన మాట్లాడారు. సబ్బండ కులాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం పార్టీలో ఉన్న బీసీలను కాదని ఇతర పార్టీలో ఉన్న అగ్రకులాల వారిని రాత్రికిరాత్రి పార్టీలలోకి తీసుకొని టికెట్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే టీఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంట్ స్థానాలకుగాను ఆరు స్థానాలను, బీజేపీ ఐదు స్థానాలను బీసీలకు కేటాయించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం 12 ప్రకటించి అందులో బీసీలకు కేవలం మూడు స్థానాలను కేటాయించిందని ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిన ఐదు స్థానాలను బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. 60 శాతానికి పైగా బీసీ జనాభా ఉన్నప్పటికీ భువనగిరి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ తదితర స్థానాలు రెడ్డి సామాజికవర్గానికి కేటాయించి బీసీలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో కుల పాలన చెయ్యడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర నాయకులు గూడూరు భాస్కర్ మేరు, వరికుప్పల మధు పాల్గొన్నారు.

బలహీన ప్రతిపక్షమే మోదీ బలం

● కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా మద్దతు ఉంది

● సీ-ఓటర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుతను గురు

పంజాగుట్ట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దేశంలో బలహీన ప్రతిపక్షమే నరేంద్రమోదీ బలమని, కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు ఉందని సీనియర్ పాత్రికేయుడు, సీ-ఓటర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుతను గురు అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఇండియా టు భారత్ పేరిట 90 రోజుల దేశయాత్ర చేస్తున్న ఆయన తన ప్రయాణంలో భాగంగా శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నియో సైన్స్‌హబ్ మీడియా హౌస్, స్మార్ట్ లాబ్ టెక్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ ఇంటరాక్టివ్ సెషన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాని, ప్రభుత్వోద్యోగాల ఊసేలేదని, జీవన స్థితిగతులు అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. ఈ బాధలన్నీ అనుభవిస్తున్న సగటు ఓటరు మాత్రం మళ్లీ నరేంద్రమోదీకే మొగ్గుచూపొచ్చని అన్నారు. దానికి కారణం, ప్రతిపక్షాల మీద ఏ మాత్రమూ నమ్మకం లేకపోవడమే అని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక అవసరాలు తీర్చే నాయకులకే ఓట్లు వేసుకునే చైతన్యం ప్రజల్లో వచ్చిందన్నారు. అయోధ్యలో రామ మందిర్ ప్రారంభమైన తరువాత బీజేపీకి మద్దతు పెరిగిందన్నారు. దేశంలోని సామాన్యుడి ఆలోచనలు తెలుసుకొని, అభిప్రాయాలు పంచుకొని, ఆకాంక్షల్ని అర్థంచేసుకోవడమే తన "ఇండియా టు భారత్" యాత్ర అంతరార్థమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నియో సైన్స్ హబ్ ఎండీ వెంకట సత్యప్రసాద్ పోతరా, సీనియర్ పాత్రికేయుడు, రచయిత రాకా సుధాకర్, సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సుబ్రమణియన్ అయ్యర్, మేనేజింగ్ ఎడిటర్ నరేష్ నున్న, రెష్మీ కుమారి, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

ఎడాపెడా పేలుళ్లు!

(5వ పేజీ తరువాయి)

తీసుకొని నెలల తరబడి బ్లాస్టింగ్ చేస్తున్నాయి. ఇంకొన్ని సంస్థలు అనుమతి తీసుకోకపోవడం గమనార్హం.

కాసుల కక్కుర్తి.. కార్మికులకు ముప్పు..

బ్లాస్టింగ్ బాధ్యతలూ సర్టిఫైడ్ ఏజెన్సీలకు అప్పగించాలి. మెజారిటీ నిర్మాణ రంగ సంస్థలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. తక్కువ ఖర్చుకు పని చేసే అనుభవం లేని ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. దీంతో ఆ ఏజెన్సీలు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇది ప్రమాదాలకు దారి తీస్తోంది. ఈ క్రమంలో కార్మికులకు ముప్పు వాటిల్లుతోంది. కొన్ని చోట్ల పక్కనున్న భవనాలపైనా ప్రభావం పడుతోంది. గతంలో మణికొండ, కోకాపేట ప్రాంతాల్లో బ్లాస్టింగ్‌తో పక్కనున్న భవనాల్లో పగుళ్లు వచ్చాయని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. అధికారులకూ ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినా నిర్మాణ సంస్థల్లో మార్పు కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగితే పోయేది నిరుపేద కార్మికుల ప్రాణాలు.. జాగ్రత్తలు తీసుకోకుంటే పక్కనున్న భవనాలకు ముప్పు ఉంటుంది మాకేంటి అన్నట్టుగా కొన్ని నిర్మాణ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. అనుమతులిచ్చి చేతులు దులుపుకుంటోన్న జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలు పనులు ఎలా చేస్తున్నారు..? నిబంధనలు పాటిస్తున్నారా..? లేదా..? అన్నది పట్టించుకోవడం లేదు.

గత ఘటనలు..

- జూన్ 2020లో కొండాపూర్‌లోని ఓ భవన నిర్మాణ స్థలంలో స్టోన్ బ్లాస్టింగ్‌తో కార్మికురాలు లింగమ్మ మృతి చెందారు.
- వనస్థలిపురంలో ఓ భవనం కోసం జరిపిన రాళ్ల పేలుళ్లలో ఇద్దరు బాలికలు గాయపడ్డారు.
- కోకాపేటలో ప్రముఖ నిర్మాణ సంస్థ చేసిన బ్లాస్టింగ్‌తో పక్కనున్న బహుళ అంతస్తుల భవనం బేస్‌మెంట్‌లో పగుళ్లు వచ్చాయి. దీంతో భవనంలో ఉండేవారు నిరసన వ్యక్తం చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మణికొండలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో ఓ భవన నిర్మాణం కోసం చేసిన బ్లాస్టింగ్‌లో పక్కనున్న ఇంటి పైకప్పు పెచ్చులూడాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.
- 2018 జూన్‌లో పుప్పాల్‌గూడలో భవన నిర్మాణంలో భాగంగా నిర్వహించిన పేలుళ్లలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు.

కూకట్‌పల్లిలో ఇద్దరు కార్మికుల ప్రాణాలకు ముప్పు


గాయపడ్డ కార్మికుడు హరిలాల్ మహంతో

కూకట్‌పల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఐడీఎల్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవన నిర్మాణ సముదాయంలో బ్లాస్టింగ్ చేయడంతో శుక్రవారం ప్రమాదం సంభవించింది. ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు కట్ట రోడ్డులోని ఐడీఎల్ కంపెనీకి ఎదురుగా ఉన్న స్థలంలో హానర్ హోమ్స్ నిర్మాణ సంస్థ భారీ గృహసముదాయ భవనాలను నిర్మిస్తోంది. నిర్మాణ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం బ్లాస్టింగ్ చేయడంతో ప్రమాదం సంభవించింది. పేలుడుధాటికి బండరాళ్లు పైకి లేచి ఇద్దరు కార్మికులపై పడ్డాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన హరిలాల్ మహంతో(54), బిహార్‌కు చెందిన పంకజ్ ఆలం(32)కు తీవ్రగాయాలయ్యాయి. హరిలాల్ ప్రాణాపాయస్థితిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

బిహార్ నుంచి హైదరాబాద్‌కు..

●తల్లిదండ్రులకు చెప్పకుండా బయలుదేరిన మైనర్లు

● అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

బర్కత్‌పుర, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు చెప్పకుండా రైలు ఎక్కి నగరానికి వచ్చిన ఒక బాలుడు, ఇద్దరు బాలికలను కాచిగూడ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రం రోతాక్ పివండికి చెందిన శివంమిశ్రా(17) ఎస్సెస్సీ ఫెయిల్ అయ్యి తండ్రి చనిపోవడంతో పురోహితం చేస్తున్నాడు. ఇతనికి ఛతీస్‌గఢ్ రాష్ట్రం మహాసాముండ పటేవాకు చెందిన మగ్గయితసింగ కుమార్తె కిరణ్‌సింగా(16)తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యింది. ఈ బాలిక 10వ తరగతి చదువుతున్నది. హైదరాబాద్‌లోని చార్మినార్ చూడాలని ఉందని ఆ బాలుడితో చెప్పింది. మరో స్నేహితురాలు 9వ తరగతి చదువుతున్న సంద్రంపటేల్ కుమార్తె పుష్పపటేల్(15)తో కలిసి గురువారం మధ్యాహ్నం రాయిపూర్ రైల్వేస్టేషన్‌లో వైన్‌గంగా ఎక్స్‌ప్రెస్ (కోర్బా- యశ్వంత్‌పూర్) రైలు ఎక్కారు. శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగారు. ఈ ముగ్గురు స్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై తిరుగుతూ అనుమానాస్పదంగా ఉండడంతో స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. తాము చార్మినార్ చూడటానికి ఇంట్లో చెప్పకుండా వచ్చామని వారు చెప్పారు. అప్పటికే ఆ ఇద్దరు బాలికల తల్లిదండ్రులు రాయపూర్ పీఎస్‌లో తమ పిల్లలు కిడ్నాపయ్యారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వెంటనే బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. వారు నగరానికి వస్తున్నారని అప్పటివరకు ఈ ముగ్గురిని చైల్డ్ వెల్ఫేర్ వారికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. వీరి తల్లిదండ్రులు నగరానికి వచ్చిన తరువాత వారికి అప్పగిస్తామని సీఐ ఎల్లప్ప తెలిపారు.

తలపై బండరాయితో మోది బాలిక హత్య

● పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

రాజేంద్రనగర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక దారుణహత్యకు గురైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జల్‌పల్లి ప్రాంతానికి చెందిన 13 సంవత్సరాల బాలికతో అత్తాపూర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ మోయిన్‌కు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. అయితే, అప్పటికే మోయిన్‌కు వివాహం కావడంతో బాలికను ఎలాగైనా వదిలించుకోవాలని ప్రయత్నించాడు. అందులో భాగంగా గురువారం రాత్రి బాలికను కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంతానికి తీసుకువచ్చి తలపై బండరాయితో మోదీ హత్య చేశాడు. శుక్రవారం ఉదయం కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన వారు ఓ బాలిక హత్యకు గురై ఉందని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మైలార్‌దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సిబ్బంది వచ్చి వేలి ముద్రలు సేకరించారు. రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని మైలార్‌దేవుపల్లి పోలీసులు తెలిపారు.

భవనం ఖాళీ చేసేందుకు డబ్బు డిమాండ్

● త్రిపుర రిటైర్డ్ డీజీపీని వేధించిన ముగ్గురిపై క్రిమినల్ కేసులు

బంజారాహిల్స్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): లీజు అగ్రిమెంట్ ముగిసినా భవనం ఖాళీ చేసేందుకు డబ్బు డిమాండ్ చేస్తూ త్రిపుర విశ్రాంత డీజీపీని ఇబ్బందులకు గురిచేస్తున్న ముగ్గురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 71 నవనిర్మాణ్‌నగర్‌లో నివాసముండే కె.నాగరాజు త్రిపురలో డీజీపీగా చేసి పదవీ విరమణ పొందారు. ఆయనకు బంజారాహిల్స్ రోడ్డు నంబరు 2, హుడా రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో భవనం ఉంది. ఆ భవనాన్ని 2017లో హబీబ్‌నగర్‌కు చెందిన కిషోర్‌కుమార్‌కు లీజుకు ఇచ్చారు. పలు నిబంధనలతో కూడిన ఐదు సంవత్సరాల ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఇదిలా ఉండగా గతేడాది జనవరితో లీజు అగ్రిమెంట్ ముగిసింది. భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు నాగరాజు తన కుమారుడితో కలిసి అక్కడకు వెళ్లారు. లీజు అగ్రిమెంట్‌లో ఉన్న నిబంధనలను అతిక్రమిస్తూ కిషోర్ భవనాన్ని అబ్దుల్ రహీం. దామోదర్ దాస్ బజాజ్‌కు సబ్ లీజుకు ఇచ్చారు. సబ్ లీజుకు తీసుకున్న రహీం, దామోదర్‌దాస్ అక్రమంగా భవనంలోని సరిహద్దులను చెరిపేసి నిర్మాణాలు చేపట్టడమే కాకుండా సర్వెంట్ గదిని పడగొట్టారు. వారిపై నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే భవనాన్ని ఖాళీ చేసి లీజు అగ్రిమెంట్ ప్రకారం బకాయి ఉన్న అద్దెను, నిర్మాణాల వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని సూచించాడు. కాని, కిషోర్, రహీం, దామోదర్ నిర్లక్ష్య దోరణితో నాగరాజును యేడాది కాలంగా ఇబ్బంది పెడుతూ వచ్చారు. అద్దె కూడా కట్టలేదు. నాగరాజు వాకబు చేయగా కిషోర్ ఇన్‌కంటాక్స్ టీడీఎస్ కూడా కట్టలేదని తేలింది. దీంతో ఉద్దేశ్య పూర్వకంగా కిషోర్, రహీం, దామోదర్‌లు తన ఇంటిని ఆక్రమించుకోవడమే కాకుండా అద్దె చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ నాగరాజు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులపై సెక్షన్ 420, 448, 427,109 రెడ్ విత్ 34 ఐపీసీ కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్క్షీరపాచితపయః ప్రహితాష్ట భాగం శ్యామాక ధాన్యం నవం నిర్వృతాంతరోష్మ!
తతపాయసం నరసమావసయం సుధాయాః కో లోడిభూప తిమృతె ఘృతఖండ సాకమ్!!

సామలతో రాజ పాయసం

'పయః' అంటే పాలు. ఆవు పాలకే ఈ పదాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. క్షీరానికి 'పయస్సు' పర్యాయపదమే అయిన ప్పటికీ మొక్కల నుంచి వచ్చే పాలకు, ఇతర జంతువుల క్షీరాలకు 'పయః' అనే పదం వర్తించదు. ఆవు పాలతో కాచినది కాబట్టి పాయసం అన్నారు. పాయసం అన్నారంటే ఆవు పాలతో తయారైందనే మనం భావిం చాలి. సాధ్యమైనంత ప్రయత్నించి ఆవు పాలు నమ్మకమైనవి దొరక్కపోతేనే గేదె పాలు లేదా ప్యాకెట్టు పాలను వాడాలి.

పాయసం కాయాలంటే ఆవు పాలు, బియ్యం లేదా చిరుధా న్యాలు, కమ్మగా కాచిన తాజా నెయ్యి, పంచదార లేదా బెల్లం కావాలి. గోధుమల్ని మాత్రమే ప్రధాన ఆహారంగా తీసుకునే వారు కూడా పాయసాన్ని వీటితోనే వండుకుంటారు. క్షేమశర్మ 'క్షేమ కుతూహలం' గ్రంథంలోని పై శ్లోకంలో 'రాజ పాయసం' కోసం 'శ్యామాక ధాన్యం నవం' తీసుకోవాలన్నాడు. 'శ్యామాక ధాన్యం' అంటే సామలు. కొత్త సామలతో పాయసం కాచుకో వటం గురించి ఈ శ్లోకంలో వివరిస్తున్నాడు.

- ముందుగా సామలనే ధాన్యాన్ని ఒక గ్లాసు మోతాదులో



తీసుకొని, కడిగి శుభ్ర పరచుకుని నీళ్లలో రెండు గంటలసేపు నాననివ్వాలి.

- పాలు చిక్కగా ఉండాలి. నీళ్లు కలిసినవిగా ఉంటే కాసేపు మరిగించి చిక్కగా ఉన్న పాలు 8 కప్పులు తీసుకోవాలి. 'నిర్క్షీర పాచిత పయః' అంటే అర్థం ఇదే.
- ఇప్పుడు 8 కప్పుల పాలను పొయ్యి మీద పెట్టి, మర గటం మొదలయ్యాక, నానిన ఈ సామల్ని ఒక కప్పు మోతా దులో తీసుకుని ఈ మరిగే పాలలో వెయ్యాలి.
- సన్న సెగన ఈ పాలలో సామల్ని చక్కగా ఉడకనివ్వాలి.
- గింజ మెత్తబడి ఉడికిన తరువాత తగినంత నెయ్యి, పంచదార లేదా బెల్లం అందులో కలిపి మూతబెట్టి కాసేపు మగ్గనివ్వండి. కమ్మని 'రాజ పాయసం' తయారైనట్టే! ఇష్టమైతే జీడిపప్పు, ఏలకులు, పచ్చ కర్పూరం కలుపుకోవచ్చు.

చంద్రప్రభా క్షీర పాకం...

ఒక బాండీలో కొద్దిగా నెయ్యి తీసుకుని కాగిన తరువాత, కడిగి ఆరబోసిన బియ్యం ఒక కప్పుడు ఈ నేతిలో వేయాలి. బాగా కలియ బెడుతూ వేగిం చాలి. బియ్యానికి పూర్తిగా నెయ్యి పట్టిన తరువాత ఇందాక చిక్కగా కాచిన పాలు ఆ బియ్యం మునిగేం తవరకు పోయాలి. అత్తెసరు అన్నం వండేప్పుడు బియ్యానికి ఎన్ని రెట్లు నీళ్లు పోస్తామో ఆ కొలతలో పాలు పోయాలి. ఆ పాలతోనే బియ్యం ఉడకాలి. అవసరం అయితే మరికాసిని పాలు పోసుకోవచ్చు. బాగా ఉడికిన తరువాత పొయ్యి మీంచి దించి, చల్లా రాక అందులో చాలినంత తేనె కలపాలి. ఈ క్షీరా న్నాన్ని 'చంద్రప్రభా క్షీరపాకం' అన్నాడు క్షేమశర్మ. ఒక వేళ తేనె లేకపోతే బెల్లం లేదా పంచదార కలిపి వండుకోవచ్చు.

'చంద్రప్రభా క్షీరపాకం' వాత వ్యాధులమీద పని చేస్తుందన్నాడు క్షేమశర్మ. ధాతు పుష్టినిస్తుంది. రక్త స్రావాలను అరికడుతుంది. వేడిని తగ్గిస్తుంది. కానీ కష్టంగా అరుగుతుంది. జీర్ణశక్తిని అనుసరించి దీన్ని తీసుకోవాలి.

ఔషధంలా...

'పాయసం దుర్జరం బల్యం ధాతుపుష్టి వివర్ధనమ్! విష్టంభ జననం రక్తపిత్తాగ్ని మారుతాన్!'... అంటే ఇలా తయారైన పాయసం అమితమైన శక్తినిస్తుంది. ధాతువుల్ని పోషిస్తుంది. క్షీణించే వ్యాధులతో బాధపడేవారికి పుష్టి నిస్తుంది. వేడి తగ్గు తుంది. రక్తస్రావం ఆగుతుంది. అయితే జీర్ణశక్తిని బట్టి దీన్ని తీసుకోవాలి. మితిమీరిన ఆకలి ఉన్నవారికి ఇది దండిగా ఉంటుంది. ఎప్పుడు పడితే అప్పుడు ఏది పడితే అది తినేవారికి తమ ఆకలి మీద తమకే అదుపు కలిగించటానికి ఈ రాజ పాయసం ఉపయోగపడుతుంది. మలబద్ధకంతో బాధపడేవా రికి ఇది విరేచనాన్ని బంధించే అవకాశం ఉంది. జాగ్రత్తగా తీసుకోవాలి.

ఇది సామలతో వండే రాజపాయసం. తెలుగువాళ్లు రథస ప్తమి రోజున ఆవుపేడ పిడకల మీద వరి బియ్యంతో పాయ సాన్ని ఇదే పద్ధతిలో వండుతారు. బియ్యంతో ఈ పద్ధతిలో వండే పాయసాన్ని క్షేమశర్మ 'చంద్రప్రభా క్షీర పాకం' అనే పేరుతో వివరించాడు.

పాయసం భారత దేశపు మొదటి పిండివంటల్లో ఒకటి. పవిత్రాహారం. ఇది ఋగ్వేద కాలం నుంచి దేశీయులు ఆస్వా దించిన గొప్ప వంటకం. మైదా పిండితో తయారైన నూడుల్సు తోనో, సేమ్యాతోనో కాకుండా చిరుధాన్యాలతో పాయసాన్ని ఎలా వండుకోవాలో ఈ అధ్యాయంలో క్షేమశర్మ వివరించాడు.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



నాన్‌వెజ్‌తో మామిడి మిక్స్ చేస్తే..

ఎండాకాలం వచ్చేసింది. పచ్చి మామిడికాయలు మార్కెట్లో దొరుకుతున్నాయి. మామూలు వంటలైనా మామిడిని మిక్స్ చేసి చేస్తే మాత్రం కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. మామిడికాయ చేపల పులుసు, మ్యాంగో చికెన్ టిక్కా, పుల్ల మామిడి మటన్ కర్రీ, మ్యాంగో చిల్లి చికెన్ కర్రీలను వండుకోవచ్చు ఇలా..

మ్యాంగో చికెన్ టిక్కా

కావాల్సిన పదార్థాలు: చికెన్ క్యూబ్స్- 500 గ్రాములు, వెల్లుల్లి రెబ్బలు- 10, అల్లం- చిన్న ముక్క, పచ్చిమిర్చి- 4, కొత్తిమీర- పావు కప్పు, పసుపు- చిటికెడు, కారం- టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, గరం మసాలా పొడి- అర టీస్పూన్, ధనియాల పొడి- 1 టీస్పూన్, నల్ల మిరియాల పొడి- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, పెరుగు- రెండు టేబుల్ స్పూన్లు, పచ్చి మామిడికాయల చూర్ణం- 2 టేబుల్ స్పూన్లు, క్రీమ్- 2 టేబుల్ స్పూన్లు, శనగపిండి- 1 టేబుల్ స్పూన్, నూనె- 2 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: చిన్న జార్‌లో వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి, అల్లం ముక్కతో పాటు అరకప్పు నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన ఉంచాలి. ఆ తర్వాత మరో జార్‌లో కొత్తిమీర, పసుపు, కారం, జీలకర్ర పొడి, గరం మసాలా పొడి, ధనియాల పొడి, నల్ల మిరియాల పొడి, ఉప్పు, పెరుగు వేసి పావు కప్పు నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి.



చికెన్ ముక్కలను బౌల్‌లో వేసి అందులో పక్కన ఉంచుకున్న రెండు పేస్ట్‌లను వేశాక.. పచ్చి మామిడికాయల చూర్ణం, ఫ్రెష్ క్రీమ్, శనగపిండి వేసి బాగా కలపాలి. చికెన్ ముక్కలకు ఈ మిశ్రమం బాగా పడుతుంది. దీన్ని నలభై నిముషాల పాటు మారినేట్ చేసి పెట్టుకోవాలి.

నలభై నిముషాల తర్వాత టిక్కా స్టిక్స్ తీసుకుని మొదట ఉల్లిపాయ పొర, చికెన్ క్యూబ్, క్యాప్సికమ్ ముక్క ఇలా వరుసగా స్టిక్‌లో గుచ్చాలి. ఇలా మూడు నాలుగు స్టిక్స్ గుచ్చుకుని ప్లేట్‌లో ఉంచుకోవాలి. తర్వాత గ్రిల్ ప్యాన్ తీసుకుని అందులో నూనె వేయాలి. నూనె కాస్త వేడయ్యాక ఈ స్టిక్స్‌ను అందులో ఉంచి అన్ని వైపులా జాగ్రత్తగా కాల్చుకోవాలి. బాగా గ్రిల్ అయిన తర్వాత చికెన్ ముక్కల మీద నిమ్మకాయ రసం పిండుకుని కొత్తిమీర చల్లుకుని వేడివేడిగా తింటే మ్యాంగో ఫ్లేవర్ ఉండే చికెన్ టిక్కా మరింత రుచిగా ఉంటుంది.

మ్యాంగో చిల్లి చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 400 గ్రాములు (కూరకు సరిపడ సైజ్‌లో ముక్కలు తరగాలి), మీడియం సైజ్ మామిడికాయలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి), పచ్చి మిరపకాయలు- 5, వెల్లుల్లి రెబ్బలు- 5, సన్నగా తరగిని అల్లం ముక్కలు- పావు టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కొత్తిమీర- గుప్పెడు, నూనె- 2 టీ స్పూన్లు, జీలకర్ర- ఒకటిన్నర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, పసుపు- అరటీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, కొత్తిమీర- 2 టీస్పూన్లు

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 400 గ్రాములు (కూరకు సరిపడ సైజ్‌లో ముక్కలు తరగాలి), మీడియం సైజ్ మామిడికాయలు- 2 (చిన్న ముక్కలుగా తరగాలి), పచ్చి మిరపకాయలు- 5, వెల్లుల్లి రెబ్బలు- 5, సన్నగా తరగిని అల్లం ముక్కలు- పావు టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కొత్తిమీర- గుప్పెడు, నూనె- 2 టీ స్పూన్లు, జీలకర్ర- ఒకటిన్నర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, పసుపు- అరటీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- అరటీస్పూన్, కొత్తిమీర- 2 టీస్పూన్లు

తయారీ విధానం: జార్‌లో మామిడికాయ ముక్కలు, నాలుగు పచ్చి మిరపకాయలు, వెల్లుల్లి, అల్లం ముక్కలు, తరగిన రెండు ఉల్లిపాయల్లో సగం మిశ్రమంతో పాటు కొద్దిగా నీళ్లు వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తని మిశ్రమంలో కొత్తిమీర వేసి మరోసారి మిక్సీ పట్టాలి. ఈ పేస్ట్‌ను బౌల్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి.

బౌల్‌లో శుభ్రపరచిన చికెన్ తీసుకుని సరిపడ ఉప్పు వేసి మిక్సీ పట్టి పక్కన ఉంచుకున్న మామిడికాయల పేస్ట్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం ముక్కలకు పడుతుంది. అరగంట పాటు ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసిన తర్వాత జీలకర్ర, మిగి లిన ఉల్లిపాయ ముక్కలు, నాలుగు పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. ఇందులో పసుపు, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. సరిపడ ఉప్పు వేసి మరో సారి గరిటెతో కలపాలి. ఇందులోకి కొత్తి మీర వేసిన తర్వాత చికెన్ ముక్కల మిశ్రమాన్ని వేయాలి. బాగా కలిపిన తర్వాత ముప్పావు కప్పు నీళ్లు పోసి రుచికి సరిపడ ఉప్పుందో లేదో చెక్ చేసుకుని మిశ్రమాన్ని కల పాలి. ప్యాన్‌పై మూత ఉంచి చికెన్ ముక్క ఉడికేంత వరకూ కుక్ చేయాలి. మ్యాంగో చిల్లీ చికెన్ కర్రీని బౌల్‌లో వేసుకుని కొత్తిమీ రతో గార్నిష్ చేసుకుని అన్నంతో లేదా చపాతీలతో తినాలి.



మ్యాంగో చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- 250 గ్రాములు, పచ్చి మామిడికాయ ముక్కలు- 1 కప్పు, ఆవాలు- అర టీస్పూన్, మెంతులు- పావు టీస్పూన్, ఎండు మిరపకా యలు- 2, కరివేపాకు- కొద్దిగా, ఉల్లిపాయలు- అరకప్పు, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 1 టీస్పూన్, టొమాటో పేస్ట్- అరకప్పు, చింతపండు రసం- కప్పు, పసుపు- చిటికెడు, కారం- 1 స్పూన్, ధనియాల పొడి- అరటీస్పూన్, జీలకర్ర పొడి- పావు టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, బెల్లం- కొద్దిగా, కొత్తిమీర- 1 టేబుల్ స్పూన్, నూనె- కప్పు



తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను శుభ్రంగా కడగాలి. ఒక ప్లేట్‌లో చేప ముక్కలు వేయాలి. ఇందులో ఉప్పు, పసుపు వేసి ముక్కలకు పట్టేట్లు కలపాలి. దీన్ని పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక మెంతులు, ఆవాలు, ఎండు మిరపకాయలను సగానికి కట్ చేసి వేయాలి. ఉల్లి పాయ ముక్కలు, కరివేపాకు వేసి గరిటెతో నిముషం పాటు కలిపాక అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి వాసన పోయేంత వరకూ కలుపుతూ ఉండాలి. ఉల్లిపాయ ముక్కలు రంగు మారిన తర్వాత మామిడికాయ ముక్కలు వేసి గరిటెతో కలపాలి. నిముషం పాటు కలిపాక తగినంత ఉప్పు వేసి ప్యాన్ మూత పెట్టి కుక్ చేయాలి. మూడు నిముషాల తర్వాత మూత తీసి పసుపు, ధనియాల పొడి వేసి కలిపాక జీలకర్ర పొడి, కారం వేసి కలిపాక టొమాటో పేస్ట్ వేసి బాగా ముక్కలకు పట్టేట్లు నిముషం పాటు కలిపాక చింతపండు రసం వేసి నిముషం పాటు కలిపాక సగం గ్లాసు నీళ్లు పోసి ప్యాన్‌పై మూత ఉంచాలి. మూడు నిముషాల తర్వాత చూస్తే మామిడి ముక్కలు ఉడుకుపడినట్లు కనపడుతుంది. ఇందులో మారి నేట్ చేసుకున్న చేప ముక్కలను ఒక్కోటి ఉంచాలి. వీటిని గరిటెతో తునగిపోకుండా జాగ్రత్తగా మామిడి మిశ్రమంలో కలపాలి. కొద్దిగా బెల్లం, కొత్తిమీర వేసిన తర్వాత ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. మూత తీశాక నూనె పైకి తేలినట్లు కనపడుతుంది. ఈ మిశ్రమాన్ని కలిపి బౌల్‌లో తీసుకుని వేడివేడి అన్నంలో తినేయాలి.

మ్యాంగో మటన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

మీడియం సైజ్ మామిడికాయ- 1 (చిన్న ముక్కలుగా తరగాలి), మటన్- కేజీ (చిన్న ముక్కలుగా కట్ చేయాలి), నూనె- కప్పు, యాలకులు- 3, లవంగాలు- 5, దాల్చిన చెక్క- 1, మిరియాలు- 6, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 4 (సన్నగా తరగాలి), జింజర్, గార్లిక్ పేస్ట్- 2 టీస్పూన్లు, పసుపు- అరటీస్పూన్, కారం- 2 టీస్పూన్లు, టొమాటో- 1 (ముక్కలుగా తరగాలి), ధనియాల పొడి- 1 టీస్పూన్, జీలకర్ర పొడి- 1 టీస్పూన్, గరం మసాలా- 1 టీస్పూన్,

తయారీ విధానం

కుక్కర్‌లో నూనె వేసి యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేశాక బాగా కలపాలి. ఆ తర్వాత జింజర్ గార్లిక్ పేస్ట్ వేసి నిముషం పాటు గరిటెతో గార్లిక్ వాసన పోయేంత వరకూ కలిపిన తర్వాత మటన్ ముక్కలు వేయాలి. మిశ్రమంలో కలిసేట్లు మటన్ ముక్కలు కలపాలి. దీని మీద ప్లేట్ ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేశాక పసుపు, కారం వేశాక తగినంత ఉప్పు వేసి గరిటెతో మటన్‌ను బాగా కలపాలి. ఆ తర్వాత కుక్కర్ మీద ప్లేట్ ఉంచి మూడు నిముషాల పాటు కుక్ చేయాలి.

ప్లేట్ తీసి టొమాటో ముక్కలు, పుల్ల మామిడి ముక్కలు వేసి బాగా కలపాలి. మిశ్రమానికి మామిడి ముక్కల ఫ్లేవర్ బాగా పడుతుంది. ఇందులో జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలిపిన తర్వాత గ్లాసు నీళ్లు పోయాలి. మిశ్రమాన్ని గరిటెతో కలిపిన తర్వాత కుక్కర్ మూత బిగించాలి. నాలుగు విజిల్స్ వచ్చేంత వరకూ మటన్‌ను ఉడికించాలి. మూత తీసి గరిటెతో బాగా కలిపి కొత్తిమీర చల్లుకుని వడ్డించుకోవాలి. అన్నం, దోశె, చపాతీలోకి ఈ పుల్ల మామిడికాయ మటన్ రుచికరంగా ఉంటుంది.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/o33jg9p లో చదవండి.

స్ఫూర్తి

భవితకు భరోసా



కాళ్లూ రెండూ చచ్చుపడినా.. వేరొకరికి సాయం చేయాలన్న తపన ఆమెను ఇంట్లో కూర్చోనివ్వలేదు. ఉదయాన్నే బండెక్కి... ఊరంతా తిరుగుతూ... తనలాంటివారి గళమై నినదిస్తున్నారు. వైకల్యాన్ని పక్కకు నెట్టి... 'డెవలప్‌మెంట్ ఫోరమ్ ఫర్ విమెన్ విత్ డిజేబిలిటీ' నెలకొల్పి... సామాజిక చైతన్యం రగిలిస్తున్న 43 ఏళ్ల **కె.సుజాత** ప్రయాణం ఇది...

"అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది? నిత్యం సవాళ్లు, సమస్యలతో సహజీవనం చేయాలి. ఈ సత్యం నాకు చిన్నప్పుడే బోధపడింది. తమిళనాడు రాజధాని చెన్నై శివారు ప్రాంతం పెరుంబాక్కం మాది. పేద కుటుంబం. పుట్టిన ఏడాదికే నేను అడుగులు వేశానని మా ఇంట్లోవాళ్లు సంబరాలు చేసుకున్నారట. కానీ అంతటి సంతోషాన్ని ఒక్కసారిగా దూరం చేసింది విధి. నాకు ఏడాదిన్నర వయసు ఉన్నప్పుడు ఆడుకొంటూ... ఉయ్యాలలో నుంచి కింద పడ్డాను. పెద్దగా దెబ్బలేమీ తగలలేదు కానీ... కాలు కదపలేకపోయాను. ఒక్కసారిగా ఒళ్లు వేడెక్కింది. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళితే... వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు పోలియోగా నిర్ధారించారు. జీవితాంతం వైకల్యంతోనే బతకాలని చెప్పారు. అది విని అమ్మానాన్న తల్లడిల్లిపోయారట. ఇప్పటికీ ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుని వాళ్లు కుమిలిపోతుంటారు. నేనే వారికి ధైర్యం చెబుతుంటాను.

స్వయం శక్తితో...

నా రెండు కాళ్లూ ఎనభై ఐదు శాతం చచ్చుబడిపోయాయి. ఒకరి సాయం లేకుండా కదలలేని పరిస్థితి. చిన్నప్పుడంటే పెద్దవాళ్లు చూసుకొంటారు. కానీ ఎన్ని రోజులు అలా ఒకరిపై ఆధారపడాలి? ఇదే నన్ను బాగా కలవర పెట్టింది. అప్పుడే అనుకున్నా... స్వశక్తితో జీవితమనే సాగరాన్ని ఈదాలని. క్రమంగా నా పనులు నేను చేసుకోవడం మొదలుపెట్టాను. కష్టమే... కానీ ప్రయత్నిస్తే అసాధ్యమనేది ఏదీ ఉండదు కదా. వైకల్యం ఉందని వెనకడుగు వేస్తే... భవిష్యత్తులో చేయి అందించేవారు దొరక్కపోతే... బతుకు సాగేదెలా! నాకు కుటుంబం, సన్నిహితులు ఎంతోమంది అండ ఉంది. నా ప్రయాణంలో అత్యధిక భాగం వారందరి సహకారంతోనే సాగింది. మరి చుట్టూ ఎవరూ లేని వికలాంగుల పరిస్థితి ఏమిటి? వారిని పట్టించుకొనేది ఎవరు? అందుకే అలాంటివారికి నేను భరోసా కావాలనుకున్నా.



నాలాంటివారి కోసం...

అదే సమయంలో నగరంలోని పలు మురికివాడలను ఖాళీ చేయించింది ప్రభుత్వం. వాళ్లందరినీ మా ప్రాంతానికి తరలించింది. కొత్త ప్రదేశం. ఎన్నో సమస్యలు. కనీస వసతులు లేవు. అన్నీ బాగున్నవారే ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇక నాలాంటివారి పరిస్థితి వర్ణనాతీతం. వారి బాధలు పట్టించుకునేవారే లేరు. దాంతో నేనే చొరవ తీసుకున్నాను. వారికి ఎదురైన ప్రధాన సమస్య... చిరునామాలు మారడంతో వికలాంగ పింఛన్లు పూర్తిగా ఆగిపోయాయి. ఆ క్షణమే నిర్ణయించుకున్నాను... పెరుంబాక్కం ప్రాంతవాసుల సంక్షేమం కోసం పాటుపడాలని. నా ప్రయాణం మురికివాడల్లోని పిల్లలకు విద్య బోధనతో మొదలుపెట్టాను. అలాగే మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వారిలో చైతన్యం రగిలించాను. అత్యవసరంగా చేయాల్సింది బడి మానేసిన పిల్లలను తిరిగి తరగతి గదుల్లో కూర్చోబెట్టడం. ఎందుకంటే బాల్యం గాడి తప్పితే వారి భవిత అంధకారం అవుతుంది. వసతులు లేవనే కారణంతో చిన్నారులను విద్యకు దూరం చేయడం సరైంది కాదు. అందుబాటులో ఉన్న వనరులతోనే విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేయాలి. ఈ ఆలోచనతోనే ముందడుగు వేశాను.

అవగాహన కల్పిస్తూ...


ఇక్కడ ప్రధాన సమస్య... రైట్ టూ ఎడ్యుకేషన్ గురించి తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడం. దీనిపై అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను నియమించాను. అది మంచి ఫలితాలు ఇచ్చింది. కొద్ది రోజుల్లోనే పిల్లలను దగ్గర్లోని బడులకు పంపడంలో విజయవంతమయ్యాం. అయితే అన్నిటికంటే కష్టం అనిపించింది... వికలాంగులకు ఉపాధి కల్పించడం. అలాగే పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇప్పించడం. ఎలాగో కష్టపడి పది మంది కళాశాల విద్యార్థుల చదువు కోసం రెండు లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లు సాధించాను. వీరంతా వికలాంగుల బిడ్డలే.

మహిళల కోసం...

మా ప్రాంతం నగరానికి దూరంగా ఉండడంతో మహిళల భద్రత సమస్యగా మారింది. తమ పిల్లలను చదివించుకోవడానికి వారికి ఉపాధి మార్గం కూడా చూపించాల్సి వచ్చింది. అలాంటి మహిళలందరికీ వర్క్‌షాప్‌లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేశాను. స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాను. కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరికొందరికి ఉద్యోగ అవకాశాలు కల్పించగలిగాను. నిధులు సేకరించి వికలాంగులకు ప్రత్యేక వాహనాలు ఇప్పించగలిగాను. మహిళల అభ్యున్నతికి అతిపెద్ద అవరోధం... ఒకరిపై ఆధారపడి జీవించడం. ముఖ్యంగా వైకల్యం ఉన్న మహిళలు తమ పనులు తాము చేసుకోగలగాలి. సంపాదించుకోగలగాలి. ఒక మహిళ సాధికారత సాధించడమంటే... ఆ కుటుంబం, ఆ సమాజం సాధికారత వైపు అడుగులు వేసినట్లే.

నేను చేస్తున్న సేవా కార్యక్రమాలన్నిటికీ ఒక వేదిక ఉండాలనే ఉద్దేశంతో 2017లో 'డెవలప్‌మెంట్ ఫోరమ్ ఫర్ విమెన్ విత్ డిజేబిలిటీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ ప్రారంభించాను. విభిన్న వర్గాలవారి హక్కుల కోసం పోరాడుతున్నాను. ఇప్పుడు ఈ సంస్థ మా ప్రాంతంలోని పిల్లలు, మహిళలు, ప్రత్యేకించి వికలాంగ మహిళల భవితకు అతిపెద్ద భరోసా."

ప్రేమించి పెళ్లి చేసుకుంటా



విజయ్ దేవరకొండ

తాను ప్రేమ పెళ్ళి చేసుకుంటానని, అయితే, తనకు కాబోయే భార్య తన తల్లిదండ్రులనూ ప్రేమించేలా ఉండాలని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన నటించిన 'ఫ్యామిలీస్టార్' చిత్రం ఏప్రిల్ 5న విడుదలకానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం ఆ చిత్ర నిర్మాత దిల్ రాజుతో కలసి ఆయన చెన్నైలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ... 'పెళ్ళి చేసుకుని భార్యాపిల్లలతో కలిసి జీవించాలన్న ఆశ, కోరిక నాకు కూడా ఉన్నాయి. కానీ, దానికి కొంత సమయం పడుతుంది. అయితే ప్రేమించే పెళ్లి చేసుకుంటా. నాకు కాబోయే భార్య నా తల్లిదండ్రులను కూడా ప్రేమించాలి. ఆమెను మా అమ్మానాన్న ఇష్టపడాలి. ఇప్పటివరకు నేను ఎవరినీ ప్రేమించలేదు. ఒక సినిమాలో హీరోయిన్ ఎంపిక దర్శకుడు, నిర్మాత చేతుల్లోనే ఉంటుంది. హీరోకు సంబంధం ఉండదు. రాజకీయాల్లో వచ్చే స్థాయికి ఇంకా ఎదగలేదు. చిత్రపరిశ్రమలోనే ఇంకా పైస్థాయికి రావాలన్నదే నా కోరిక' అని అన్నారు.

మాస్ లుక్‌లో...



రజనీకాంత్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కలయిక పట్టాలెక్కింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా ఓ చిత్రం ప్రకటించిన విషయం తెలిసిందే. 'తలైవర్ 171' అనేది వర్కింగ్ టైటిల్. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన కీలక అప్డేట్‌ను లోకేశ్ వెల్లడించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఏప్రిల్ 22న టైటిల్‌ను ప్రకటించనున్నట్లు తెలిపారు. పోస్టర్‌లో రజనీకాంత్ మాస్‌లుక్‌లో కనిపించారు. ఆయన చేతులకు వాచ్‌లతో సంకెళ్లు వేసి ఉండడం ఆసక్తిని కలిగించింది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

అవినీతిపై సంధించిన అస్త్రం



నారా రోహిత్ కథానాయకుడిగా రూపొందుతున్న సీక్వెల్ చిత్రం 'ప్రతినిధి 2'. గతంలో వచ్చిన 'ప్రతినిధి' చిత్రానికి ఇది కొనసాగింపు. కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శుక్రవారం చిరంజీవి చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్‌ను యూనిట్ విడుదల చేసింది. రాజకీయ అవినీతిని వెలుగులోకి తెచ్చి ప్రజలను చైతన్యవంతం చేసే యువ జర్నలిస్ట్ పాత్రలో నారా రోహిత్ ఆకట్టుకున్నారు. సచిన్ ఖేడ్కర్, రఘు బాబు, జిష్షూ సేన్ గుప్తా కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్. సినిమాటోగ్రఫీ: నాని చమిడిశెట్టి.

రూ. వంద కోట్లు వసూలు చేస్తుంది



'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' చిత్రం శుక్రవారం విడుదలై మొదటి షో నుంచే బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా హీరో సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'నిర్మాతలు నాగవంశీ, చినబాబు, త్రివిక్రమ్‌గార్లకు కృతజ్ఞతలు. ఈ సినిమా అదిరిపోతుందని విడుదలకు ముందే నాకు తెలుసు. ఆ మాట ప్రేక్షకుల నుంచి వినాలని ఆగాను' అన్నారు. 'తొలిసారిగా విభిన్నమైన పాత్ర పోషించాను. లిల్లీ పాత్ర మీద మొదటి నుంచి నాకు నమ్మకం ఉంది. అది నిజమైనందుకు ఆనందంగా ఉంది' అన్నారు అనుపమ పరమేశ్వరన్. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'సినిమాకు మంచి టాక్ వచ్చింది. ప్రతి ఆటకూ కలెక్షన్లు పెరుగుతున్నాయి. రూ. వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

డబుల్ ధమాకా



విష్వక్‌సేన్ తన పుట్టిన రోజు సందర్భంగా రెండు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్‌కు సైన్ చేశారు. పదో చిత్రానికి 'మెకానిక్ రాకీ' అనే పేరు నిర్ణయించారు. కొత్త దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి ఈ సినిమా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్. కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'

విష్వక్ తన 12వ చిత్రం కోసం దర్శకుడు రామ్‌నారాయణ్‌తో చేతులు కలిపారు. నిర్మాత సాహు గారపాటి ఈ చిత్రానికి నిర్మాత. 'లైలా' అని పేరు పెట్టినట్లు వెల్లడిస్తూ టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

ఏప్రిల్‌లో డియర్ ఆంధ్రా



సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్, ఐశ్వర్యారాజేశ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డియర్ ఆంధ్రా'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వంలో వరుణ్ త్రిపురనేని, అభిషేక్ ఆర్, జీ. పృథ్వీరాజ్ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 12న 'డియర్ ఆంధ్రా'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు శుక్రవారం యూనిట్ ప్రకటించింది. అన్నపూర్ణ స్టూడియోస్, ఏషియన్ సినిమాస్ ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాయి.

తెలంగాణ ఫైన్ ఆర్ట్స్ గురుకుల ఎంట్రెన్స్ టెస్ట్



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్)- మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలోని ఎదులాబాద్-ఘట్‌కేసర్‌లో నిర్వహిస్తున్న ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్‌ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఫైన్ ఆర్ట్స్ విభాగాలు

- **క్లాసికల్ మ్యూజిక్-ఓకల్:** కర్ణాటిక్ మ్యూజిక్, హిందుస్థానీ మ్యూజిక్
- **ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్:** వీణ, వయొలిన్ - కర్ణాటిక్, మృదంగం, తబలా, కీబోర్డు, గిటార్, ఫ్లూట్
- **డ్యాన్స్:** కూచిపూడి, కథక్ ● థియేటర్ ఆర్ట్స్ ● పెయింటింగ్ అండ్ డ్రాయింగ్

అర్హత: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుర్తింపు పాఠశాలల నుంచి అయిదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన/పరీక్షలు రాసే బాలబాలికలు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో రెండు స్క్రీనింగ్ టెస్ట్‌లు ఉంటాయి. మొదటిది టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎఫ్‌ఏఎస్ సెట్, రెండోది ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్. ఒక్కోదానికి 100 మార్కులు నిర్దేశించారు.

- **టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎఫ్‌ఏఎస్ సెట్:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో ఇంగ్లీష్, తెలుగు, మేథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ, ఎన్విరాన్‌మెంటల్/జనరల్ సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అయిదోతరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 35 మార్కులు రావాలి. వీరిని మాత్రమే స్కిల్ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్:** ఎంచుకొన్న విభాగానికి ప్రత్యేకించిన అంశాల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తారు.
- పెయింటింగ్, డ్రాయింగ్ పరీక్షల కోసం పెన్సిల్, ఎరేజర్, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్ తెచ్చుకోవచ్చు. డ్యాన్స్ టెస్ట్ కోసం ఎగ్జామినర్ సమక్షంలో ఒక పాటను ప్లే చేస్తారు.

దిక్సూచి DIKSUCHI

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 18
- **'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్‌ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' తేదీ:** మే 5
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్ తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** tswrsplschools.cgg.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..

సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vbLVr1Nలో చదవండి.

అందరికీ నచ్చే శ్రీరంగ నీతులు



సుహాస్, కార్తిక్ రత్నం, విరాజ్ అశ్విన్, రుహాని శర్మ ముఖ్య పాత్రలు పోషించిన 'శ్రీరంగ నీతులు' చిత్రం వచ్చే నెల 11న విడుదల కానుంది. పంపిణీదారుడు, నిర్మాత ధీరజ్ మొగిలి ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. శుక్రవారం జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో నిర్మాత చిత్ర వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 'దర్శకుడు ప్రవీణ్‌కుమార్ నా స్నేహితుడు. సినిమా బాగా తీశాడు. అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా' అన్నారు. తనకు నచ్చిన పాత్ర ఇందులో చేశానని కార్తిక్ రత్నం చెప్పారు. 'మంచి కథతో తీసిన సినిమాలో నేను నటించినందుకు ఆనందంగా ఉంది' అని విరాట్ అశ్విన్ చెప్పారు. 'ఇదొక ఆంథాలజీ. ప్రవీణ్ చాలా కష్టపడ్డాడు. నిర్మాత చక్కని అభిరుచితో ఈ సినిమా తీశాడు' అన్నారు సుహాస్.

మత్స్యకారుల జీవిత కథ



రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరోహీరోయిన్లుగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సముద్రుడు'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో బదావత్ కిషన్ నిర్మించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సముద్రమే జీవనాధారమైన మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించే కథ ఇది. వారి జీవన పోరాటం, మనోవేదన ఇందులో చూపిస్తున్నాం. త్వరలో సినిమా విడుదల చేస్తాం' అని తెలిపారు. చిత్ర నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా వెనుకంజ వేయకుండా అనుకున్న విధంగా చిత్రాన్ని పూర్తి చేయగలిగామని హీరో రమాకాంత్ చెప్పారు.

గుజరాత్‌లో గూఢచారి



అడివిశేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గూఢచారి 2'. గతంలో ఆయన నటించిన హిట్ చిత్రం 'గూఢచారి'కి ఇది సీక్వెల్. బనితా సంధు శేష్‌కు జోడీగా నటిస్తున్నారు. 'అక్టోబర్', 'సర్దార్ ఉదం' చిత్రాలతో ఆమె హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం గుజరాత్‌లోని భుజ్‌లో జరుగుతున్న షూటింగ్‌లో శేష్‌తో కలసి బనిత పాల్గొంటున్నారు. వారిద్దరిపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఎడారిలో ఉన్న బనిత ఫొటోను చిత్రబృందం షేర్ చేసింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇమ్రాన్‌హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు.

కోల్‌కతా టాప్‌షో

బెంగళూరు ఓటమి ● విరాట్ పోరాటం వృథా

అదరగొట్టిన వెంకటేశ్, నరైన్



సునీల్ నరైన్ (22 బంతుల్లో 47)

బెంగళూరు: కోల్‌కతా నైట్‌రైడర్స్ నుంచి మరో అదిరిపోయే ప్రదర్శన. టాపార్డర్‌లో వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50), ఓపెనర్లు సునీల్ నరైన్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 47), ఫిలిప్ సాల్ట్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చిన్నస్వామి స్టేడియంలో బౌండరీల వర్షం కురిపించారు. దీంతో భారీ ఛేదనను అలవోకగా ముగిస్తూ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)పై 7 వికెట్లతో భారీ విజయం సాధించింది. అలాగే తాజా సీజన్‌లో హోం గ్రౌండ్‌లో ఓడిన తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలవగా, ఈ మైదానంలో నైట్‌రైడర్స్‌కిది వరుసగా ఆరో విజయం. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 83 నాటౌట్) ఒక్కడే రాణించడంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. కామెరూన్ గ్రీన్ (21 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 33) ఫర్వాలేదనిపించాడు. రస్సెల్, హర్షిత్ రాణాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా 16.5 ఓవర్లలో 3 వికెట్లకు 186 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ అయ్యర్ (39 నాటౌట్) సత్తా చాటాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

బాదుడే బాదుడు: ఛేదన కోసం బరిలోకి దిగిన కేకేఆర్ పరుగుల ప్రవాహం తొలి బంతి నుంచే సాగింది. ఆర్సీబీ బౌలర్లు తమ సొంత మైదానంలోనూ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. వైశాక్ మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయగలిగాడు. ఓపెనర్లు నరైన్, సాల్ట్ ధాటిగా ఆడేస్తూ పవర్‌ప్లేలోనే ఏకంగా 85 పరుగులు సాధించారు. ఇది ఆ జట్టు తరఫున రెండో అత్యధికం. చాలా రోజుల తర్వాత నరైన్ తన బ్యాట్ పవర్ చూపించగా, అటు సాల్ట్ తొలి ఓవర్‌లోనే 6,4,6తో 18 పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో నరైన్ మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో అలరించాడు. దీంతో 21 బంతుల్లోనే జట్టు 50 పరుగులకు చేరింది. ఆరో ఓవర్‌లో నరైన్ మరింత విజృంభిస్తూ 4,6,6 బాదేయడంతో 21 పరుగులు వచ్చాయి. అయితే హాఫ్ సెంచరీ ఖాయమని భావించిన నరైన్‌ను మయాంక్ దాగర్ యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. దీంతో తొలి వికెట్‌కు 39 బంతుల్లో 86 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే సాల్ట్‌ను వైశాక్ అవుట్ చేసినా వెంకటేశ్ అయ్యర్ రూపంలో కేకేఆర్ ఆటలో వేగం తగ్గలేదు. తొమ్మిదో ఓవర్‌లోనే స్కోరు వంద పరుగులకు చేరగా.. అటు అయ్యర్ ఆటలో వీలైనంత త్వరగా మ్యాచ్‌ను ముగించాలనే కసి కనిపించింది. దీంట్లో భాగంగా అల్జారి ఓవర్‌లో 6,4,6,4తో 20 పరుగులు రాబట్టాడు. అటు కెప్టెన్ శ్రేయాస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సహకరించాడు. 14 ఓవర్లలోనే స్కోరు 150కి చేరడంతో ఆర్సీబీ ఓటమి ఖరారైంది. 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన వెంటనే వెంకటేశ్‌ను యష్ దయాల్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 29 బంతుల్లో 16 పరుగులే కావాల్సి ఉండగా.. శ్రేయాస్, రింకూ (5 నాటౌట్) మరో 19 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.

విరాట్ అజేయ ఇన్నింగ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి శుభారంభం దక్కకపోయినా విరాట్ మెరుపు ఇన్నింగ్స్‌తో తుది కంటా నిలిచి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. అతడికి గ్రీన్, మ్యాక్స్‌వెల్ (28) చివర్లో దినేశ్ కార్తీక్ (20) సహకరించారు. ఇక ఈ మ్యాచ్‌లోనూ కేకేఆర్ రూ. 24 కోట్ల విలువైన బౌలర్ స్టార్క్ పూర్తిగా తేలిపోవడం గమనార్హం. ఓపెనర్ డుప్లెసి (8) రెండో ఓవర్‌లోనే వెనుదిరగ్గా, మూడో ఓవర్‌లో విరాట్ 6,4.. గ్రీన్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆరో ఓవర్‌లోనూ గ్రీన్ చెలరేగి వరుసగా 4,4,6తో 15 రన్స్ రాబట్టడంతో జట్టు పవర్‌ప్లేను 61 పరుగులతో ముగించింది. కానీ ఆ తర్వాత పరుగుల వేగం తగ్గింది. గ్రీన్‌ను రస్సెల్ బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే 12వ ఓవర్‌లో విరాట్ సిక్సర్, మ్యాక్స్‌వెల్ 4,4తో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. అటు మ్యాక్స్ వరుస ఓవర్లలో ఇచ్చిన రెండు సులువైన క్యాచ్‌లను రమణ్‌దీప్, నరైన్ వదిలేశారు. అయితే అతడిని ఎక్కువ సేపు క్రీజులో నిలువకుండా కేకేఆర్ చూడగలిగింది. 15వ ఓవర్‌లో రింకూ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరాడు. తర్వాతి వరుస ఓవర్లలోనే రజత్ (3)ను రస్సెల్.. అనూజ్ (3)ను హర్షిత్ అవుట్ చేయడంతో పాటు పరుగులను కూడా కట్టడి చేశారు. కానీ 19వ ఓవర్‌లో దినేశ్ కార్తీక్ రెండు సిక్సర్లతో మురిపించాడు. అలాగే ఆఖరి ఓవర్‌లోనూ విరాట్, డీకే చెరో సిక్సర్‌తో ఆర్‌సీబీ స్కోరు 180 దాటింది.



విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 83 నాటౌట్)

1 బెంగళూరు తరఫున ఎక్కువ సిక్సర్లు (241)బాదిన బ్యాటర్‌గా కోహ్లీ. గేల్ (239)ను దాటాడు.

4 టీ20ల్లో 500 మ్యాచ్‌లు పూర్తి చేసిన నాలుగో క్రికెటర్‌గా సునీల్ నరైన్. పొలార్డ్ (660), బ్రావో (573), షోయబ్ మాలిక్ (542) ముందున్నారు.

నేటి మ్యాచ్
లఖ్‌నవూ X పంజాబ్
రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

బెంగళూరు: విరాట్ కోహ్లీ (నాటౌట్) 83, డుప్లెసి (సి) స్టార్క్ (బి) హర్షిత్ 8, గ్రీన్ (బి) రస్సెల్ 33, మ్యాక్స్‌వెల్ (సి) రింకూ (బి) నరైన్ 28, పటీదార్ (సి) రింకూ (బి) రస్సెల్ 3, అనూజ్ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 3, దినేశ్ (రనౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 182/6;** వికెట్ల పతనం: 1-17, 2-82, 3-124, 4-144, 5-151, 6-182; **బౌలింగ్:** స్టార్క్ 4-0-47-0, హర్షిత్ రాణా 4-0-39-2, అనుకూల్ 2-0-6-0, నరైన్ 4-0-40-1, రస్సెల్ 4-0-29-2, వరుణ్ చక్రవర్తి 2-0-20-0.

కోల్‌కతా: సాల్ట్ (సి) గ్రీన్ (బి) వైశాక్ 30, నరైన్ (బి) దాగర్ 47, వెంకటేశ్ అయ్యర్ (సి) కోహ్లీ (బి) యష్ దయాల్ 50, శ్రేయాస్ అయ్యర్ (నాటౌట్) 39, రింకూ సింగ్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 16.5 ఓవర్లలో 186/3;** వికెట్ల పతనం: 1-86, 2-92, 3-167; **బౌలింగ్:** సిరాజ్ 3-0-46-0, యష్ దయాల్ 4-0-46-1, అల్జారీ జోసెఫ్ 2-0-34-0, మయాంక్ దాగర్ 2.5-0-23-1, వైశాక్ 4-0-23-1, గ్రీన్ 1-0-7-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
చెన్నై	2	2	0	0	4	1.979
కోల్‌కతా	2	2	0	0	4	1.047
రాజస్థాన్	2	2	0	0	4	0.800
హైదరాబాద్	2	1	1	0	2	0.675
పంజాబ్	2	1	1	0	2	0.025
బెంగళూరు	3	1	2	0	2	-0.711
గుజరాత్	2	1	1	0	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	0	-0.528
ముంబై	2	0	2	0	0	-0.925
లఖ్‌నవూ	1	0	1	0	0	-1.000

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



సెమీస్‌లో సిక్కి జోడీ

● క్వార్టర్స్‌లో సింధు ఓటమి
● స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ

మాడ్రిడ్: సిక్కిరెడ్డి జోడీ జోరు కొనసాగిస్తూ స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకుపోయింది. ఇక స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లో ఓటమితో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించగా, డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప ద్వయం కూడా పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో సిక్కిరెడ్డి/సుమిత్ రెడ్డి జంట 14-21, 21-11, 21-17తో నాలుగో సీడ్ ఇండోనేసియా ద్వయం రేహాన్ నౌఫల్/లిసా కుసుమావతిని చిత్తు చేసింది. ఫైనల్లో చోటు కోసం ఆరోసీడ్ ఇండోనేసియా జోడీ రినోవ్ రివాల్డీ/పిటా హనింగ్త్యతో సిక్కి ద్వయం అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ సింధు 26-24, 17-21, 20-22తో సుపనిద కటెథాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది. మహిళల డబుల్స్ రౌండ్-8లో మూడో సీడ్ అశ్వినీ పొన్నప్ప/తనీషా క్రాస్టో జంట 13-21, 19-21తో ఆరో సీడ్ లీ చియా/టెంగ్ చున్ (తైపీ) జోడీ చేతిలో ఓడిపోయింది. కాగా, పురుషుల డబుల్స్‌లో భారత జంట ఎమ్ఆర్ అర్జున్/ధ్రువ్ కపిల జోడీకి క్వార్టర్స్‌లో చుక్కెదురైంది. రెండోసీడ్‌గా బరిలోకి దిగిన అర్జున్ ద్వయంపై 21-19, 21-23, 21-17తో మలేసియా జంట జునైది ఆరిఫ్/రా కింగ్ యాప్ గెలిచింది.

'పారిస్'లో పతాకధారిగా నీరజ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదు?

ప్రశ్నించిన అంజూ బాబీ జార్జ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భారత పతాకధారిగా నీరజ్ చోప్రాను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని దిగ్గజ లాంగ్‌జంపర్ అంజూ బాబీ జార్జ్ ప్రశ్నించింది. వెటరన్ టీటీ ఆటగాడు శరత్ కమల్‌ను బృందం నాయకుడిగా ఎంపిక చేస్తూ భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈ నిర్ణయంపై అంజూ స్పందిస్తూ 'టేబుల్ టెన్నిస్ సమాఖ్య సహా అన్ని క్రీడా సంఘాలు పారిస్ గేమ్స్‌కు తమ జట్లను ఇంకా ప్రకటించనేలేదు. అలాంటప్పుడు ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఖాయమైన నీరజ్ చోప్రాను పతాకధారిగా నియమించకపోవడం ఆశ్చర్యకరం' అని వ్యాఖ్యానించింది.

ఒలింపిక్స్ భద్రతకోసం విదేశీ సాయం



పారిస్: ఈ జూలై-ఆగస్టు నెలల్లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న ఫ్రాన్స్.. క్రీడలకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు ఇతర దేశాల సాయాన్ని కోరుతోంది. రెండు వేలమందికిపైగా పోలీసు అధికారులను పంపాలని 46 దేశాలను అభ్యర్థించింది. 2022లో ఖతార్‌లో జరిగిన వరల్డ్ కప్ ఫుట్‌బాల్‌కు రక్షణ కల్పించేందుకు తమ దేశం నుంచి 200 మంది పోలీసులు, పారా మిలటరీ సిబ్బందిని పంపిన విషయాన్ని ఫ్రాన్స్ అంతర్గత మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది. అలాగే కొద్ది సంఖ్యలో మిలిటరీ సిబ్బందిని కూడా పంపాలని పలు దేశాలను ఫ్రాన్స్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా కోరింది.

అమెరికా జట్టులో కోరె అండర్సన్



న్యూయార్క్: న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ కోరె అండర్సన్ ఇకపై అమెరికా క్రికెట్ జట్టు తరఫున ఆడబోతున్నాడు. కెనడాతో జరిగే ఐదు టీ20ల సిరీస్ కోసం మోనాంక్ పటేల్ నేతృత్వంలో 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. 2018లో కివీస్ తరఫున చివరి మ్యాచ్ ఆడిన 33 ఏళ్ల అండర్సన్ 2020లో అమెరికాకు వచ్చాడు. అక్కడి దేశవాళీ మ్యాచ్‌ల్లో పరుగుల వరద పారించడంతో ఇప్పుడు జాతీయ జట్టుకు ఆడనున్నాడు. గతంలో భారత అండర్-19కు ఆడిన హర్మీత్ సింగ్, ఢిల్లీ బ్యాటర్ మిలింద్ కుమార్, కెనడా జట్టు మాజీ కెప్టెన్ నితీష్ కుమార్ కూడా టీమ్‌లో ఉన్నారు. అయితే యూఎస్‌లో క్రికెట్ ఆడుతున్న ఉన్ముక్త్ చంద్‌కు మాత్రం నిరాశే ఎదురైంది.

టీ20 కెప్టెన్‌గా మళ్లీ బాబర్!

షహీన్ అవుట్?



కరాచీ: పాకిస్థాన్ టీ20 జట్టు కెప్టెన్‌గా షహీన్ షా అఫ్రీది స్థానంలో బాబర్ ఆజమ్ నియామకం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చేనెల 18నుంచి స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తోనే బాబర్ తిరిగి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో జట్టు దారుణ వైఫల్యం దరిమిలా మూడు ఫార్మాట్లలో ఆజమ్ కెప్టెన్సీపై వేటు పడింది. అనంతరం టీ20 జట్టు సారథిగా నవంబరులో అఫ్రీది నియమితుడయ్యాడు. అతడి హయాంలో ఒకటే టీ20 సిరీస్ కివీస్‌తో ఆడిన పాక్ 1-4తో ఓడింది.

సోషల్ మీడియాను పట్టించుకోవద్దు!

● హార్దిక్‌కు స్మిత్ బాసట

న్యూఢిల్లీ: ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై క్రికెట్ ఫ్యాన్స్ విమర్శలు అసంబద్ధమని ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ అన్నాడు. సోషల్ మీడియాలో వాటిని హార్దిక్ చూడడం మానేయాలని సూచించాడు. ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ అందించిన రోహిత్‌ను పక్కనబెట్టిన ముంబై ఫ్రాంచైజీ ఈ సీజన్‌కు హార్దిక్‌ను కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. దాంతో గరంగరంగా ఉన్న రోహిత్ అభిమానులు పాండ్యాపై విమర్శల దాడికి దిగారు.

బిజినెస్

పసిడి సరికొత్త రికార్డు



2023-24లో రూ.8,730 అప్

ఒక్కరోజే రూ.1,420 పెరుగుదల, తులం రూ.68,730

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 2,250 డాలర్ల ఎగువకు

హైదరాబాద్: బంగారం మళ్లీ కొండెక్కుతోంది. శుక్రవారం నాడు హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ఒక్కరోజే రూ.1,420 పెరిగి రూ.68,730కి చేరుకుంది. ధర రూ.68,000 దాటడం ఇదే తొలిసారి. 22 క్యారెట్ల బంగారం సైతం రూ.1,300 పెరిగి రూ.63,000కు ఎగబాకింది. కిలో వెండి రూ.80,800 పలికింది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధర పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2,254 డాలర్లకు పుంజుకుంది. వెండి 25.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒక్క మార్చి నెలలోనే ఔన్సు బంగారం 9 శాతం పెరిగింది. 2020 జూలై తర్వాత అత్యధిక నెలవారీ వృద్ధి ఇది. అంతేకాదు, వరుసగా రెండు త్రైమాసికాలుగా బంగారం ప్రియమవుతూనే వచ్చింది.

2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.60,000 స్థాయిలో ఉన్న తులం బంగారం.. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి మరో రూ.8,730 పెరుగుదలతో రూ.68,730కి చేరుకుంది. అంటే పసిడి ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువ ఏడాది కాలంలో 14.6 శాతం పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై మరింత స్పష్టత వస్తే, బంగారం రేటు మరింత పుంజుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరినాటికి వడ్డీరేట్లను 0.75 శాతం మేర తగ్గించే అవకాశాలున్నాయని ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది.

కొత్త ఇళ్ల సరఫరా తగ్గింది

కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: హైదరాబాద్ సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా జనవరి-మార్చి త్రైమాసికంలో సగటున 15 శాతం తగ్గిందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. బెంగళూరు, ముంబై నగరాల్లో మాత్రం సరఫరా స్వల్పంగా పెరిగిందని; ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, హైదరాబాద్, పుణె, కోల్కతా, అహ్మదాబాద్‌లలో తగ్గిందని పేర్కొంది. దేశవ్యాప్తంగా గత ఏడాది ఇదే త్రైమాసికంలో 81,167 ఇళ్లు అందుబాటులోకి రాగా ఈ ఏడాది 69,143 యూనిట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయని పేర్కొంది. హైదరాబాద్‌లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లు గత ఏడాది జనవరి-మార్చితో పోల్చితే 14,371 యూనిట్ల నుంచి 11,090కి తగ్గాయి. ఈ ఎనిమిది నగరాల్లోనూ మొత్తం ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన భవనాల వాటా 34 శాతం ఉన్నట్టు పేర్కొంది.

ఎఫ్‌పీఐ పెట్టుబడుల వరద

2023-24లో మొత్తం రూ.3.4 లక్షల కోట్లు రాక

న్యూఢిల్లీ: ఈ నెల 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత మార్కెట్లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) పోటెత్తాయి. డిపాజిటరీల వద్దనున్న సమాచారం ప్రకారం.. ఈసారి ఎఫ్‌పీఐలు ఈక్విటీ మార్కెట్లో రూ.2.08 లక్షల కోట్లు, డెట్ మార్కెట్లోకి మరో రూ.1.2 లక్షల కోట్లు కలిపి మొత్తం రూ.3.4 లక్షల కోట్లు గుమ్మరించారు. అంతర్జాతీయ ప్రతికూలతల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మాత్రం మన ఈక్విటీల నుంచి విదేశీ పెట్టుబడులు వెనక్కి తరలిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నికరంగా రూ.37,632 కోట్లు, 2021-22లో రూ.1.4 లక్షల కోట్లు వెనక్కి తీసుకున్నారు. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పీఐల రాకపై మజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ భరత్ ధావన్ అప్రమత్తతతో కూడిన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రగతిశీల సంస్కరణలు, ఆర్థిక స్థిరత్వం, ఆకర్షణీయ పెట్టుబడి మార్గాలు ఎఫ్‌పీఐల జోరు కొనసాగేందుకు దోహదపడవచ్చన్నారు. అయితే, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఆందోళనలు పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపవచ్చన్నారు.

జీ బెంగళూరు కేంద్రంలో సగం మంది ఔట్

న్యూఢిల్లీ: జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీఎల్) ఉద్యోగుల కోతలకు దిగింది. బెంగళూరులోని కంపెనీ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కేంద్రంలో (టీఐసీ) పని చేస్తున్న ఉద్యోగుల్లో సగం మందిని ఇంటికి పంపించింది. ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ చర్య తీసుకున్నట్టు కంపెనీ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. అయితే ఎంత మంది ఉద్యోగులను తొలగించిందీ వెల్లడించలేదు. కంపెనీ తాజా వార్షిక నివేదిక ప్రకారం ఈ కేంద్రంలో 650 మందికిపైగా ఇంజినీర్లు పని చేస్తున్నారు. దీంతో వీరిలో కనీసం సగం మంది రోడ్డున పడినట్టు భావిస్తున్నారు.

యశోదాలో ఫ్యూజిఫిలిం అత్యాధునిక అల్ట్రా సౌండ్ పరికరం



హైదరాబాద్: డయాగ్నస్టిక్ ఇమేజింగ్‌లో అగ్రగామి అయిన ఫ్యూజిఫిలిం అత్యాధునికమైన అరీటా 850 డయాగ్నస్టిక్ అల్ట్రాసౌండ్ సిస్టమ్‌ను యశోదా ఆస్పత్రిలో ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఇలాంటి అత్యాధునిక యంత్రం అందుబాటులోకి రావడం ఇదే ప్రథమమని ఫ్యూజిఫిలిం తెలిపింది. ఉదరకోశ వ్యాధులను ప్రత్యేకించి ఉదరకోశంలోను, చుట్టుపక్కల ప్రాంతాల్లోను ఏర్పడే కేన్సర్ టిష్యూలను గుర్తించి సకాలంలో సరైన చికిత్స అందించడానికి ఈ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ యంత్రం ఎంతో సహాయకారి అవుతుందని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	375	విజయవాడ	400
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	400	వరంగల్	377
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	122	గోదావరి	121
వరంగల్	122	విజయవాడ	121
కరీంనగర్	122	గుంటూరు	122
మహబూబ్‌నగర్	122	ఒంగోలు	122
కర్నూలు	123	చిత్తూరు	135
విశాఖపట్నం	117		

మార్చి 31 వచ్చేస్తోంది
పన్ను ప్లానింగ్‌లో తడబాటు వద్దు

పన్ను ఆదా పథకాల్లో పెట్టుబడులు ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి. ఈ విషయం ఆలోచించకుండా పన్ను ఆదా పథకాల్లో మదుపు చేస్తే కొద్ది మొత్తంలో పన్ను ఆదా ఐనా, రాబడులు పెద్దగా ఉండవు. మార్కెట్ అనుకూలించక పోతే ఈఎల్‌ఎస్ఎస్, యులిప్స్ వంటి పన్ను ఆదా పథకాల్లో అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది.

ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంక ఒక రోజే వ్యవధి ఉంది. పన్ను ప్లానింగ్ ఇంకా పూర్తి చేయని వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు పన్ను తగ్గించుకునేందుకు చివరి క్షణం చర్యలకు పరుగులు తీస్తారు. ఏ పథకంలో మదుపు చేస్తే అధిక లాభం పొందగలమా అని ఆదుర్దా పడుతుంటారు. ఇది డిస్ట్రిబ్యూటర్లు, బ్రోకర్లకు పండగ. మా పథకం మంచిదంటే మాదంటూ వెంటపడుతుంటారు. పన్ను చెల్లింపుదారులు కూడా పన్ను భారం తగ్గించుకోవడమే ముఖ్యంగా భావించి ఏదో ఒక పథకంలో మదుపు చేస్తుంటారు. తీరా చూస్తే వాటిలో రాబడి అంతంత మాత్రంగానే ఉన్నా, పెట్టుబడి మాత్రం ఖరీదుగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఇంకా తమ పన్ను ఆదా పెట్టుబడులు పూర్తి చేయని ఐటీ చెల్లింపుదారులు ఈ కింది జాగ్రత్తలు పాటించడం మంచిది.



పరిమితి కంటే తక్కువ పెట్టుబడులు

పాత ఆదాయ పన్ను పథకాన్ని వినియోగించుకునే ఐటీ చెల్లింపుదారులు పన్ను ఆదా కోసం సెక్షన్ 80సీ కింద చేసే పెట్టుబడుల్లో రూ.1.5 లక్షల వరకు, సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద ఎన్‌పీఎస్‌లో మదుపు చేస్తే మరో రూ.50,000 వరకు మినహాయింపు లభిస్తుంది. ఇవి కాకుండా తన కోసం, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియం, గృహ, విద్యా రుణాలపై చెల్లించే వడ్డీకి కూడా ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తుంది. ఐటీ రిటర్న్ ఫైల్ చేసే వారిలో చాలా మందికి ఈ విషయాలు తెలియవు. దాంతో తమ ఆదాయ పరిమితి మినహాయింపు పరిమితి కంటే తక్కువ పెట్టుబడులను క్లెయిమ్ చేస్తుంటారు. చక్కటి ప్లానింగ్‌తో ఈ పరిమితిని ఉపయోగించుకుంటే పన్ను ఆదాతో పాటు, పెట్టుబడులపై మంచి రాబడులూ పొందే అవకాశం ఉంటుంది. మరి కొంత మంది వివిధ సెక్షన్ల కింద లభించే మినహాయింపులపై అవగాహన లేక తమ పరిమితికి మించి పెట్టుబడులు పెడుతుంటారు. దీని వల్ల పెట్టుబడులు ఆయా పథకాలను బట్టి మూడు నుంచి ఐదేళ్ల పాటు లాక్ అయిపోతాయి.

ప్రణాళికా రహిత పెట్టుబడులు

ఆర్థిక ప్రణాళికకు మరో పేరే టాక్స్ ప్లానింగ్. ఐటీ చెల్లింపుదారులు, ఈ వియాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా పథకాల మంచి చెడులను కూలంకషంగా తెలుసుకుని మాత్రమే పెట్టుబడులు పెట్టాలి. ముఖ్యంగా ఎన్‌పీఎస్, సెక్షన్ 80 సీ పెట్టుబడి పథకాలు ఎంచుకోవాలి. ఈక్విటీ మార్కెట్ ఆటుపోట్లకు సిద్ధమైతే ఈఎల్ఎస్ఎస్ పథకాలు, రిటైర్మెంట్ కోసమైతే ఎన్‌పీఎస్ పథకాలు ఎంచుకోవాలి. ఏ మాత్రం నష్ట భయాన్ని తట్టుకోలేకపోతే ఎన్ఎస్‌సీ లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలను ఎంచుకోవాలి. ఏదేమైనా టాక్స్ ప్లానింగ్ ఆయా వ్యక్తుల దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి.

హడావిడి వద్దు

బ్యాంక్ రిలేషన్‌షిప్ మేనేజర్ లేదా బీమా ఏజెంట్లతో ఎంత పరిచయం ఉన్నా, తొందరపడి పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక పెట్టుబడులకు కమిట్ కావద్దు. దీర్ఘకాలిక ఆలోచనతోనే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. పాలసీ గడువు కంటే ముందే పాలసీ నుంచి తప్పుకుంటే పెద్ద మొత్తంలో నష్టపోవాల్సి ఉంటుంది. మనకు ఎంత కవరేజి కావాలి, పాలసీ గడువు ముగిసే వరకు ప్రీమియం చెల్లించగలమా, లేదా; పాలసీపై వచ్చే 5-6 శాతం రాబడులపై తృప్తి పడగలమా అనే విషయాలు అన్నీ ఆలోచించుకున్న తర్వాతే జీవిత బీమా పాలసీలు తీసుకోవాలి. టాక్స్ ప్లానింగ్ కోసం యులిప్స్‌లో మదుపు చేస్తున్నా, వాటిపై రాబడులు మార్కెట్ పనితీరుపై ఆధారపడి ఉంటాయనే విషయాన్ని మర్చిపోవద్దు.

నష్ట భయం ఉండే పెట్టుబడులు

ఈక్విటీ మార్కెట్లు జోరు మీద ఉండడంతో ఈఎల్ఎస్ఎస్ పథకాలు గత ఏడాది సగటున 37.4 శాతం, గత మూడేళ్లలో సగటున 18.1 శాతం రాబడులు పంచాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని సెక్షన్ 80సీ కింద లభించే రూ.1.5 లక్షల ఆదాయ మినహాయింపునకు ఉన్న మొత్తాన్ని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో మదుపు చేయవద్దు. ఎందుకంటే స్టాక్ మార్కెట్ ఇప్పటికే హీటెక్కి ఉంది. స్మాల్ అండ్ మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లు తీవ్రంగా నష్టపోతున్నాయి. దీంతో సూచీలూ దిద్దుబాటుకు లోనవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో రూ.50,000 నుంచి రూ.60,000కు మించి పెట్టుబడి పెట్టవద్దు. మిగతా మొత్తాన్ని సురక్షితమైన పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ లేదా టాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మదుపు చేయండి.

అవగాహన

టాక్స్ సేవింగ్ పెట్టుబడుల రాబడులపై పన్ను పోటు ఉంటుందా, లేదా అనే విషయం కూడా మదుపరులు తెలుసుకుని ఉండాలి. ఎన్ఎస్‌సీ రాబడులపై పన్ను పోటు ఉంటుంది. ఈఎల్ఎస్ఎస్ పథకాలపై వచ్చే రాబడులపై రూ.లక్ష వరకే పన్ను మినహాయింపు లభిస్తుంది. అంతకు మించిన రాబడులపై 10 శాతం చొప్పున పన్నుపోటు తప్పదు. ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాతే టాక్స్ సేవింగ్ పథకాల్లో మదుపు చేయాలి.

బీఆర్ఎస్ అవినీతిపై చర్యలేవీ?



(మొదటిపేజీ తరువాయి)

గెలిస్తే.. ఏ పార్టీ వైపు వెళతారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో వాటిని అమలు చేసే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి ప్రజలపై రాహుల్ గాంధీ టాక్స్ వేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం, నల్లగొండలోనూ బీజేపీకి సానుకూల వాతావరణం ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎంపీ సీటును కూడా బీజేపీ కైవసం చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలి: సంజయ్

సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభంతో నాలుగు నెలలుగా కార్మికులు, యజమానులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.270 కోట్లు చెల్లించలేదని, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఫలితంగా వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన దాదాపు 20 వేల మంది కార్మికులు పనుల్లేక పస్తులు ఉంటున్నారని, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. బకాయిలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. పవర్‌లూం కార్ఖానాలకు 24 ఏళ్ల నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను నిలిపివేయడంతో రెట్టింపు కరెంటు బిల్లులు వస్తున్నాయని తెలిపారు. విద్యుత్ బకాయిలను మాఫీ చేయడంతోపాటు సబ్సిడీని కొనసాగించాలని కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన పది శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.370 కోట్లతో ప్రవేశపెట్టిన వర్కర్ టూ ఓనర్ పథకం నిలిచిపోయిందని, దానిని ప్రారంభించాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో మొదట జైలుకు వెళ్లాల్సింది హరీశ్‌రావే: రఘునందన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదట జైలుకు వెళ్లాల్సింది హరీశ్‌రావేనని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం మెదక్‌లోని జంబికుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మునిగిపోతున్న టైటానిక్ షిప్ అని అన్నారు. రంజిత్ రెడ్డి నుంచి కడియం కావ్య వరకు బీఆర్ఎస్‌ను వీడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అనేక అక్రమాలు చేశారని ధ్వజమెత్తారు. ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేసినోళ్లు సేవ చేస్తామని వస్తున్నారని.. మెదక్ ప్రజలు ఆలోచించాలని కోరారు.

వరంగల్ బీఆర్ఎస్ టికెట్ దక్కేదెవరికి?

- రేసులో పెద్ది స్వప్న, బోడ డిన్నా, జోరిక రమేశ్
- మళ్లీ గులాబీ గూటికి రాజయ్య!

వరంగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్, బీజేపీకి దీటుగా బలమైన అభ్యర్థిని బరిలో దించాలని బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్య పోటీ నుంచి తప్పుకోవడం, కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగనుండడంతో కొత్త అభ్యర్థి కోసం బీఆర్ఎస్ అధిష్ఠానం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగానే హనుమకొండ జిల్లా మడికొండలో ఆదివారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. కేడర్‌లో అయోమయాన్ని తొలగించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగనున్నారు. అయితే, ఈ సమావేశంలోగానే వరంగల్ ఎంపీ అభ్యర్థిని ఖరారు చేయాలని పార్టీ నేతలు భావిస్తున్నారు. కాగా, టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి భార్య పెద్ది స్వప్న, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, జోరిక రమేశ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు.. ఇటీవలే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తాటికొండ రాజయ్య తిరిగి గులాబీ గూటికి చేరుతారని, టికెట్ ఆయనకే ఇస్తారనిప్రచారం జరుగుతోంది.

కేసీఆర్ జిల్లాల పర్యటన

- 31న జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పంట పొలాల పరిశీలన

హైదరాబాద్/జనగామ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాల పర్యటనకు సిద్ధమయ్యారు. సాగు నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను స్వయంగా పరిశీలించేందుకు తమ అధినేత కేసీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారని బీఆర్ఎస్ ప్రకటించింది. ఇందులో భాగంగా మార్చి 31న జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలిస్తారని వెల్లడించింది.

నన్ను పిచ్చోణ్ణి చేశారు

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా.. పార్టీలోకి రానివ్వబోమని తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్టీని వీడే నాయకులు వెళ్తూ వెళ్తూ కొన్ని రాళ్లు వేసి వెళ్తారని, అది వారి విజ్ఞతకే వదిలేద్దామన్నారు. ఏదేమైనా.. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. "అసెంబ్లీ ఎన్నికల వేళ చేవెళ్ల పార్లమెంటు పరిధిలో కొన్ని చోట్ల నేనూ ప్రచారం చేశాను. తాండూరు అసెంబ్లీ సీటు ఏకపక్షంగా గెలుస్తామనుకున్నాం. ఏం జరిగిందో తెలియదు.. కొన్ని చోట్ల ఓడియాం. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టలేడని అంటారు.. ఆ కోవలోనే.. అసెంబ్లీ ఎన్నికల్లో సొంత పార్టీ నేతలకే పట్నం మహేందర్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు. వారి ఓటమికి కారణమయ్యారు. ఇక.. రంజిత్‌రెడ్డి విషయానికి వస్తే ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నాకు ఫోన్ చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా నన్ను ప్రకటించండి.. తప్పకుండా గెలుద్దాం.. అని స్వయంగా చెప్పారు. తీరా చూస్తే ఎమ్మెల్సీ కవిత అరెస్టయిన రోజే నవ్వుకుంటూ.. వెళ్లి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీకి ద్రోహం చేసిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిపై కార్యకర్తలు పగ తీర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం చేవెళ్లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి" అని సూచించారు. ఇలాంటి కష్ట కాలంలో కేకే, కడియం వంటి నాయకులు పార్టీ వదిలిపెట్టి వెళ్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

13న చేవెళ్ల సభను విజయవంతం చేద్దాం

వచ్చే నెల 13న కేసీఆర్ ఆధ్వర్యంలో చేవెళ్లలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. చేవెళ్ల పార్లమెంటులో నిలబడ్డది కాసాని జ్ఞానేశ్వర్ కాదు... కేసీఆర్ అన్నట్టుగానే పార్టీ శ్రేణులు నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ముఖ్య నాయకులు పార్టీని వదిలి వెళ్లినా సరే.. పార్టీ కేడర్ కోసం తానే స్వయంగా పని చేస్తానన్నారు. ఇన్ని రోజులు పార్టీ కోసం, నాయకుల కోసం పని చేసిన కార్యకర్తలను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు.

బీజేపీని ఆపే శక్తి కాంగ్రెస్‌కు లేదు

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అంటూ ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి.. ఎన్నికల తర్వాత ఆయనే బీజేపీకి బీ టీమ్‌లా మారారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ నుంచి సీఎం అయిన ఆయన రాహుల్ కోసం పనిచేస్తున్నారా? మోదీ కోసం పని చేస్తున్నారా? చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బీజేపీకి లాభమవుతుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. బీజేపీని ఆపే బలం స్థానిక పార్టీలు, స్థానిక నేతలకే ఉందని, కాంగ్రెస్‌కు ఆ శక్తి లేదన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి దేశవ్యాప్తంగా 40ఎంపీ సీట్ల కన్నా ఎక్కువ వచ్చే పరిస్థితి లేదని జోస్యం చెప్పారు. సిటింగ్ స్థానమైన మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేయాలన్న సవాల్‌పై వెనుకంజ వేసిన రేవంత్‌రెడ్డి.. అన్ని సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తామని అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. "నల్లగొండ, ఖమ్మం నేతలే మానవ బాంబులు అవుతారు జాగ్రత్త.. అయిదేళ్లు.. సీఎం పదవిని కాపాడుకో" అని రేవంత్‌ను ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోరాటపథంలో కదం తొక్కుదాం

రాష్ట్రంలో నిఖార్సయిన కొత్త తరం నాయకత్వాన్ని తయారు చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ పోరాట పంథాలో కదం తొక్కుదామని పార్టీ శ్రేణులకు 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చారు. శూన్యం నుంచి సునామీ సృష్టించి.. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ధీశాలి కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని కొన్ని కప్పదాట్లు, ద్రోహపు ఎత్తుగడలతో దెబ్బ తీయాలనుకునే వారికి ప్రజలే జవాబు చెప్తారని పేర్కొన్నారు. 14 ఏళ్ల పోరాడి తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను ప్రజలే గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటారన్నారు.

భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ మంతనాలు

కేటీఆర్, హరీశ్‌తో సమాలోచన

కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని సూచన

జగదేవ్‌పూర్, మార్చి 29: పలువురు ముఖ్య నేతలు పార్టీని వీడుతున్న వేళ భవిష్యత్తు కార్యాచరణపై బీఆర్ఎస్ అధినేత దృష్టి పెట్టారు. ఈ మేరకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సమావేశమై సమాలోచన జరిపారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి కేశవరావు వచ్చి వెళ్లిన తర్వాత గురువారం మధ్యాహ్నం కేటీఆర్, హరీశ్‌రావు అక్కడికి చేరుకుని కేసీఆర్‌తో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. గురువారం రాత్రి పొద్దుపోయే వరకూ వీరి సమావేశం జరిగినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ వెళ్లిన కేటీఆర్ మధ్యాహ్నం తిరిగి వ్యవసాయ క్షేత్రానికి వచ్చారు. హరీశ్‌రావు కూడా దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల కార్యకర్తల సమావేశాల్లో పాల్గొని తిరిగి వచ్చారు. అలాగే, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిశారు. పార్టీకి సంబంధించిన పలు అంశాలపై వీరి మధ్య సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు సమాచారం. నాయకులు పార్టీని వీడినంత మాత్రాన నష్టం ఏమీ లేదని, కార్యకర్తలకు ధైర్యం చెప్పాలని కేసీఆర్ ఈ సందర్భంగా సూచించినట్లు తెలిసింది.



హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న ఆటో డ్రైవర్లు

పార్టీని వీడుతున్నది దొంగలు, ద్రోహులే

- కాళ్లు మొక్కినా మళ్లీ వాళ్లను చేర్చుకోం: హరీశ్
- కడియం రాజీనామా చేసి వెళ్లాలి: దాస్యం
- ఘన్‌పూర్‌లో కడియం దిష్టిబొమ్మ దహనం
- బీఆర్ఎస్‌లో స్క్రాప్ పోయింది: పోచారం

సిద్దిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దొంగలు, ద్రోహులు మాత్రమే బీఆర్ఎస్ పార్టీని వీడిపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. పార్టీకి ద్రోహం చేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్లేనని అన్నారు. శుక్రవారం సిద్దిపేట, దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడారు. ఇప్పుడు పార్టీ నుంచి వెళ్లిపోయినవారు భవిష్యత్తులో దండం పెట్టి, కాళ్లు మొక్కినా తిరిగి చేర్చుకొనేది లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు నాయకులను కొనగలరేమో కానీ, బీఆర్ఎస్ కార్యకర్తలను కొనే శక్తి ఎవరికీ లేదన్నారు. నాడు ఉద్యమ సమయంలో, తర్వాత పదేళ్ల రాష్ట్ర ప్రగతిలో కార్యకర్తలే పార్టీకి అండగా ఉన్నారని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండం అన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ ఈ సందర్భంగా స్పందించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2500, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, వరికి రూ.500 బోనస్, కౌలురైతులకు రూ.15 వేల సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు.. అందుకున్నవారు కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని, లేదంటే బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తూ తనతో పాటు కరువును తెచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 35 మంది ఆటోకార్మికులు చనిపోయారని.. వారిలో ఏ ఒక్కరి కుటుంబాన్ని కూడా కాంగ్రెస్ నేతలు పరామర్శించలేదని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, కార్యకర్తలే బీఆర్ఎస్‌కు మళ్లీ పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.

కడియం రాజీనామా చేయాలి: దాస్యం

రాంనగర్, స్టేషన్‌ఘన్‌పూర్, జోగిపేట: దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి రాజీనామా చేయాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ డిమాండ్ చేశారు. కడియం ఓ చీటర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో హైవేపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కుప్పలుతెప్పలుగా వచ్చిన స్క్రాప్ అంతా నేడు అధికారం పోగానే తరలిపోయిందని బీఆర్ఎస్ నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్క్రాప్ వెళ్లిపోవడంతో పార్టీకి పట్టిన శని వదిలిందన్నారు.

'దానం'పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను ఎలా ఆదేశించగలం?

- హైకోర్టు ప్రశ్న.. విచారణ 1వ తేదీకి వాయిదా

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్‌కు న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వగలదా? దానికి సంబంధించి గత తీర్పులు ఏమైనా ఉన్నాయా అని హైకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని ఖైరతాబాద్‌కు చెందిన ఓటరు బొల్లబోయిన రాజుయాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది బీ వివేకానంద వాదనలు వినిపిస్తూ.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా దానం నాగేందర్ పార్టీ మారారని తెలిపారు. అందువల్ల ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ పిటిషనర్ స్పీకర్‌కు వినతి పత్రం ఇచ్చారని తెలిపారు. దానిపై నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'ఈ పిటిషన్ దాఖలు చేయడానికి పిటిషనర్‌కు ఉన్న అర్హత ఏమిటి? ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని ఓ ఓటరు కోరవచ్చా? సాధారణంగా ఎమ్మెల్యేకు టికెట్ ఇచ్చిన పార్టీ స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తుంది.. అలాంటప్పుడు ఓ ఓటరు ఎలా కోరుతారు? అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వొచ్చు అనే అంశంపై ఒక్క తీర్పు అయినా ఉంటే తీసుకురండి. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 1కి వాయిదా పడింది.

బీఆర్ఎస్‌లో స్వేచ్ఛ లేదు

- అందుకే పార్టీ మారాల్సి వచ్చింది: దానం



బంజారా హిల్స్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో స్వేచ్ఛ కరువవ్వడంతో పార్టీ మారాల్సి వచ్చిందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. బంజారా హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఫిలింనగర్‌కు చెందిన వివిధ బస్తీల నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. తమకు చెప్పకుండా పార్టీ మారడంపై ఆ నాయకులు ప్రశ్నించారు. దానం నాగేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌ను కలవాలంటే ఆయన చుట్టూ ఉన్న అనేక మంది అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి పరిస్థితుల్లో రాజకీయ పార్టీలో పనిచేయడం సాధ్యం కాదని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కాంగ్రెస్ అధిష్ఠానం తనతో సంప్రదింపులు జరిపిందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బలమైన అభ్యర్థి లేకపోవడంతో పాటు సర్వే సంస్థలు తన పేరు సూచించడంతో అనుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాల్సి వచ్చిందన్నారు. ఈ విషయం తన కుటుంబసభ్యులకు కూడా తెలియదని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరడం అనుకోకుండా జరిగిన పరిణామమని, జరిగింది మరిచిపోయి రాబోయే లక్ష్యం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎంపీగా గెలిస్తే బస్తీల రూపురేఖలను మార్చవచ్చని, మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.

నేను గొర్రెను కాను.. కాలేను!

- ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీ వీడను: ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): 'నేను గొర్రెను కాను.. కాలేను.. ఎన్ని ప్రలోభాలు పెట్టినా పార్టీని వీడను' అంటూ నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. సీనియర్ నేతలు కె.కేశవరావు, కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో తనను కూడా వారి బాటలోనే 'మంచి'దారి వెతుక్కోమని కొందరు ఫోన్లు చేస్తున్నారని.. మరోవైపు బీఆర్ఎస్‌ను వీడొద్దంటూ కార్యకర్తలు కోరుతున్నారని ఆయన చెప్పారు. అయితే తనకు వేరే పార్టీలోకి వెళ్లే ఆలోచనే లేదంటూ 'ఎక్స్'లో శుక్రవారం సుదీర్ఘ ట్వీట్ చేశారు. 'అన్ని ఆలోచించే నేను బీఆర్ఎస్‌లో చేరాను. సొంత పిల్లల భవిష్యత్తు కోసమో.. అక్రమాస్తుల కోసమో, హంగూఆర్భాటాలు, ప్రొటోకాల్ కోసమో రాజకీయాల్లోకి రాలేదు. వెన్నుపోట్లు, ద్రోహాలు, కుట్రలు బీఆర్ఎస్‌కు కొత్తేం కాదు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ద్రోహుల చెంప చెళ్లుమనేలా విజయభేరి మోగిద్దాం' అని బీఆర్ఎస్ కార్యకర్తలనుద్దేశించి పేర్కొన్నారు.

మరో ఇద్దరు ఎంపీ అభ్యర్థులూ జంప్?

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా వరంగల్ అభ్యర్థి కడియం కావ్య కూడా గులాబీ పార్టీకి రాజీనామా చేసి.. హస్తం గూటికి చేరేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. వీరు బీఆర్ఎస్ అభ్యర్థిత్వాలను వదులుకుని పార్టీని వీడడం, వీరినే కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థులుగా నిలుపుతుండడంతో ఇంకా ఎవరెవరు వెళతారోనన్న ఆందోళన గులాబీ శిబిరంలో మొదలైంది. వాస్తవానికి గత ఎన్నికల వరకు బీఆర్ఎస్ టికెట్ తమకు ఇవ్వాలంటే తమకు ఇవ్వాలంటూ తీవ్ర పోటీ ఉండేది. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమిపాలై.. అధికారం కోల్పోయేసరికి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా నేతలెవరూ స్వతంత్రంగా, సంతోషంగా ముందుకురాని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవేళ ఎవరికైనా టికెట్ ఇచ్చినా నామినేషన్ వేసేవరకు పార్టీతోనే ఉంటారన్న నమ్మకమూ లేకుండా పోయింది. పార్టీ తరఫున ప్రకటించిన అభ్యర్థులే కాంగ్రెస్‌లోకి జంప్ అవుతుండడంతో బీఆర్ఎస్ నాయకత్వం ఆందోళన చెందుతోంది. ఎంపీ అభ్యర్థులే కాకుండా.. పార్టీ సీనియర్ నేతలు, గతంలో మంత్రులుగా పనిచేసినవారు, సిటింగ్ ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. తాజాగా కె.కేశవరావు, కడియం శ్రీహరి కూడా పార్టీ మారడం ఖాయమైంది. అయితే వీరు బహిరంగంగా పార్టీ మారుతుండగా.. లోలోపల ఇంతకంటే పెద్ద వ్యవహారమే జరుగుతోందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ వర్గాల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. రాబోయే కొద్దిరోజుల్లో భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్టు తెలుస్తోంది. పార్టీ మారితే చట్టపరంగా ఇబ్బందిలేని సంఖ్యలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వస్తారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. మూడింట రెండు వంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని చెప్పకనే చెబుతున్నారు. తమతో 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డితో సహా పలువురు మంత్రులు కూడా చెబుతున్న విషయం తెలిసిందే.

పార్టీలో కీలకం అనుకున్నవారే..

గతంలో పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతలంతా పార్లమెంటు ఎన్నికల వేళ పార్టీని వీడి వెళ్తుండడంపై బీఆర్ఎస్‌లో అంతర్మథనం మొదలైనట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న మిగతా నేతల్లోనూ పార్టీ మారాలనే ఆలోచన మొదలైందని, ఇందుకోసం వారితో టచ్‌లో ఉన్న అధికార పార్టీ కీలక నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని సమాచారం. నిన్నమొన్నటి వరకు ఓవర్‌లోడ్‌తో కిక్కిరిసిపోయిన 'కారు' ఇప్పుడు ఇలా క్రమంగా ఖాళీ అవుతోంది. వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే గులాబీ నేతలు ఒక్కొక్కరుగా కారు దిగి.. చేయి అందుకుంటున్నారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. తాము అన్ని గేట్లు ఎత్తితే బీఆర్ఎస్ నాయకులందరూ తమ పార్టీలోకి వస్తారని కాంగ్రెస్ నేతలు ఇప్పటికే అంటున్నారు. పార్లమెంటు ఎన్నికల్లోపే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోతే లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవడం ఆ పార్టీకి కష్టతరంగా మారుతుంది. మరోవైపు పార్టీ మారకుండా ఉన్నవారైనా పార్లమెంటు ఎన్నికల్లో గట్టిగా పనిచేస్తారా? అని కూడా బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. కారు సర్వీసింగ్‌కు వెళ్లిందని, సర్వీసింగ్ అయి మళ్లీ బయటకు వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటుండగా.. కారు షెడ్డు నుంచి బయటకు వచ్చినా.. అందులో ఎక్కేందుకు ఎవరూ ఉండరని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

చివరికి మిగిలింది అవినీతి ఆరోపణలే!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి 2014లో తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి దశాబ్ద కాలం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ (అప్పుడు టీఆర్ఎస్) ఒక వెలుగు వెలిగింది. ఒక దశలో భవిష్యత్తులో కేంద్రంలోనూ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కేసీఆర్ దేశ ప్రధానమంత్రి కాబోతున్నారనే ప్రచారాన్ని ఊదరగొట్టింది. అంతేకాదు 'దేశ్ కీ నేత' అంటూ కేసీఆర్ పేరును ఇతర రాష్ట్రాల్లోనూ ప్రజల సొమ్ము (ప్రభుత్వ పథకాల ప్రకటనలతో)తో పత్రికా ప్రకటనలు ఇచ్చారు. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైంది. ఫలితంగా రాష్ట్రంలో గులాబీ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. దరిమిలా బీఆర్ఎస్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా పదవుల్లో ఉన్నవారే మొదటగా ఆ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా.. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయ పునరేకీకరణ పేరుతో పార్టీ ఫిరాయింపులను కేసీఆరే ప్రోత్సహించడంతో.. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 'నీవు నేర్పిన విద్యయే కదా' అంటూ నేతలను పార్టీలోకి చేర్చుకుంటోంది. ఫిరాయింపులను నిలువరించలేక, నేతలకు ధైర్యాన్ని చెప్పలేక బీఆర్ఎస్ కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు చివరికి ఢిల్లీ లిక్కర్ స్కామ్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సహా పలు అవినీతి ఆరోపణలే పార్టీకి మిగిలాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ జనజాతర సభ 6న!

హాజరుకానున్న ఖర్గే, రాహుల్.. తుక్కుగూడలో భారీ ఎత్తున నిర్వహణ

టీపీసీసీ పీఏసీ సమావేశంలో నిర్ణయం



టీపీసీసీ పీఏసీ భేటీలో సీఎం రేవంత్, భట్టి, దీపాదాస్ మున్షీ తదితరులు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జనజాతర పేరుతో తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు తేదీ ఖరారైంది. ఏప్రిల్ 6వ తేదీన సభ జరపాలని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్‌లో సమావేశమైన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) నిర్ణయించింది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కానున్నారు. ఇదే తుక్కుగూడలో గత ఏడాది సెప్టెంబర్ 17న నిర్వహించిన సభను మరిపించేలా సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుచుకునేందుకు అమలు చేయాల్సిన కార్యాచరణపైనా పీఏసీ చర్చించింది. ఈ సమావేశంలో రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, శ్రీధర్‌బాబు, ఎంపీ రేణుకాచౌదరి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ తదితరులు పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వ ప్రగతిపైన 18 పేజీల నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో సమర్పించారు. సమావేశం ప్రారంభంలోనే చర్చ అజెండాకు పరిమితం కావాలని ఆయన సభ్యులకు సూచించారు. అలాగే పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియాలో ఎవరూ అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టమైన హెచ్చరిక చేసినట్లు తెలిసింది. కాగా.. సమావేశాన్ని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను ఏఐసీసీ మేనిఫెస్టోలో చేర్చే అంశంపై శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మేనిఫెస్టో కమిటీకి సూచనలు చేయాలన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని, ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పదవులు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. అన్ని అనుబంధ సంఘాల చైర్మన్‌లకు పదవులు ఇచ్చామన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని.. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీలను నియమించి ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. దేశంలో తెలంగాణ మోడల్ పాలన బాగుందనిపార్టీ జాతీయ నాయకత్వం మెచ్చుకుందని, ఇది మనకు గర్వకారణమని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లు గెలిపించాలన్నారు. ప్రజల్లో మంచి స్పందన ఉందని, మంచి ఫలితాలు వస్తాయని రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, సలహాదారులు, నామినేటెడ్ పోస్టులలో పదవులు పొందిన వారిని అభినందిస్తూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అలాగే వంద రోజుల పాలన పట్ల ప్రజల్లో మంచి స్పందన ఉందని పేర్కొంటూ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులను అభినందిస్తూ మరో తీర్మానాన్ని సమావేశంలో ఆమోదించారు.

రైతుబంధుపై తప్పుడు ప్రచారం: భట్టి

రాష్ట్రంలోని 92 శాతం మంది రైతులకు రైతుబంధు డబ్బులు ఇచ్చామని, అయినా రైతుబంధు ఇవ్వట్లేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పిలుపునిచ్చారు. పీఏసీ సమావేశం తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. తుక్కుగూడ సభలో ఏఐసీసీ మేనిఫెస్టోను ప్రజలకు అందించబోతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఢిల్లీలోని ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరాలని, దీనికి తుక్కుగూడ సభ నాంది కావాలన్నారు.భాషకు సంబంధించి కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. దేశ భద్రత కోసం వాడాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను వ్యక్తిగత, రాజకీయ అవసరాల కోసం ఉపయోగించి తప్పు చేయడమే కాకుండా వెంట్రుక కూడా పీకలేరంటూ మాట్లాడతారా అని నిలదీశారు.

సెల్ఫీ వీడియోతో దొరికిన ఫోన్ దొంగ!

ఒక మరణం మిస్టరీని ఛేదించిన పుణె పోలీసులు

ముంబై, మార్చి 29: మహారాష్ట్రలోని పుణెలో బ్యాంకు ఉద్యోగి మరణం మిస్టరీ ఒక సెల్ఫీ వీడియోతో వీడింది. ఇటీవల సొంతవూరు కల్యాణ్‌లో హోళీ పండగ చేసుకున్న బ్యాంకు ఉద్యోగి ప్రభాస్ భాంగే పుణెకు రైల్లో తిరిగి వస్తూ పట్టాలపై పడి మరణించాడు. అతని మరణానికి కారణాన్ని పోలీసులు కనుక్కోలేక పోయారు. అయితే, ఇటీవల అదేరూట్లో రైల్లో ప్రయాణిస్తున్న జాహిద్ జైదీ అనే ప్రయాణికుడు సెల్ఫీ వీడియో తీసుకుంటున్న సమయంలో ఆకాశ్ జాదవ్ అనే దొంగ ఫోన్ లాక్కోబోయాడు. జాహిద్ మెరుపు వేగంతో తప్పించుకున్నాడు. ఈ క్రమంలో ఆకాశ్ జాదవ్ మొహం వీడియోలో వచ్చింది. ఇలా సెల్ఫీ వీడియో తీస్తుంటే దొంగ లాక్కోబోయాడంటూ జాహిద్ జైదీ సోషల్ మీడియాలో పెట్టాడు. దొంగను పట్టుకోవడంలో సహకరించాలని సోషల్ మీడియా మిత్రులను కోరాడు. ఆ వీడియోను కల్యాణ్ రైల్వే పోలీసులు చూశారు. సెల్‌ఫోన్ దొంగతనాల పనిలో ఉన్న ఆకాశ్ జాదవ్‌ను వల వేసి పట్టుకున్నారు. అతని దగ్గరున్న ఫోన్లను తనిఖీ చేసినపుడు కొద్ది రోజుల క్రితం పట్టాలపై పడి మరణించిన ప్రభాస్ భాంగే ఫోన్ దొరికింది. ఇది ఎక్కడ, ఎలా కొట్టేశావని అడిగినపుడు ఆకాశ్ జాదవ్ అసలు విషయం చెప్పాడు. తాను ప్రభాస్ భాంగే ఫోన్‌ను దొంగిలించినపుడు వెంట పడ్డాడని, తనతో పాటు కదులుతున్న రైల్లోంచి దూకబోయి కింద పడి మరణించాడని చెప్పాడు. ఆ విధంగా బ్యాంకు ఉద్యోగి ప్రభాస్ భాంగే మరణం మిస్టరీ వీడింది.

2 ఎంపీ స్థానాలను మాదిగలకే కేటాయించాలి

» సోనియాగాంధీకి జేఏసీ నేతల విజ్ఞప్తి

» రెండో రోజూ ఏఐసీసీ వద్ద నిరసన



న్యూఢిల్లీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానాలలో రెండింటిని మాదిగలకు కేటాయించాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి ఆ పార్టీ మాదిగ సామాజికవర్గ నేతలు విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి, వరంగల్ సీట్లను మాదిగలకు కేటాయించాలని శుక్రవారం మాదిగ దండోరా, మాదిగ శక్తి జేఏసీ సంఘాల నేతలు సోనియాకు లేఖ రాశారు. లోక్‌సభ సీట్ల కేటాయింపులో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో 4 లక్షలు, వరంగల్ నియోజకవర్గ పరిధిలో 4.5 లక్షల మంది మాదిగలున్నారని పేర్కొన్నారు. అనేక అంశాల్లో రిజర్వేషన్ల వల్ల మాలలు మాత్రమే లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. అంతకుముందు అక్బర్ రోడ్‌లోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు సీట్లు కేటాయించాలన్నారు. పెద్దపల్లి అభ్యర్థిని మార్చి గజ్జెల కాంతానికి ఆ సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, బిజేంద్రసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దృష్టికి తీసుకెళతామని వారు చెప్పినట్లు మాదిగ నేతలు తెలిపారు.

కేసీఆర్‌కు ఇదే తగిన శాస్తి!: నిరంజన్

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలకు మాజీ సీఎం కేసీఆరే కారణమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఆరోపించారు. కేసీఆర్‌కు ఇదే తగిన శాస్తి అని ప్రజలు భావిస్తున్నారన్నారు. గతంలో అధికారంలోకి రాగానే ఫిరాయింపులకు తెరలేపి రాజకీయాలను ఆయనే భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఇప్పుడు ఎంతగా తల బాదుకున్నా ప్రజలు పట్టించుకోరని, సానుభూతి తెలిపే పరిస్థితి కూడా లేదని వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన పదవి శాశ్వతమనుకొని కేసీఆర్ చేసిన అరాచకాలు ఇప్పుడు ఒకటొకటి బయటకు వస్తున్నాయని.. ఇక శిక్ష అనుభవించక తప్పదన్నారు. తాజాగా బీఆర్ఎస్ సమావేశాల్లో కేటీఆర్, హరీశ్‌రావు.. కేసీఆర్ తెలంగాణ తెచ్చారని ఇంకా పాత బాకానే ఊదుతున్నారని ఎద్దేవా చేశారు. 'ప్రజలకు న్యాయం చేయాలని లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను.. ఎన్నో ఏళ్ల తర్వాత కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశాన్ని కల్పించింది. మీ బిడ్డగా నన్ను ఆశీర్వదించండి' భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. భువనగిరి ఎంపీగా తనకు విజయం చేకూర్చడానికి సహకరించాలని కోరారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలు ప్రచారంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని వంద రోజుల పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారని.. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని చామల ధీమా వ్యక్తం చేశారు.

విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేస్తా: కేఏ పాల్

» వరంగల్ నుంచి బాబూమోహన్

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు బాబూమోహన్ వరంగల్ లోక్‌సభ స్థానానికి ప్రజాశాంతి పార్టీ తరఫున పోటీ చేస్తారని, ఆ పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ప్రకటించారు. విశాఖపట్నంలో శుక్రవారం సాయంత్రం ఆశీల్‌మెట్ట కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేఏ పాల్ మాట్లాడుతూ బాబూమోహన్ బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారని కొందరు ప్రచారం చేస్తున్నారని, ఆ వదంతులను నమ్మవద్దని కోరారు. తాను విశాఖపట్నం ఎంపీగా పోటీ చేస్తున్నానని, ఎన్నికల ప్రచారం కూడా ప్రారంభించానన్నారు. బాబూమోహన్ మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్‌తో తాను మాట్లాడి ఐదేళ్లు అయిందని, ఎన్నికల వేళ పార్టీలు మారాల్సిన అవసరం తనకు లేదని స్పష్టంచేశారు. విశాఖలో కేఏ పాల్ విజయం కోసం ప్రచారం చేస్తానన్నారు.

భార్యాభర్తల మాటలు వింటారా?

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని పెద్దలు చెప్పినట్లు విన్న అధికారులు ఈరోజు ఊచలు లెక్కబెడుతున్నారని అన్నారు. "వాళ్లు దుర్మార్గులు, దొంగలు, దోపిడీదారులు.. వాళ్లు చెప్పినట్లు వింటే మీరు జైలుకు పోతారని మేము ఆనాడే చెప్పినం. మిమ్మల్ని తిరిగి కూడా చూడరనీ చెప్పినం. ఇవాళ కేసుల్లో ఇరుక్కున్నవారిని వాళ్లు అయ్యో పాపమని కూడా అనట్లేరు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అంతకుముందు రాష్ట్రంలో ఎవరైనా ఫోన్లో మాట్లాడుకోవాలంటే భయపడేవారని, ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితిని తీసుకువచ్చామని తెలిపారు.

వాల్మీకి బోయలపై కాంగ్రెస్‌కు అభిమానం

వాల్మీకి బోయల పట్ల కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకమైన అభిమానం ఉందని సీఎం రేవంత్ అన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వారి డిమాండ్లపై పూర్తిస్థాయిలో ప్రభుత్వపరంగా నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఉద్యోగాలు, ఉపాధిలో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. వంద రోజుల్లో రాష్ట్రంలో మంచి పాలనను అందించి జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని రేవంత్ పేర్కొన్నారు. తాను ఢిల్లీకి వెళ్లినప్పుడు కలుస్తున్న ఇతర రాష్ట్రాల వాళ్లు.. చక్కటి పాలన అందిస్తున్నారంటూ కితాబునిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా సచివాలయానికి వచ్చి సీఎంను, మంత్రులను కలిసి చెప్పుకొనే అవకాశం కల్పించామని, ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా పాలన తెచ్చామని అన్నారు.

నన్ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర

మహబూబ్‌నగర్‌లో తనను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడబలుక్కుని కుట్ర చేస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సీఎంను సొంత జిల్లాలో రాజకీయంగా బలహీన పరిస్తే.. దానిని చూపించి రాష్ట్రమంతా తిట్టుకుంటూ తిరగొచ్చునని కుమ్మక్కయ్యాయన్నారు. "మహబూబ్‌నగర్‌కు లేక లేక సీఎంగా ఒక అవకాశం వస్తే.. ఎలాగైనా దొంగ దెబ్బ తీయాలని దొంగలంతా ఒక్కటై గూడుపుఠానీ చేస్తున్నరు. గద్వాల సీటు కూడా కాంగ్రెస్ పార్టీ కళ్లు మూసుకుని గెలిచే సీటు. కానీ, ఓటింగ్‌కు ముందురోజు దొరసాని (డీకే అరుణ) వచ్చి అవతల పార్టీలో ఉన్న ఆమె అల్లుడికి ఓట్లు వేయించారు. ఇప్పుడు కూడా అలాంటి గూడు పుఠానీయే జరుగుతోంది" అని సీఎం ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో తనను దెబ్బతీస్తే రాష్ట్రమంతటా ప్రభుత్వాన్ని బలహీనం చేసినట్లవుతుందనే ఈ కుట్ర జరుగుతోందని, ఈ విషయాన్ని ఆ పార్టీలో తనపై అభిమానం ఉన్న కొందరు తనతో చెప్పారని తెలిపారు. కాంగ్రెస్‌ను కాదని మరో పార్టీకి ఓటు వేస్తే మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చే ప్రయోజనం ఏమైనా ఉందా? అని రేవంత్ ప్రశ్నించారు. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ, ఐదేళ్లుగా బీజేపీలో ఉన్న డీకే అరుణ జిల్లాకు ఏమైనా చేశారా? అని నిలదీశారు. డీకే అరుణ కర్ణాటకను ఒప్పించి ఆర్డీఎస్ ద్వారా నీళ్లు ఏమైనా తెప్పించారా? తుమ్మిళ్ల ప్రాజెక్టు కోసం ఏమైనా కొట్లాడారా? పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెప్పించారా? అని ప్రశ్నించారు. బీజేపీ వాళ్లు సంక్రాంతికి వచ్చిపోయే గంగిరెద్దు లాంటి వాళ్లన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు ఎన్నికలు అయిపోగానే ప్రభుత్వంలో మంచి పదవి ఇప్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాపాల వల్లే కరువు!

(మొదటిపేజీ తరువాయి)

చేశారని ఆరోపించారు. జిల్లాలు, గ్రామాల్లో నీరు లేక పంటలు ఎండిపోతుంటే చూడలేక తన కళ్లు చెమ్మగిల్లుతున్నాయని తెలిపారు. 2004 నుంచి 2014వరకు రాష్ట్రంలో వర్షాలు బాగా కురిశాయని, ఒకానొక సమయంలో కాంగ్రెస్ అంటేనే వర్షం, వర్షం అంటే కాంగ్రెస్ అనే ప్రచారం జరిగిందని, వైఎస్సార్ కూడా ఇదే మాట అనేవారని గుర్తు చేశారు. ఈ శుక్రవారం మంత్రుల నివాస సముదాయంలోని తన నివాసంలో కోమటిరెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఏ శాఖలో చూసినా స్కామ్‌లే ఉన్నాయని, అన్నింటిలోనూ 'రావులే' ఉన్నారని అన్నారు. ఫోన్‌ట్యాపింగ్ చేశామని కేటీఆరే తన వ్యాఖ్యల ద్వారా ఒప్పుకొన్నారని, ఆయనపై కేసు నమోదు చేయాలన్నారు. ట్యాపింగ్ రుజువైతే పదేళ్ల వరకు జైలుశిక్ష పడుతుందన్నారు. సినిమా ఇండస్ట్రీలోనూ ట్యాపింగ్ చేశారని, అయితే సినీ పరిశ్రమ నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని తెలిపారు. కాగా, సచివాలయంలో ఐటీ పేరుతో కేటీఆర్ బావమరిదికి ఇచ్చిన కాంట్రాక్టు, నిర్వహించిన పనితో పాటు ఇంటింటికీ ఇంటర్‌నెట్ పేరుతో రూ.5వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ రెండింటిపై విచారణ చేయిస్తామన్నారు. ప్రతిమ శ్రీనివాస్‌కు రూ.20వేల కోట్ల కాంట్రాక్టు అప్పగించేందుకే కాళేశ్వరం మూడో టీఎంసీ పనులు చేపట్టారని అన్నారు. ప్రగతిభవన్‌లో ఒక్కో పెయింటింగ్ ఖర్చు రూ.లక్షలు, కోట్లలో ఉందని, నిజాం నవాబు కూడా అనుభవించనంత లగ్జరీని కేసీఆర్ అనుభవించారని విమర్శించారు. చివరికి దళితబంధు, సీఎంఆర్ఎఫ్‌లోనూ కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

గేట్లు పగలగొట్టుకుని వస్తున్నారు..

బీఆర్ఎస్ పని అయిపోయిందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. అందుకే ఆ పార్టీ తరఫున టికెట్ ఇచ్చినా వద్దంటూ అభ్యర్థులు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని తెలిపారు. "మేము గేట్లు ఎత్తేవరకు కూడా ఆగకుండా.. గేట్లు పగులగొట్టుకుని మరీ మా పార్టీలోకి వస్తున్నారు" అని వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



తమతో 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామన్న బీజేపీ వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ, "మా ప్రభుత్వాన్ని పడగొట్టడం తరువాత సంగతి. మొదట బీజేపీలో ఉన్న 8 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు రాకుండా ఆపుకొంటే చాలు" అని అన్నారు. రాష్ట్రంలో తాము 12 స్థానాలు గెలుస్తామనుకుంటే.. కిషన్‌రెడ్డి వల్ల అది 14కు చేరిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తమకు పోటీ బీజేపీతోనేనని పేర్కొన్నారు. భువనగిరి, నల్లగొండ స్థానాల్లో గెలుపు ఖాయమైందని, మెజారిటీపైనే ఆలోచిస్తున్నామని తెలిపారు. ఇక దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. ఇప్పుడు కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేస్తే లీగల్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఎంఐఎంకు పొత్తు బీజేపీతోనే తప్ప.. కాంగ్రెస్‌తో కాదన్నారు. హైదరాబాద్ నుంచి అభ్యర్థిగా టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా పేరును పరిశీలిస్తున్నామన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ప్రియాంకగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేసే అవకాశం లేదని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల తరువాత హరీశ్‌రావు బీజేపీలోకి వెళతారని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరనున్న కె.కేశవరావు, కడియం శ్రీహరి ఇద్దరూ ఘటికులని కోమటిరెడ్డి అన్నారు.

గణపతిరెడ్డినీ సాగనంపుతాం..

రిటైరయ్యాక కూడా.. అదే పోస్టులో కొనసాగుతున్న అధికారులను సాగనంపుతున్నామని వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆర్‌అండ్‌బీలో గణపతిరెడ్డిని పంపలేదు కదా? అని విలేకరులు ప్రశ్నించగా.. ప్రస్తుతానికి ఒక ఈఎన్‌సీని పంపించామని, తరువాత గణపతిరెడ్డిని కూడా పంపిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే 'నా స్పీడ్ తట్టుకోలేరని గణపతిరెడ్డికి ఇప్పటికే సూచనలిస్తున్నాను. కానీ ఆయన పంపించే వరకు ఉండేటట్టున్నాడు' అని మంత్రి వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అయినా.. గణపతిరెడ్డే మంత్రిగా వ్యవహరించారని ఆరోపించారు. గత పదేళ్లలో తాము మంత్రులమని అనుకోలేదని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. త్వరలో సినిమా థియేటర్లపై రైడ్స్ జరుగుతాయని, ఇష్టారీతిన టికెట్ల ధరలు పెంచితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే తమ అధికార బృందాలు సినిమా హాళ్లపై నిఘా ఉంచాయని తెలిపారు.

పీసీసీ చీఫ్ పదవి రానందుకు కొంచెం బాధపడ్డాను..

కాంగ్రెస్ అధిష్ఠానం తనకు పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వకపోవడంతో కొంత బాధపడ్డానని కోమటిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అందరం కలిసికట్టుగా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఇటీవల కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య సఖ్యత లేదంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. భువనగిరి ఎంపీ టికెట్‌ను తమ కుటుంబానికి ఇవ్వాలని తాము కోరలేదని, తన అన్న కొడుకు దరఖాస్తు చేస్తామన్నా వద్దని చెప్పామని తెలిపారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటారా? అని ఓ విలేకరి ప్రశ్నించగా, "జగదీశ్‌రెడ్డి క్యారెక్టర్ లేని వ్యక్తి. ఆయన వస్తానన్నా మేం తీసుకోం"అని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టూరిస్ట్ స్పాట్‌గా మార్చాలని యోచిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య భారీ యూనివర్సల్ స్టూడియోలను నిర్మించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకం

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతోనే పోటీ

» రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 13-14 సీట్లు

» మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్ ప్రశ్నార్థకమేనని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ అని తెలిపారు. రాష్ట్రంలో 13-14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సూర్యాపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సభ్యత్వాల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని దేశంలోనే అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఉత్తమ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ నాయకుల గురించి మాట్లాడితే సమయం వృథా అని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీతోనే పోటీ అని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, బీజేపీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై మాట్లాడే ప్రధాని మోదీ, ఆ ప్రాజెక్టుకు కేంద్ర సంస్థల ద్వారా రుణాలు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. శనివారం నుంచి నల్లగొండ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్ర ముగిసింది.. సొంతపార్టీకి వెళ్తున్నా

» ఉద్యమ సమయంలో పార్టీ మారా

» బీఆర్ఎసే కాదు.. కాంగ్రెస్సూ కష్టకాలంలోనే..

» ఓ సీనియర్ నేతగా ఆ పార్టీలో చేరుతున్నా

» తుది శ్వాస వరకూ నేను కాంగ్రెస్‌పార్టీలోనే

» కేసీఆర్ నాకు రాజ్యసభ సభ్యత్వమే ఇచ్చారు

» అవసరమైతే దానికి రాజీనామా: కె.కేశవరావు

» మా నాన్న బీఆర్ఎస్‌ను వీడటం సరికాదు

» పదవికి రాజీనామా చేసిన తర్వాతే విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరాలి.. కేకే తనయుడు విప్లవ్



సీఎం రేవంత్‌ను కలిసిన కేకే. చిత్రంలో దీపాదాస్ మున్షీ

హైదరాబాద్/సిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ ఉద్యమ సమయంలో కొన్ని కారణాల వల్ల బీఆర్ఎస్‌లోకి వెళ్లాను.. ఇప్పుడు నా తీర్థయాత్ర ముగిసిందని అనుకుంటున్నా. అందుకే, ఇప్పుడు సొంతపార్టీలోకి వెళ్తున్నా" అని సీనియర్ నాయకుడు కె.కేశవరావు పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ కష్టకాలంలో ఉంటే.. దేశంలో కాంగ్రెస్ కష్టకాలంలో ఉందని.. అందుకే ఓ సీనియర్‌గా తనను పెంచి పోషించిన పార్టీలోకి వెళ్తున్నాని తెలిపారు. రాజకీయ చరమాంకంలో ఉన్న తాను బీఆర్ఎస్‌లో ఉండి కూడా చేసేదేమీ లేదని.. అందుకే, 55 ఏళ్లు పనిచేసిన కాంగ్రెస్‌లోకి వెళ్తున్నానని పేర్కొన్నారు. తనకు కేసీఆర్ రాజ్యసభ సభ్యత్వం మాత్రమే ఇచ్చారని, అవసరమైతే దానికీ రాజీనామా చేస్తానన్నారు. బీఆర్ఎస్‌ను ఓ కుటుంబమే నడిపిస్తుందనే భావన ప్రజల్లో బలంగా ఉందన్న ఆయన.. 'వాళ్లేం చేసినా సరే.. పార్టీ కేడర్‌ను దూరం చేసుకోకూడదు' అని సూచించారు. ఎన్నికల సమయంలో ప్రసంగాలు సౌమ్యంగా చేసుకుంటే బాగుండేదని, బీఆర్ఎస్ సరిచేసుకోవాల్సిన కొన్నింటిని సరిచేసుకోలేదని.. అందుకే, ఆపార్టీకి నష్టం కలిగిందని కేకే పేర్కొన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న తర్వాత గురువారం కేసీఆర్‌ను కలిశానని. పార్టీని విడిచి వెళ్లొద్దని ఆయన సూచించినా.. తన నిర్ణయాన్ని స్పష్టంగా తెలియపర్చానని, తుదిశ్వాసవరకు కాంగ్రెస్‌లోనే ఉంటానన్నారు.

టీఆర్ఎస్ కంటే ముందే..

తెలంగాణ గురించి టీఆర్ఎస్ పార్టీ కంటే ముందే కాంగ్రెస్ ఆలోచించిందని.. బాగారెడ్డి ఛైర్మన్‌గా కాంగ్రెస్ ఫోరం ఫర్ తెలంగాణ (సీఎఫ్‌టీ) ఏర్పాటు జరిగిందని కేకే గుర్తుచేశారు. 1998 నుంచి దీనిపై ఆరు వర్కింగ్ కమిటీలు ఏర్పాటు కాగా, అందులోని వార్ గ్రూప్‌లో తాను సభ్యునిగా పనిచేశానని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో రాజీనామా చేస్తామని 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సోనియాకు లేఖ రాశారని.. తనతో సహా కాంగ్రెస్ ఎంపీలందరం తెలంగాణ కోసం అధిష్ఠానంతో కొట్లాడామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీలు చేసిన పోరాటంతోనే పార్లమెంటులో తెలంగాణ బిల్లు పాసయిందని, ఆ సమయంలో తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని తెలిపారు. ఇటీవలి రాజకీయపరిణామాలను కూడా ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్‌తో ఏర్పడిన ఇండియా కూటమిలోకి వెళ్లాల్సిందిగా కేసీఆర్‌కు చెప్పానని.. కానీ, ఆయన తన మాట వినలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఇస్తే బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని తన ముందే.. కేసీఆర్ సోనియాకు చెప్పారని.. కానీ విలీనం చేయలేదని ఆక్షేపించారు. తన కుమార్తె విజయలక్ష్మి శనివారం కాంగ్రెస్‌లో చేరతారని.. తాను మాత్రం ఢిల్లీ నాయకులతో చర్చించాక ఎప్పుడు చేరేదీ చెప్తానని కేశవరావు వెల్లడించారు. కాగా.. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన అనంతరం కేకే శుక్రవారం సీఎం రేవంత్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఆ సమయంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ కూడా వారితో ఉన్నారు.

ఈవయసులో పార్టీ వీడుతారా?

బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు.. సీనియర్ నేత కేకే పార్టీని వీడడం సరికాదని ఆయన కుమారుడు, ఆ పార్టీ నేత విప్లవ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తన తండ్రి పార్టీ మారడం బాధగా ఉందన్న ఆయన.. ఇప్పటికైనా కేకే ఆలోచించాలని, కాంగ్రెస్‌లో చేరాలన్న నిర్ణయాన్ని మార్చుకోవాలని సూచించారు. అలాగే.. అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నట్లు తన సోదరి విజయలక్ష్మి ప్రకటించడం బూటకమని, బీఆర్ఎస్‌ద్వారా వచ్చిన మేయర్ పదవికి రాజీనామా చేశాకే ఆమె కాంగ్రెస్‌లో చేరాలని డిమాండ్ చేశారు. తాను మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉంటానని, కష్టకాలంలో పార్టీకి అండగా ఉండటం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. పొన్నాల లక్ష్మయ్య పార్టీని వదిలేటపుడు.. "ముసలితనం వచ్చాక పార్టీ మార్పేంటి?"ని రేవంత్‌రెడ్డి అన్నారని, మరిప్పుడు అంతకంటే ఎక్కువ వయసున్న కేకేను కాంగ్రెస్‌లోకి ఎందుకు పిలుస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఏవో పదవులకోసం కేకే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్టుగా తాను భావించట్లేదని.. రేవంత్‌రెడ్డి తమ కుటుంబాన్ని విభజించాలనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు.. జీహెచ్‌ఎంసీ మేయర్, కేకే కుమార్తె విజయలక్ష్మి నేడు కాంగ్రెస్‌లో చేరనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ... ఆమె క్యాంపు కార్యాలయానికి వచ్చి పార్టీ కండువా కప్పుతారని సమాచారం. కాంగ్రెస్‌కు ప్రస్తుతం కార్పొరేటర్ల బలం లేకున్నా.. బల్దియా చట్టంలోని వెసులుబాటుతో మేయర్ పీఠం హస్తగతం కానుంది. మేయర్ వెంట బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు చేరుతారని ప్రచారం జరుగుతోంది. అయితే.. ఏ డివిజన్ల కార్పొరేటర్లు అనే అంశంపై మాత్రం స్పష్టత లేదు.

సీఎం రేవంత్‌ను కలిసిన మదన్‌రెడ్డి

» కాంగ్రెస్‌లో చేరిన మార్క్‌ఫెడ్ ఛైర్మన్

హైదరాబాద్/నర్సాపూర్/తూప్రాన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మదన్ రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని సీఎం ఇంటికి వెళ్లి పార్టీలో చేరిక విషయమై చర్చించారు. మదన్ రెడ్డితో పాటు సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ బీఆర్ఎస్ నేత, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎలక్షన్ రెడ్డి కూడా సీఎంను కలిశారు. వారు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైంది. తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి సీఎం సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. సీఎం నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్.. గంగారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతించారు. గంగారెడ్డిది నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామం. బీసీఆర్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు. 2001లో బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేసిన గంగారెడ్డి కాంగ్రెస్‌లో చేరటం గమనార్హం. గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో నిజామాబాద్ మాజీ మేయర్ ఆకుల సుజాత, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ పార్టీలో చేరారు. రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. నిజామాబాద్ డీసీసీబీ ఛైర్మన్‌గా ఎన్నికైన రమేశ్ రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కడియం చేరికపై ఇందిర అసంతృప్తి

వరంగల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చేతిలో ఓటమిపాలైన టీపీసీసీ కార్యదర్శి శనిగపురం ఇందిర సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. గాంధీభవన్‌లో శుక్రవారం సీఎం రేవంత్‌తోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీని కలిసి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. తన రాజకీయ స్వార్థం కోసం అనేక మంది మాదిగ కుల నేతలను అణిచివేసిన శ్రీహరిని కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దని కోరారు. ఎన్టీఆర్, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన శ్రీహరి.. రానున్న రోజుల్లో బీజేపీతో చేతులు కలిపి కాంగ్రెస్‌కూ వెన్నుపోటు పొడుస్తారని అన్నారు. అయితే, శ్రీహరి చేరికతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తానని ఇందిరకు సీఎం హామీ ఇచ్చారు. అనంతరం తన అనుచరులతో సమావేశమైన ఇందిర.. ఆదివారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

కడియంజీ.. కాంగ్రెస్‌లోకి రండి!

» శ్రీహరి, కావ్యకు దీపాదాస్ ఆహ్వానం

» వరంగల్‌లో తండ్రా... కూతురా?

» నేడు స్థానిక నేతలతో కడియం భేటీ

» అనంతరం సీఎంను కలిసే చాన్స్



కడియం శ్రీహరి నివాసానికి వచ్చిన దీపాదాస్ మున్షీ

హైదరాబాద్/వరంగల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కావ్యలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కడియం శ్రీహరి నివాసానికి వెళ్లిన ఆమె వారిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అధిష్ఠానం నుంచే ఆహ్వానం వచ్చిన నేపథ్యంలో శనివారం తన నివాసంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ నేతలతో కడియం సమావేశం అవుతున్నారు. ఆ సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కడియం, ఆయన కూతురు కావ్యలు కలవనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించే అవకాశం ఉన్నందున.. ఆమె మాత్రం శనివారమే పార్టీలో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. బీఆర్ఎస్ తరఫున వరంగల్ నుంచి పోటీకి కడియం కావ్య విముఖత చూపిన నేపథ్యంలో కడియం శ్రీహరితో సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్ చేసి చర్చలు జరిపారు. అనంతరం శ్రీహరిని, ఆయన కూతురు కావ్యను పార్టీలోకి ఆహ్వానించేందుకు దీపాదాస్ మున్షీతో పాటుగా వెళ్లాలంటూ పార్టీ నేతలు మల్లు రవి, సంపత్ కుమార్‌కు సూచించారు. అనంతరం దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులు రోహిత్ చౌదరి, విష్ణునాథ్, మల్లు రవి, సంపత్ కుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి కడియం నివాసానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అధిష్ఠానం సూచన మేరకే ఆహ్వానించేందుకు వచ్చానంటూ దీపా మున్షీదాస్ తెలుపగా.. కార్యకర్తలతో చర్చించి ఒకటి రెండు రోజుల్లో నిర్ణయాన్ని వెల్లడిస్తానంటూ కడియం శ్రీహరి వెల్లడించారు. కాగా, కడియం శ్రీహరినే వరంగల్ ఎంపీగా బరిలో దించితేనే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో శ్రీహరిని బరిలో దించి, స్టేషన్‌ఘనపూర్ అసెంబ్లీ స్థానానికి వచ్చే ఉప ఎన్నికల్లో కడియం కావ్యకు టికెట్ ఇవ్వాలనే ప్రతిపాదన కాంగ్రెస్ నుంచి వచ్చినట్లు సమాచారం. శ్రీహరి మాత్రం తన కుమార్తెకు ఎంపీ టికెట్ ఇస్తేనే బాగుంటుందని అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

సిగ్గుంటే రాజీనామా చెయ్: బీఆర్ఎస్

కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నాడు ఎన్టీఆర్‌కు, నేడు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చరిత్ర కడియం శ్రీహరిది అన్నారు. సిగ్గు శరం ఉంటే కడియం శ్రీహరి తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది దళిత నేతలను పార్టీ నుంచి బయటకు వెళ్లేలా కడియం శ్రీహరి వ్యవహరించారని దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. విలువల గురించి మాట్లాడే కడియం శ్రీహరి తన కుమార్తె కోసం విలువలను తాకట్టు పెట్టారని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతలు శ్రీహరి విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఆయన ఎక్కడ ఉన్న ఆ పార్టీని ముంచటం ఖాయమని వ్యాఖ్యానించారు. హనుమకొండలో బీఆర్ఎస్ కార్యకర్తలు శ్రీహరి దిష్టిబొమ్మను తగలపెట్టారు.

పాంచ్ న్యాయ్‌లను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

» ప్రచార కమిటీ సమావేశంలో దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పాంచ్ న్యాయ్‌లని తెలుగులోకి అనువదించి క్షేత్రస్థాయి వరకూ ప్రచారంలోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సూచించారు. ఎన్నికలకు ఇంకా కొద్ది రోజులే ఉన్నందున.. ప్రతి నేత, కార్యకర్తా క్రియాశీలంగా ఉండాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ అమలుపై చర్చించేందుకు టీపీసీసీ ప్రచార కమిటీ.. ఆ కమిటీ ఛైర్మన్ మదుయాష్కీ గౌడ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో శుక్రవారం నాడు భేటీ అయింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ, ప్రచార అంశాలు ప్రతి రోజూ సోషల్ మీడియాలో చర్చకు వచ్చేలా కార్యాచరణ ఉండాలన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను అక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధుయాష్కీ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే వంద రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలూ ప్రజలకు వివరించాలన్నారు.



భక్తులతో కిక్కిరిసిన మెదక్ చర్చి

» గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

మెదక్ కల్చరల్, మార్చి 29: ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చికి శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా భక్తులు పోటెత్తారు. చర్చితో పాటు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. మత పెద్దలు వేకువజామున శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి పరిసరాలు ఏసు నామస్మరణతో మార్మోగాయి. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశాన్ని వినిపించారు. జనుల పాపములను పోగొట్టేందుకు ఏసు ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్‌ఫ్రైడే అని చెప్పారు. చెడుపై మంచి, పాపముపై నీతి సాధించిన విజయానికి సూచికగా గుడ్‌ఫ్రైడేను జరుపుకుంటామని వెల్లడించారు. ప్రతిఒక్కరూ ప్రేమ, దయ, శాంతి, సహనం, త్యాగం, శత్రువునైనా ప్రేమించే గుణం కలిగి ఉండాలన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ బీవీ నాగరత్న

పోచంపల్లి ఇక్కత్ చీరలకు ఖండాంతర ఖ్యాతి

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న

భూదాన్‌పోచంపల్లి, మార్చి 29: పోచంపల్లి చేనేత టై అండ్ డై ఇక్కత్ పట్టు చీరలకు ఖండాంతర ఖ్యాతి ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలోని చేనేత కళాపునర్వి యూనిట్‌ను ఆమె సందర్శించారు. చేనేత మగ్గంపై పట్టు చీరల తయారీ ప్రక్రియను పరిశీలించి నిర్వాహకుడు సాయని భరత్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోచంపల్లి గ్రామీణ పర్యాటక కేంద్రంలోని లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్‌లో చేనేత వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కళాకారులు, కార్మికుల కళాత్మక నైపుణ్యాన్ని బీవీ నాగరత్న ప్రశంసించారు.

మహారాష్ట్రలో 'ఇన్‌ఫార్మర్' నెపంతో ఒకరి హత్య

మహదేవపూర్, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల ముందు మావోయిస్టులు అలజడి సృష్టిస్తున్నారు. తాజాగా గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తాలూకాలోని తాడ్‌గావ్‌లో ఓ వ్యక్తిని ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేశారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రజా కోర్టు నిర్వహించారు. దామెరంచ గ్రామానికి చెందిన ఇస్మా అలియాస్ అశోక్ తలాండి అనే వ్యక్తికి మరణశిక్ష విధిస్తున్నట్లు ప్రకటించారు. అతన్ని హింసించి దారుణంగా చంపారు. ఆ తర్వాత శుక్రవారం తెల్లవారుజామున అహెరీ- భామ్రాగడ్ రహదారిపై మృతదేహాన్ని వదిలేయడంతో పాటు పక్కన ఓ లేఖను ఉంచారు. పెరిమెలి దళం పేరుతో ఉన్న ఆ లేఖలో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోలీసులకు సమాచారం చేరవేస్తున్నందుకు అతడికి మరణ శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

ఐరాసలో తెలంగాణ యువకుడి ప్రసంగం



మెట్టు సాయిసంపత్(ఫైల్)

బషీరాబాద్, మార్చి 29: ఐక్యరాజ్యసమితి 55వ మానవహక్కుల మండలి సమావేశంలో భారత్ తరఫున వికారాబాద్ జిల్లాకు చెందిన సాయిసంపత్ పాల్గొన్నారు. స్విట్జర్‌ల్యాండ్‌లోని జెనీవాలో ఈ నెలలో 'ప్రపంచ మానవ హక్కుల' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్నట్లు వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం బద్లాపూర్ గ్రామానికి చెందిన మెట్టు సాయిసంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు వారాల పాటు జరిగిన ఈ మీట్‌లో 'వాతావరణ మార్పు- ఆహారభద్రత' అనే అంశంపై ప్రసంగించినట్లు తెలిపారు. విదేశీ కలుపు మొక్కల నియంత్రణపై ప్రపంచ దేశాలు అనుసరించాల్సిన అంశాలపై సూచనలు, అభిప్రాయాలు వెల్లడించానని చెప్పారు. తాను ఈకోఫాన్ స్వచ్ఛంద సంస్థ తరఫున పర్యావరణ పరిరక్షణ, జంతు రక్షణ వంటి సామాజిక అంశాలపై పని చేస్తున్నట్లు తెలిపారు.

వాలంతరీ డీజీ రమేష్ ఆకస్మిక మృతి



హైదరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్, వాలంతరీ డైరెక్టర్ జనరల్(డీజీ) వీ రమేష్(60) మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి కుమారుడి నిశ్చితార్థ వేడుక అనంతరం రమేష్ ఇంటికొచ్చి నిద్రపోయారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు ఆయనను లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. నిద్రలోనే రమేష్ తుదిశ్వాస విడిచినట్లు గుర్తించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో కుటుంబసభ్యులు రమేష్ అంత్యక్రియలు నిర్వహించారు. రమేష్ అకాల మరణం పట్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా సంతాపం తెలిపారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

పెన్‌పహాడ్, మార్చి 29: వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన చందనను(23) భర్త, బావ, అత్త అదనంగా కట్నం తీసుకురావాలని వేధించారు. దీంతో అత్తింటి పోరు పడలేక ఆమె శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పిండిపోలు చందనకు రైల్వేశాఖలో ఉద్యోగం చేస్తున్న మిర్యాలగూడకు చెందిన ఆనందం వేణుతో 2021లో వివాహం జరిగింది. వీరికి 18 నెలల కుమారుడు ఉన్నాడు. వేణుకు వివాహం సమయంలో 20గుంటల వ్యవసాయ భూమి, మూడు తులాల బంగారం, రూ. లక్షనగదు కట్నంగా ఇచ్చారు. ఆ తర్వాత భర్త వేణు, బావ(వేణు అన్న) వెంకటేశ్వర్లు, అత్త విజయలక్ష్మి అదనంగా కట్నం తీసుకురావాలని చందనను మానసికంగా, శారీరకంగా వేధించారు. దీంతో నాలుగు నెలల క్రితం చందన తల్లిగారి ఇంటికి వచ్చింది. ఆసమయంలో అత్తింటి వారిపై పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో చందన తల్లిదండ్రులు కేసు పెట్టారు. కేసు నమోదైన తర్వాత కూడా వేణు మూడు పర్యాయాలు అన్నారం గ్రామానికి వచ్చి అత్తమామ, భార్యతో గొడవ పెట్టుకున్నాడు. "కేసు పెడతారా.. మీవాళ్లను హతమార్చే వరకూ నిద్రపోను, పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలి. అదనంగా కట్నం ఇస్తేనే తీసుకుపోతా" అంటూ ఈ నెల 13న బెదిరించాడు. క్రమంగా ఈ సమస్య పెద్దదవుతుండడంతో కలత చెందిన చందన గురువారం రాత్రి తల్లిదండ్రులు నిద్రపోయిన తర్వాత చీరతో ఉరేసుకుంది. తండ్రి అయోధ్య శుక్రవారం ఉదయం లేచి చూడగా ఆమె పక్క గదిలో విగత జీవిగా కనిపించింది. తన కుమార్తె భర్త, బావ, అత్త వేధింపులు తట్టుకోలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని అయోధ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిందితులపై టెలిగ్రాఫ్ చట్టం

దేశంలోనే తొలిసారి తెలంగాణలో ప్రయోగం.. ఇప్పటిదాకా ఏ రాష్ట్రమూ వాడని చట్టమిది

» కోర్టు అనుమతి కోరిన నగర పోలీసులు
» ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావు అరెస్టు!
» స్వయంగా లొంగిపోయిన మాజీ డీసీపీ
» ట్యాప్ చేసి ప్రైవేటు వ్యక్తుల ప్రొఫైల్స్ చేశాం
» ప్రభుత్వ వాహనాల్లో ఎన్నికల నగదు
» విచారణలో రాధాకిషన్ అంగీకారం
» 14 రోజులు రిమాండ్‌కు తరలించిన కోర్టు
» పోలీసు కస్టడీకి భుజంగరావు, తిరుపతన్న



వైద్య పరీక్షల కోసం రాధాకిషన్‌ను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులపై టెలిగ్రాఫ్ చట్టం కింద చర్యలు తీసుకోవడానికి ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సైబరాబాద్ కమిషనరేట్ పశ్చిమ జోన్ పోలీసులు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు న్యాయస్థానంలో మెమో కూడా అందజేశారు. న్యాయస్థానం అనుమతిస్తే దేశంలోనే టెలీగ్రాఫ్ యాక్టు అమలు చేసిన మొదటి కేసుగా తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు చరిత్రలో నిలిచిపోతుంది. టెలిగ్రాఫ్ చట్టంలో 25వ నిబంధన శక్తివంతమైనది. అనుమతిలేకుండా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వాళ్లకు మూడేళ్ల వరకు జైలుశిక్ష వేయాలని ఈ చట్ట నిబంధన చెబుతోంది. కొన్ని నిబంధనల ప్రకారం ఏకంగా పదేళ్ల జైలుశిక్ష కూడా వేయొచ్చని చెబుతున్నారు. ట్యాపింగ్‌కు సంబంధించి సరైన ఆధారాలు దొరకడం కష్టం కాబట్టి ఇప్పటి వరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ చట్టాన్ని ప్రయోగించే పరిస్థితి రాలేదు. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు పెద్ద ఎత్తున బయట పడుతుండటంతో ట్యాపింగ్‌ను నిరూపించడం సాధ్యమేనని నమ్మిన పోలీసులు టెలిగ్రాఫ్ చట్టాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. రిమాండ్‌కు రాధాకిషన్‌రావు ట్యాపింగ్ కేసులో గురువారం రాత్రి అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్‌డీ) రాధాకిషన్ రావును పోలీసులు శుక్రవారం సాయంత్రం వరకు విచారించారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కోర్టులకు సెలవుదినం కావడంతో ఆయన్ను కొంపల్లిలోని నాంపల్లి న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లి హాజరుపరిచారు. న్యాయమూర్తి కన్నయ్యలాల్ ఆయన్ను 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. భారీ భద్రత మధ్య ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మద్దెలచెరువు సూరి హత్య కేసులో జైల్లో ఉన్న భాను కిరణ్, చిగురుపాటి జయరాం హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న రాకేశ్‌రెడ్డి తదితర వ్యక్తులతో రాధాకిషన్‌రావుకు ముప్పు ఉందని సమాచారం ఉండటంతో జైల్లో పటిష్ఠ భద్రత చర్యలు చేపట్టారు. ఆయన ఉండే బ్యారక్ దరిదాపుల్లో సిబ్బంది తప్ప ఎవరూ ఉండకుండా జాగ్రత్త వహించారు. ఆయనను నిత్యం సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించారు. ఇదే కేసులో జైల్లో ఉన్న ప్రణీత్‌రావును రాధాకిషన్‌రావు కలవకుండా జాగ్రత్త వహించారు.

విదేశాలకు పోలేదు

ఫోన్ ట్యాపింగ్ మొత్తం ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు కనుసన్నల్లోనే జరిగిందని దర్యాప్తులో తేలింది. ప్రభాకర్‌రావు అమెరికాకు వెళ్లిపోయారు. రాధాకిషన్‌రావు అందుబాటులో లేకపోవడంతో ఆయనా విదేశాలకు వెళ్లిపోయినట్లు భావించారు. అయితే, గురువారం అనూహ్యంగా పశ్చిమ జోన్ డీసీపీ విజయ్ కుమార్ దగ్గరకు వచ్చి రాధాకిషన్‌రావు లొంగిపోయారు. తాను విదేశాలకు వెళ్లలేదని, కుటుంబంతో కేరళకువెళ్లానని చెప్పారు. రాధాకిషన్‌ను అదుపులోకి తీసుకున్న పంజాగుట్ట పోలీసులు ఆయన్ను ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతున్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన పాత్ర గురించి, ఎంత మంది ఫోన్లు ట్యాప్ చేశారు? ఆ నంబర్లు ఎవరు ఇచ్చేవారు? తీసుకున్న సమాచారంతో ఏం చేసేవారు? ఏఏ అధికారులకు చేరవేసేవారు? ఈ తతంగాన్ని నడిపించిన నాయకుడెవరు? వంటి వివరాలు అడిగారు. ఆయన నేరాన్ని అంగీకరించారని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పోలీసు వాహనాలను ఉపయోగించి అక్రమ సొమ్మును తరలించినట్లు కూడా అంగీకరించారని పోలీసులు తెలిపారు. అధికార విధుల కోసం ఉద్దేశించిన ప్రభుత్వ వనరులను ఉపయోగించి, ప్రయివేటు వ్యక్తుల ప్రొఫైల్స్ తయారు చేశారని, ఈ క్రమంలో ఆ వ్యక్తులపై అనధికారిక నిఘాను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒక పార్టీకి అనుకూలంగా పక్షపాతంగా వ్యవహరించినట్లు కూడా రాధాకిషన్‌రావు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత ఆధారాలు దొరకకుండా చూడటానికి ప్రభుత్వ ఆస్తులైన నిఘా పరికరాలను ధ్వంసం చేశారని వెల్లడించారు. రాధాకిషన్‌రావును కలవడానికి ఆయన కూతురు, ఇతర కుటుంబ సభ్యులు ఉదయం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆయనతో ఒక గంట గడిపేందుకు అవకాశం ఇచ్చారు. రాధాకిషన్‌రావును మరోసారి పోలీస్ కస్టడీకి తీసుకోవడానికి నాంపల్లి న్యాయస్థానంలో పోలీసులు కస్టడీ పిటిషన్ వేయనున్నట్లు తెలిసింది.

ఏఎస్పీలను కస్టడీకి తీసుకున్న పోలీసులు

జైల్లో ఉన్న ఇద్దరు అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను ఐదు రోజులు పోలీస్ కస్టడీకి తీసుకోనేందుకు గురువారం నాంపల్లి కోర్టు అనుమతించింది. చంచల్‌గూడ జైల్లో ఉన్న వారిద్దరిని తీసుకొని వైద్య పరీక్షల తర్వాత బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో భుజంగరావును, మొదటి అంతస్థులో తిరుపతన్నను ఉంచి విచారించారు. ట్యాపింగ్ కుట్రకు ఆజ్యం పోసిందెవరు? సూత్రధారులు, నేతలు ఎవరు? అనే వివరాలను రాబడుతున్నట్లు తెలిసింది. ఆయా నేతలకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరించిన పోలీసులు.. వాటి ఆధారంగా నేతల గుట్టును రట్టు చేయడానికి, పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఐదు రోజుల కస్టడీ ముగిసేలోపు మరి కొంత మంది అధికారులు, రాజకీయ నేతల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు అధికారుల విచారణను 8 గంటలకే ముగించారు. రికార్డు చేశారు.

నేడు ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల అరెస్టు

ప్రభాకర్‌రావు, భుజంగరావు, తిరుపతతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావులకు సహకరించిన మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్‌లను అరెస్టు చేయడానికి వెస్టుజోన్ పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. శనివారం వారిని అదుపులోకి తీసుకొని రాత్రికి అరెస్టు ప్రకటించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారం రోజుల క్రితం ప్రస్తుతం నల్లొండలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్‌ని, రెండు రోజుల క్రితం రాచకొండలో పనిచేస్తున్న మరో ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లును పోలీసులు విచారించి నోటీసులు ఇచ్చి పంపారు. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్‌లను విచారించాలని నిర్ణయించారు. అందులో ఇద్దర్ని శనివారమే అదుపులోకి తీసుకొనే అవకాశం ఉంది. ఇంటలిజెన్స్ ఎస్‌ఐబీలో మొత్తం 15 మంది అధికారులు ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

దృశ్యం చెదిరినా...
సాక్ష్యం మిగిలింది!

» ఎస్ఐబీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కీలకసాక్షి
» గట్టుమల్లును రెండో సాక్షిగా చేర్చే చాన్స్
» కేసులో కీలకంగా మారనున్న సీడీఆర్

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆధారాలతో పాటు సాక్షులపైనా దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. డిసెంబరు 4న రాత్రి ఎస్ఐబీ ప్రధాన కార్యాలయంలోని లాగర్ రూంలో హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేసే సమయంలో ఆ దృశ్యాలేవి సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా అప్పటి డీఎస్పీ ప్రణీత్‌రావు జాగ్రత్తలు తీసుకున్నారు. లాగర్ రూంలోకి వెళ్లడానికి ముందే సీసీ కెమెరాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అందుకు ఎస్ఐబీ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ సహాయం తీసుకున్నాడు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, పత్రాలు కాల్చివేసే దృశ్యాలు నమోదు కాకపోయినా హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కీలక సాక్షిగా మిగిలాడు. తనని సాక్షిగా చేర్చి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వేదికగా జరిగిన బెదిరింపులు, సెటిల్మెంట్లు, డబ్బుల వసూలుపై ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన(ప్రస్తుతం డీఎస్పీ) గట్టు మల్లును దర్యాప్తు అధికారులు గురువారం సుదీర్ఘంగా విచారించారు. రాధాకిషన్ రావు చెప్పినట్లే చేశానని గట్టు మల్లు వాంగ్మూలం ఇచ్చారు. విచారణ అనంతరం అనుమతి లేనిదే ఎక్కడికి వెళ్లరాదని ఆదేశించి పంపారు. వీరిద్దరి సాక్ష్యాలను మేజిస్ట్రేట్ ముందు కూడా నమోదు చేయించనున్నారు.

గుట్టంతా సీడీఆర్‌లో

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయిన వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్కరి నుంచి ఒకటి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నప్పటికీ వారు ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు సెల్‌ఫోన్లు ఉపయోగించినట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ నెంబర్లతోపాటు, వారు ఉపయోగించిన ఇతర నెంబర్ల కాల్ డేటా రికార్డు(సీడీఆర్)లు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసిన రోజు, అంతకు కొద్ది రోజుల ముందు, ఆయా సందర్భాల్లో ఆపరేషన్స్ నిర్వహించిన తేదీల్లో ఎవరెవరు, ఎవరెవరితో మాట్లాడారు? ఎంత సమయం మాట్లాడారనే మొత్తం వివరాలను సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సేకరిస్తున్నారు. ఎవరి ఆదేశాల మేరకు పని చేశారనే దానిపై ఇప్పటికే కొంత సమాచారం సేకరించారు. సీడీఆర్‌లను విశ్లేషించడం ద్వారా నిజానిజాలు సాంకేతికంగా నిర్ధారిస్తారు.

రాష్ట్రంలో తగ్గి.. గ్రేటర్‌లో పెరిగి..!

» ఇదీ విద్యుత్తు వినియోగం తీరు
» 28న గ్రేటర్‌లో అత్యధికంగా 79.48 మిలియన్ యూనిట్లు

హైదరాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా తగ్గిపోతుండగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వినియోగం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. 2023 మే 19న అత్యధికంగా 79.33 మిలియన్ యూనిట్ల వినియోగం జరగ్గా ఈ నెల 28న ఏకంగా 79.48 మిలియన్ యూనిట్లుగా రికార్డయింది. గత ఏడాది మార్చి నెల సగటు వినియోగం 57.48 మిలియన్ యూనిట్లుగా నమోదు కాగా ఈ ఏడాది అదే నెల సరాసరి వినియోగం 70.96 మిలియన్ యూనిట్లుగా ఉంది. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ శుక్రవారం 14283 మెగావాట్లుగా రికార్డయింది. రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్తు వినియోగం గణనీయంగా తగ్గడమే డిమాండ్ పడిపోవడానికి కారణంగా భావిస్తున్నారు. ఇక ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, 200 యూనిట్ల దాకా గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్తు అందిస్తుండటంతో గ్రేటర్‌లో వినియోగం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వేసవిలో గరిష్ఠ డిమాండ్ 16 వేల మెగావాట్ల దాకా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్తు గరిష్ఠ డిమాండ్ 16000 మెగావాట్లకు చేరితే ఖర్చు రూ.100 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది వేసవిలో నాలుగైదు రోజుల పాటు రోజుకు రూ.100 కోట్లతో విద్యుత్తు కొనాల్సి వచ్చింది.

కలిసొచ్చిన 'పవర్ బ్యాంకింగ్'

డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేసుకుని అవసరమైతే తీసుకుంటాం. ఇదే తరహాలో తెలంగాణ విద్యుత్తు సంస్థలు అనుసరిస్తున్న 'పవర్ బ్యాంకింగ్' విధానం సత్ఫలితాలు ఇస్తోంది. ఇది వేసవిలో విద్యుత్తు లభ్యతను పెంచనుంది. అధిక దరకు విద్యుత్తు కొనాల్సిన అవసరం లేకుండా చేస్తోంది. సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వ్యవసాయ విద్యుత్తుకు డిమాండ్ భారీగా పెరిగిపోతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో విద్యుత్తుకు అత్యధిక డిమాండ్ ఏర్పడుతుంది. ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో మిగులు విద్యుత్తు ఉండగా, దక్షిణాది రాష్ట్రాల్లో కొరత ఉంది. పవర్ బ్యాంకింగ్ ద్వారా ఉత్తరప్రదేశ్ నుంచి 1000, మధ్యప్రదేశ్ నుంచి 300, పంజాబ్ నుంచి 200 కలిపి రోజుకు 1500 మెగావాట్ల వరకు గత రెండు నెలలుగా రాష్ట్రానికి సరఫరా అవుతోంది. మన దగ్గర సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో డిమాండ్ తగ్గి, మిగులు విద్యుత్తు ఉంటుంది. ఆ సమయంలో యూపీ, మధ్యప్రదేశ్, పంజాబ్‌కు విద్యుత్తును సరఫరా చేయనుంది. దీంతో ఇరు పక్షాలకు ఉపశమనం లభిస్తుంది. ఈ ఏడాదియూపీ నుంచి విద్యుత్తు సరఫరా ప్రారంభమైంది.


డిమాండ్‌కు తగ్గట్లు సరఫరా

డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్తు సరఫరా చేస్తామని దక్షిణ డిస్కం (ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. పీక్ అవర్స్ ముగిసే దాకా ప్రతీ రోజు ఉదయం 10 గంటల దాకా అధికారులు క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండాలని ఆదేశించారు.

పాఠశాలలపై పర్యవేక్షణ గాలికి!

రెగ్యులర్ ఎంఈవోలు లేక అస్తవ్యస్తం.. ఒక్కొక్కరికి నాలుగైదు మండలాల బాధ్యతలు

» ప్రభుత్వ, జిల్లా పరిషత్ టీచర్ల మధ్య కొలిక్కిరాని పంచాయితీ..
» సర్వీసు రూల్ సమస్యను పట్టించుకోని గత ప్రభుత్వం
» పరిష్కారం చూపాలంటున్న సంఘాలు



పెద్దపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనం వెరసి.. విద్యావ్యవస్థ పరిస్థితి గాలిలో దీపంలా తయారైంది. సాధారణంగా మండలానికి ఒక విద్యాశాఖాధికారి(ఎంఈవో) ఉంటే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వసతుల నుంచి బోధన వరకు ప్రతి అంశాన్నీ పరిశీలించగలుగుతారు. కానీ, రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 600 మండలాలు ఉంటే రెగ్యులర్ ఎంఈవోలు 20 మంది, ఇన్‌చార్జి ఎంఈవోలు 100 మందిలోపే ఉన్నారు. అంటే సగటున ఒక్కో ఎంఈవో ఐదు మండలాల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. యాదాద్రి జిల్లాలోనైతే ఏకంగా పది మండలాలకు ఒక ఇన్‌చార్జి ఎంఈవో ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న పంచాయితీని కొలిక్కి తేవడంలో గత ప్రభుత్వం విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

టీచర్ల మధ్య ఏమిటీ వివాదం?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టులను ఏపీపీఎస్సీ ద్వారా, లోకల్ బాడీ(జిల్లా, మండల పరిషత్) పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేశారు. దీంతో ఈ రెండు విభాగాల ఉపాధ్యాయులకు వేర్వేరు సర్వీస్ రూల్స్ అమలయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగులకే మండల విద్యాధికారులుగా, గెజిటెడ్ హెచ్ఎంలుగా, డైట్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించుకుంటూ వెళ్లగా... జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లకు కేవలం గెజిటెడ్ హెచ్ఎంలుగానే పదోన్నతులు కల్పించారు. ఈ విధానంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉమ్మడి సర్వీసు రూల్ తీసుకురావాలని జడ్పీ, మండల పరిషత్ స్కూళ్లలోని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు 1998 డిసెంబరులో జీవో 40 తీసుకొచ్చారు. ఈ జీవోను సవాల్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సంఘం నాయకులు ట్రిబ్యునల్, హైకోర్టును ఆశ్రయించగా.. ఆ జీవోను కోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత ప్రభుత్వం మళ్లీ 505, 538 జీవోలను విడుదల చేసి, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్ఎంలుగా, ఎంఈవోలుగా పదోన్నతులు కల్పించింది. దీన్ని సవాల్ చేస్తూ కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ట్రిబ్యునల్, కోర్టును ఆశ్రయించగా, ఆ జీవోలను కోర్టు కొట్టి వేసింది. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా అప్పటి సీఎం వైఎస్ఆర్ ఏకంగా అసెంబ్లీలో చట్టం చేసి పదోన్నతులు కల్పించారు. దీనిని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో ప్రభుత్వ ఉపాధ్యాయులు పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ప్రభుత్వ ఉపాధ్యాయులు, లోకల్ బాడీ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ వేర్వేరుగా ఉంటాయని, వాటిని కలపరాదంటూ 2008లో కోర్టు స్పష్టం చేసింది. అప్పటి నుంచి ఏకీకృత సర్వీసు రూల్ అంశం కొలిక్కి రావడం లేదు. మధ్యలో అప్పటి ప్రభుత్వం కొందరు సీనియర్ గెజిటెడ్ హెచ్ఎంలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలను అప్పగించింది. దీనిపై కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడంతో ఇన్‌చార్జిల నియామకాలను అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది. ఇప్పటికీ సంబంధిత కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. తెలంగాణ విడిపోయిన తర్వాత ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఈ సమస్యను పరిష్కరించలేకపోయింది. పదేళ్లలో మండలాల సంఖ్య పెరిగినా.. అందుకు అనుగుణంగా ఎంఈవోలు లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలనే దిక్కయింది. ఉదాహరణకు పెద్దపల్లి జిల్లాలో 13 మండలాలు ఉంటే ఐదుగురు మాత్రమే పని చేస్తున్నారు. వీరందరూ కూడా ఇన్‌చార్జిలే కావడం గమనార్హం. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

శ్రీలక్ష్మి.. నీ మహిమలు!

అడ్డగోలు జీవోలు... అంతేవేగంగా వెనక్కి

» నిబంధనలు తెలిసీ తప్పుడు ఆదేశాలు
» పూర్తికాని పనులకూ బిల్లుల చెల్లింపు
» రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా జీవోలు
» కీలక నిబంధన ఉల్లంఘనతో ఆందోళన
» ఆదేశాలను బయటపెట్టిన 'ఆంధ్రజ్యోతి'
» 3 జీవోలు ఉపసంహరించుకున్న శ్రీలక్ష్మి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మీరు నవ్వుకున్నా సరే! నేను చేసేది చేస్తా! తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలనే అమలు చేస్తా!'... ఇదీ ఆ మహిళా ఐఏఎస్ వ్యవహార శైలి! అర్హులను మూలకు తోసేసి.. అస్మదీయులకు బిల్లులు చెల్లించడమే అంతిమ లక్ష్యం. ఆమె ఎవరో కాదు! ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత సీనియర్ ఐఏఎస్ అధికారి, మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి! రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి కంటే కూడా ఆమెనే సీనియర్. అయినా, జీవోల్లో ఘోర తప్పిదాలు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా.. 'పూర్తి కాబోయే పనులకూ' బిల్లులు మంజూరు చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో శ్రీలక్ష్మి దాదాపు 9 జీవోలిచ్చారు. ఇందులో మూడు ఇప్పుడు వెనక్కి వచ్చేశాయి. దీంతో శ్రీలక్ష్మి పరువు పోయినట్లయింది.



ఎన్నికల్లో ప్రయోజనాలకే...

మునిసిపాలిటీల్లో ఐదేళ్లుగా వందలకోట్ల విలువైన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ... ఎన్నికల నేపథ్యంలో, రాజకీయ ప్రయోజనాల కోసమే 'ఎంపిక' చేసిన కొన్ని మునిసిపాలిటీలకు హఠాత్తుగా నిధులు విడుదల చేశారు. అందులో... టీడీపీ యువనేత నారా లోకేశ్ బరిలో ఉన్న మంగళగిరి కూడా ఒకటి. అందులోనూ... ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా 'పూర్తి కాబోయే పనులకూ' నిధులు విడుదల చేస్తూ శ్రీలక్ష్మి జీవో ఇచ్చేశారు. అలాగే.. డోన్, నర్సీపట్నం మునిసిపాలిటీలకు సంబంధించిన మరో రెండు జీవోలు కూడా ఆరోజే ఇచ్చారు. వీటిలో 'పూర్తి కాబోయే పనులు' అనే ప్రస్తావన లేనప్పటికీ... ఇవీ ఆ బాపతువే. పనులు పూర్తయ్యాక బిల్లులు చెల్లించేందుకే చాలా తతంగం ఉంటుంది. సంబంధిత చీఫ్ ఇంజనీర్ లేదా ఆ పనులు పర్యవేక్షించిన ఇంజనీర్లు ఏ పనులు ఎంత శాతం పూర్తయ్యాయి, ఎంత ఖర్చయింది తదితర వివరాలు పేర్కొంటూ సంతకం చేసి సర్టిఫై చేయాలి. ఈ సర్టిఫైడ్ పత్రం లేకుండా తమ సెక్రటరీలకు/ఆర్థిక శాఖకు చెల్లింపులకోసం ఫైలు కూడా పంపరు. కానీ, ఈ 3 జీవోల విషయంలో ఏ ఒక్కదానికీ ఇలాంటి సర్టిఫైడ్ పత్రం లేదని తెలిసింది. పనులే పూర్తికానప్పుడు సర్టిఫైడ్ పత్రాలు ఎలా వస్తాయి? దీంతో... అతి కీలకమైన నిబంధనను ఉల్లంఘించామనే భయం మొదలైంది. దీనికి తోడు అడ్డగోలు జీవోల సంగతి 'ఆంధ్రజ్యోతి' కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో హుటాహుటిన ఆ 3 జీవోలను వెనక్కి తీసేసుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 30 మార్చి 2024



యాపిల్ 16లో ర్యామ్, స్టోరేజీ పెంపు!

యాపిల్ ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ సామర్థ్యాన్ని పెంచుతున్నట్టు సమాచారం. తద్వారా ఏఐ ఫీచర్లను అందుకునేలా ఐఫోన్ 16ని సన్నద్ధం చేస్తోంది. పిక్సెల్ 8 ప్రొ, గెలాక్సీ ఎస్24లో మాదిరిగా ఐఫోన్16లో కూడా ఆ రెంటి పెంపు ఉంటుందని అంటున్నారు. ఇప్పటికి ఐఫోన్ 15ప్రొ లో 8జీబీ ర్యామ్ ఉంది. అదే ఐఫోన్ 15, ఐఫోన్ 15 ప్లస్ విషయానికి వస్తే ర్యామ్ 6జీబీ మాత్రమే. 'టెక్ రెవ్' ప్రకారం త్వరలో విడుదలకానున్న ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ పెరగనున్నాయి. ఈ పెరుగుదల కొద్దిగా ఎక్కువగా ఉండొచ్చు. ఎన్ఏఎన్‌డి ఫ్లాష్ ఆధారిత స్టోరేజీని యాపిల్ మాత్రమే ఉపయోగిస్తోంది. ఆ కారణంగా స్టోరేజీ వేగం పెంపు దానికి పెద్ద విషయం కాదు. హార్డ్‌వేర్ పరిమితుల దృష్ట్యా పిక్సెల్ 8 యూజర్లు జెమినీ నానోపై డివైజ్‌ను రన్ చేయలేరని గూగుల్ ఇప్పటికే స్పష్టం చేసింది. అలాగే కొత్త సాంకేతికతపై యాపిల్ ఒక పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. దాని ప్రకారం ఫ్లాష్ మెమరీపై లార్జ్ లాంగ్వేజ్ మోడల్(ఎల్ఎల్ఎం)ని రన్ చేసే వీలు ఉంటుంది. అదే ఐఫోన్‌లో చూడగలుగుతాం. అంతేకాకుండా టిమ్ కుక్ సైతం తాము ఏఐ ఫీచర్లపై పనిచేస్తున్నట్టు కూడా తెలిపారు. వీటన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తే ఐఫోన్ 16లో ర్యామ్, స్టోరేజీ పెంపుపై వస్తున్న పుకార్లను ఒకింత నమ్మాల్సి వస్తోంది.



అద్భుతంగా ఉపకరించే యాప్


'వీక్ ప్లాన్'


పనులు ఉండటం వేరు, వాటిని సమయానికి పూర్తి చేయడం వేరు. అనుకున్న పనులను సమర్థంగా పూర్తి చేసుకునేందుకు ఉపయోగపడేది 'వీక్ ప్లాన్ యాప్'. ఆరోగ్యకరమైన పని వాతావరణానికి ఉపకరించేలా ఈ యాప్ ఉంటుంది. దీని సహకారంతో స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను పెట్టుకోవచ్చు. వాస్తవానికి ఇదో ప్రొడక్టివిటీ టూల్ అని కూడా చెప్పవచ్చు. చేపట్టాల్సిన టాస్కుల్లో వేటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నది దీంతో సులువుగా ఎంపిక చేసుకోవచ్చు. అందుకోసం హెచ్ఐటీ - హై ఇంపాక్ట్ టాస్క్‌లను సెట్ చేసుకోవచ్చు. తద్వారా వాటిని ఫలవంతంగా నెరవేర్చుకునే వెసులుబాటు ఉంటుంది.

ఈ యాప్‌లో పొమొడొరో టైమర్ ఉంటుంది. దీంతో 25 నిమిషాలకు టైమర్‌ను సెట్ చేసుకోవచ్చు. సదరు పని కచ్చితంగా పూర్తయ్యేలా ఫోకస్ పెట్టేందుకు తోడ్పడుతుంది. అయిదు నిమిషాల బ్రేక్, రిఫ్రెష్ మళ్లీ పని ఆరంభించడం అంటూ అంతా ఒక పద్ధతిగా సాగేందుకు వీలుకల్పిస్తుంది. టార్గెట్ల నిర్దేశం, వర్క్‌ఫ్లో డిజైన్, మైల్‌స్టోన్స్ జతచేయడం, టాస్క్, బెస్ట్ గోల్స్ డిజైన్ చేయడంలో ఇందులోని ప్రొడక్టివిటీ టూల్ ఉపయోగపడుతుంది. షెడ్యూలింగ్, టైమ్ ట్రాకింగ్, టాస్క్ మేనేజ్‌మెంట్ వంటివన్నీ ఎఫెక్టివ్‌గా జరిగేందుకు తోడ్పడుతుంది. ముఖ్యంగా స్ట్రెస్, బర్నౌట్ పరిస్థితుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

యూట్యూబ్ మ్యూజిక్ సెర్చ్

కూనిరాగం తీస్తే పాట వెతుకుతుంది






కాలానుగుణంగా, ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు తప్పవు. అందులో ముందుండే యూట్యూబ్ మ్యూజిక్ తాజాగా 'హమ్ టు సెర్చ్' ఫీచర్‌ను జతచేసింది. ఉదాహరణకు పాటలో లిరిక్స్ వెంటనే గుర్తుకురాకపోతే ఏం చేయాలన్నది ప్రశ్న. అయితే అందులో ఒకటో రెండు ముక్కలు గుర్తుంటాయి. యూట్యూబ్ తాజాగా అందించిన ఈ ఫీచర్ ప్రకారం సదరు పాటలోని చిన్న భాగాన్ని మూడు సెకండ్ల సేపు హమ్ చేయగలిగితే చాలు, మెలోడికి అనుగుణంగా అసలు సాంగ్‌ను యూట్యూబ్ లైబ్రరీలో వెతికి పట్టుకుంటుంది.

ఆండ్రాయిడ్ ఫోనుల్లోని యూట్యూబ్ మ్యూజిక్ యాప్‌లోకి ఈ ఫీచర్‌ను తీసుకొచ్చే యత్నంలో కంపెనీ ఉంది. కేవలం మూడు సెకండ్ల సేపు హమ్, పాడటం లేదంటే ట్యూన్‌లో చిన్న ముక్కను రికార్డు చేయగలిగినా ఒరిజినల్ సాంగ్‌ను పట్టుకుంటుంది. యూట్యూబ్ స్మార్ట్ టెక్నాలజీ ఇందుకోసం ఉపయోగపడుతుంది. ఇందుకోసం...

- స్మార్ట్‌ఫోన్‌లో యూట్యూబ్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- సెర్చ్ ఐకాన్‌ని టాప్ చేయాలి. అక్కడే మైక్రోఫోన్ ఐకాన్ ఉంటుంది. దాన్ని టాప్ చేసి హమ్ టు సెర్చ్ ఫీచర్‌ని టర్న్ చేయాలి.
- మైక్రోఫోన్‌ని ఈ ఫీచర్ కోసం యూట్యూబ్ ఉపయోగించేందుకు అనుమతించాలి.
- కావాలనుకుంటున్న పాటలోని కొన్ని పదాలను హమ్ చేయాలి.
- ఆడియో ఇన్‌పుట్‌ని ఉపయోగించి యూట్యూబ్ పాటను వెతుకుతుంది.
- సంతృప్తి చెందితే టాప్ చేసి పాట వినొచ్చు. ఫలితంతో సంతృప్తి చెందకుంటే మళ్లీ హమ్ చేసి, వెతకాలి.

అప్‌డేట్

స్పాటిఫై నుంచి ఈ లెర్నింగ్



స్పాటిఫై తాజాగా వీడియో ఆధారిత ఈ లెర్నింగ్ కోర్సులకు శ్రీకారం చుట్టింది. వీటిని ఇప్పటికి యూకేలో అందిస్తోంది. ఇందులో మ్యూజిక్, బిజినెస్, క్రియేటివిటీ వంటి కోర్సులు ఉన్నాయి. మ్యూజిక్, పాడ్‌కాస్ట్‌కు అదనంగా ఈ ఫీచర్‌ను కూడా జతచేసింది. స్పాటిఫై ప్రీమియమ్ ప్లాన్ కింద వీడియో కోర్సులు ఉంటాయి. నెలవారి చందా కట్టి యూజర్లు ఈ కోర్సుల్లో చేరవచ్చు. 'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం క్రియేటివిటీకి సంబంధించి పలు టాపిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసి మరీ స్పాటిఫై వీటిని అందిస్తోంది.

బీబీసీ మేస్ట్రో, స్కిల్‌షేర్, థింక్‌ఫిక్ వంటి కంపెనీలతో ఈ కోర్సుల కోసం ఒప్పందం చేసుకుంది. అలాగే కోర్సులో భాగంగా రెండు వీడియోలను ఉచితంగా అందిస్తోంది. తద్వారా యూజర్లను ఆకట్టుకోవడమే కాదు, చందాదారులుగా మారేలా ప్రయత్నిస్తోంది. యూకేలోని యూజర్లు యాప్ అలాగే వెబ్ బ్రౌజర్ ద్వారా ఈ కోర్సులను అందుకోవచ్చు. ప్రస్తుతానికి ఈ కోర్సులను తానుగా ఆఫర్ చేస్తోంది. అయితే భాగస్వామ్య సంస్థలు అందిస్తున్న రియల్ కోర్సుల విషయంలో డిస్కౌంట్ ఏమైనా పొందే అవకాశం ఉందా అన్నది మాత్రం తెలియరాలేదు.

వెకేషన్స్, షాపింగ్స్ కోసం

గూగుల్ ఎస్‌జీఈ



నిత్యం మనం చేసుకునే పనుల్లో సహాయపడేందుకు గూగుల్‌కు చెందిన కొత్త ఏఐ టూల్స్ ఉపయోగపడనున్నాయి. సెలవులకు ప్లానింగ్ లేదంటే షాపింగ్ విషయంలో పర్సనలైజ్డ్ సహకారం అందించనుంది - గూగుల్‌కు చెందిన ఎస్‌జీఈ. ఏఐతో పనిచేసే ఈ ఫీచర్ పూర్తి రూపం సెర్చ్ జనరేటివ్ ఎక్స్‌పీరియెన్స్. ప్రస్తుతానికి ఇది అమెరికాలో అందుబాటులో ఉంది. అది అందించే టూర్ ప్లాన్‌తో సంతృప్తి చెందితో చాలు అది జీమెయిల్, డాక్స్ లేదా మేప్స్ యాక్సెస్‌ను అందుకుంటుందని 'టెక్‌క్రంచ్' ఒక నివేదికలో పేర్కొంది. గూగుల్‌తో కొనుగోలు చేసే ఆప్షన్ మాత్రం లేదు. అయినప్పటికీ అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. గూగుల్ మ్యాప్స్‌తో తగు సహకారం పొందవచ్చు. ట్రావెల్ ప్లానింగ్‌కు తోడు షాపింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను సైతం పెంపొందిస్తుంది. అపారెల్ నుంచి యాక్సెసరీల వరకు పర్సనలైజ్డ్ సలహాలను ఇస్తుంది. యూజర్ తన ఆలోచనలు, ప్రాధాన్యాలకు అనుగుణంగా షాపింగ్ చేసుకోవచ్చు.

గూగుల్ మెసేజెస్‌లో ఇమేజ్ ప్రివ్యూ సీన్




గూగుల్ మెసేజ్ యూజర్లు త్వరలో ఇమేజ్ ప్రివ్యూ సీన్‌ను పొందనున్నారు. షేర్ చేయదల్చుకున్న ఇమేజ్‌ని సెలెక్ట్ చేసినప్పుడు ఈ వెసులుబాటు లభిస్తుంది. ఇమేజ్ షేరింగ్ ఇంటర్‌ఫేస్‌కు ఇంప్రూవ్‌మెంట్స్ చేస్తున్న నేపథ్యంలో ఈ ప్రయోజనం లభించనుంది. ప్రస్తుతం అందిస్తున్న రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్‌కు చెందిన మెసేజింగ్ సర్వీస్ - స్మార్ట్ ఫోన్ కెమెరా బంధించిన మల్టిపుల్ ఇమేజెస్‌ను కలుపుకోలేదు. ఒకదాని తరవాత ఒకటి కలుపుకొంటూ యూజర్లు వెళ్లాలి. కొత్త వెసులుబాటుతో యాడ్ ఆన్ ఆప్షన్ లభిస్తుంది. పలు ఫొటోలను పంపుకొనే వీలూ ఉంటుంది. సరికొత్త ప్రివ్యూ స్క్రీన్‌లో రెండు ఫీచర్లు ఉంటాయి. అలాగే ఒకటి తొలగిపోతుంది. గ్యాలరీ లేదా ఫోల్డర్ నుంచి వర్క్‌ఫ్లోలో మార్పు ఏమీ ఉండదు. యాప్ ఉపయోగించి ఫొటోలను బంధించే విషయంలోనే మెరుగుదల అంతా జరిగింది. ఇన్ యాప్ కెమెరాను ఆఫర్ చేస్తోంది. పిక్చర్‌ని క్లిక్ చేసే సమయంలో యూజర్లు యాప్‌ని విడిచి పెట్టాల్సిన అవసరం ఉండదు. చాటింగ్ సమయంలోనూ కెమెరా, గేలరీని టాప్ చేయవచ్చు. అది కూడా ఇటీవల తీసిన, తీసుకున్న పిక్చర్లను చూపిస్తుంది. అదేవిధంగా క్యాప్చర్ బటన్‌ని టాప్ చేసి వేగంగా ఫొటోలు తీసుకునేందుకు కెమెరా విండో అనుమతిస్తుంది. మినీ విండోను మాత్రం విస్తరించే వీలు మాత్రం ఉండదు.

వాట్సాప్

అందుబాటులోకి మరిన్ని ఫీచర్లు!





వాట్సాప్ యూజర్ల సౌలభ్యం కోసం కొత్తగా కొన్ని ఫీచర్లను తీసుకువస్తోంది. గ్రూప్ ఈవెంట్స్ నుంచి మీడియా అప్‌లోడ్ క్వాలిటీలో మెరుగుదల వరకు వీటిలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం. 'ఆండ్రాయిడ్ అథారిటీ' రిపోర్ట్ ప్రకారం అయిదు ఫీచర్లపై వాట్సాప్ పనిచేస్తోంది. గ్రూప్ ఈవెంట్స్, డిఫాల్ట్ మీడియా అప్‌లోడ్ క్వాలిటీ సెట్టింగ్స్, ఫార్వార్డ్ అండ్ రివైండ్ వీడియోస్, స్టేటస్ అప్డేట్స్, కంపోజర్, ప్రైవసీ ఫీచర్స్ ఫర్ అవతార్ వాటిలో ఉన్నాయి. అవి వరుసగా....

- గూగుల్ క్యాలండర్‌లో మీటింగ్ షెడ్యూల్స్ మాదిరిగా గ్రూప్ ఈవెంట్స్ ఫీచర్ ఉంటుంది. వాయిస్, వీడియో కాల్స్ నుంచి ఈవెంట్స్‌ను క్రియేట్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని సమాచారం. కాల్‌లో చేరేందుకు వీలుగా ఈవెంట్ లింక్‌ను షెడ్యూల్ చేసుకోవచ్చు. టైటిల్స్, డిస్క్రిప్షన్స్, డేట్స్, లొకేషన్స్ వంటి వాటిని గ్రూప్ ఈవెంట్ యూజర్లు కలుపుకోవచ్చు.
- డిఫాల్ట్ మీడియా అప్‌లోడ్ క్వాలిటీకి కూడా అవకాశం ఉంది. దీంతో హెచ్‌డీ క్వాలిటీ ఇమేజ్‌లు, వీడియోలను యూజర్లు పంపుకోవచ్చు. డబ్ల్యుఏబేటా ఇన్ఫో ఈ ఫీచర్‌ను గుర్తించింది. బేటా టెస్టర్లకు ఇది ప్రస్తుతం అందుబాటులో ఉంది.
- అవతార్స్‌కు సంబంధించి ప్రైవసీ ఫీచర్ మరొకటి. దీంతో యూజర్లు తమ అవతార్‌ను స్టిక్కర్‌గాఉపయోగించుకునే విషయంలో కంట్రోల్‌ని ఉంచుకోవచ్చు. మై కాంటాక్ట్స్, సెలెక్టెడ్ కాంటాక్ట్స్, నోబడి నుంచి యూజర్ తనకు ఇష్టమైనది ఎంచుకోవచ్చు.
- వీడియోల ఫార్వార్డ్ -రివైండ్ ఫీచర్‌ని ఐఓఎస్ యూజర్లకు విడుదల చేస్తోంది. స్మార్ట్‌ఫోన్‌పై డబుల్ క్లిక్‌తో ఈ పనిచేయవచ్చు. కెమెరా ఐకాన్‌ను ప్రెస్ చేసి, చాలా త్వరగా వీడియోలను రికార్డు చేసి పంపుకోవచ్చు.
- సరికొత్త స్టాటస్ కంపోజర్‌ని కూడా పరిచయం చేస్తోంది. కంపోజ్ టెక్స్ట్, వీడియో, ఫొటోని యూజర్లు సెలెక్ట్ చేసుకోవచ్చు.

మల్టిపుల్ మెసేజ్‌లను పిన్ చేయవచ్చు

వాట్సాప్ ఇటీవల మెసేజ్ పిన్నింగ్ ఫీచర్‌ను అప్డేట్ చేసింది. సంభాషణలో మూడు మెసేజ్‌లను పిన్ చేసుకునే సౌలభ్యం దీంతో ఉంటుంది. యాప్ బేటా వెర్షన్‌లో గత వారం ఈ అప్డేట్ కనిపించింది. ఈ సదుపాయంతో యూజర్లు మీడియా, వాయిస్ నోట్స్, ఎమోజీలను పిన్ చేయవచ్చు. వ్యక్తిగత, గ్రూప్ చాట్స్‌లో ఈ సదుపాయం ఉంటుంది. డిఫాల్ట్‌గా ఏడు రోజుల వరకు పిన్ చేసే అవకాశం ఉంటుంది. అయితే ఇరవై నాలుగు గంటలు, వారం, నెల రోజులకు పిన్ చేయవచ్చు. దీనికోసం మొదట మెసేజ్‌పై లాంగ్ ప్రెస్ ఆపై టాప్ చేయాలి. డ్రాప్-డౌన్ మెనూలో పిన్‌పై క్లిక్ చేస్తే చాలు, పని పూర్తవుతుంది. అలాగే అన్‌పిన్ కోసం త్రీడాట్ మెనూలో 'అన్‌పిన్'ని సెలెక్ట్ చేసుకోవాలి. యాపిల్ డివైజ్‌లో రైట్ సైడ్ స్వైప్ చేస్తే పిన్ బటన్ కనిపిస్తుంది.



మేజికల్ ఏఐ

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పలు ప్రయోజనాలను అందిస్తోంది. అందులో ఒకటి మేజికల్ ఏఐ యాప్. టాస్క్‌ల ఆటోమేషన్ నుంచి ఈమెయిల్స్ అలాగే టెక్స్ట్‌లకు సమాధానం ఇవ్వడంలో స్మార్ట్ సలహాలను ఈ యాప్ అందిస్తుంది. మాన్యువల్‌గా డేటా ఎంట్రీ, ఒకటే పనిని పదేపదే చేయాల్సి రావడంతో విసుగెత్తిన వ్యక్తులకు ఈ మేజికల్ యాప్ ఉపయోగపడుతుంది. విద్య, వైద్య తదితర కార్యకలాపాల్లో దీన్ని ఇంటిగ్రేట్ చేయవచ్చు. జీపీటీ-4 పవర్‌తో ఇది యూజర్ అభీష్టం మేరకు పనిచేస్తుంది. వారంలో సగటున ఏడు గంటల సమయాన్ని ఆదాచేస్తుందని ఈ యాప్ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ఈ యాప్ ప్రధానంగా...

- రైటింగ్ పనులు ఆటోమేటిక్‌గా జరిగేలా తోడ్పడుతుంది. వన్ టు వన్ లేదా గ్రూప్ చాట్ సంభాషణల్లో సహకారం అందిస్తుంది. ఈమెయిల్స్‌కు సమాధానం ఇవ్వడంలోనూ సహకరిస్తుంది.
- ఆటోఫిల్ ఫీచర్ దీంతో వస్తోంది. పేరు, ఈమెయిల్ వంటివి ఒక క్లిక్‌లో పూర్తి చేస్తుంది. యూజర్ ప్రాంప్ట్ దీనికి అక్కర్లేదు.
- ప్రి రిటెన్ టెంప్లేట్స్‌ను అందిస్తుంది. యూజర్ ప్రిఫరెన్స్‌ను బట్టి కస్టమైజేషన్ సౌలభ్యం కూడా ఉంటుంది. కాపీ, పేస్ట్ పనిని పూర్తిగా తొలగించింది.
- ఈ యాప్‌లో ఏఐ అసిస్టెంట్ ఫీచర్ ఉంది. స్క్రాచ్ నుంచి ఈమెయిల్స్ సృష్టితో మొదలుపెట్టి మెసేజెస్, నోట్స్, రైటింగ్ ప్రాసెస్ సరళీకరణ, మానవులు చేసే తప్పుల ఉపసంహరణ వరకు పలు పనులను నిర్వర్తించేందుకు ఈ ఏఐ అసిస్టెంట్ సహకరిస్తుంది.



ఐఫోన్ యూజర్లకు అలెర్ట్



పాస్‌వర్డ్ రీసెట్ పేరిట మోసాలు

అడ్వాన్స్‌డ్ ఫిషింగ్ అటాక్‌కు ఇప్పుడు యాపిల్ యూజర్లు టార్గెట్ అయ్యారు. యాపిల్ పాస్‌వర్డ్ రీసెట్ పేరుతో ఇబ్బంది పొంచి ఉంది. యాపిల్ ఐడీ పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలని కోరుతూ వచ్చే అభ్యర్థన రూపంలో వ్యవహారం సాగుతోంది. యూజర్ దానికి ఆమోదం తెలిపితే అటాక్‌కు అవకాశం కలుగుతుంది. ఐఫోన్, యాపిల్ వాచ్, సిస్టమ్ స్థాయిలో మేక్‌లో టార్గెట్ చేసుకుని ఈ పనికి పాల్పడుతున్నారు. యాక్సెప్ట్ బటన్‌ను క్లిక్ చేయడం ద్వారా ఇది ఎంటర్ అవుతోంది. అలా యూజర్‌ని అకౌంట్‌కు యాక్సెస్ కాకుండా చేస్తోందని కెర్బాన్ సెక్యూరిటీ పేర్కొంది. ఆమోదం తెలపకుంటే, యాపిల్ ప్రతినిధులమని చెప్పి బలవంతం చేస్తుండటం ఈ అటాక్‌లో మరో కోణం. ఒన్ టైమ్ పాస్‌వర్డ్ చెప్పాలంటూ ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. యాపిల్ ఐడీతో జతపడి ఉన్న ఈమెయిల్ అడ్రస్, ఫోన్ నంబర్ యాక్సెస్ పొందే యత్నం జరుగుతోంది. యాపిల్ సిస్టమ్‌లో ఉన్న బగ్‌ను ఉపయోగించుకుని పదేపదే అటాకర్లు ప్రయత్నిస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో పాస్‌వర్డ్ చేంజ్ అభ్యర్థనలను యాపిల్ డివైజ్ యూజర్లు లేదా ఓనర్లు మన్నించకపోవడమే ఉత్తమం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇన్ఫో

ఫోన్ వేగం తగ్గిందా! ఇలా చేయండి



ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ పనితీరు మందగించింది. అంతమాత్రాన కొత్త ఫోన్ కోసం మార్కెట్‌కు బయలుదేరాల్సిన పని లేదు. అందులో ఉన్న వృథాను బైటకు పంపితే ఫోన్ మళ్లీ వేగంగానే పనిచేస్తుంది. అయితే అందుకు కొన్ని పద్ధతులను అనుసరించాలి. ఫోన్ కెచే, క్రోమ్ వంటి తాత్కాలిక యాప్‌తో ఫోన్ నిండి ఉండొచ్చు. నిజానికి అవి బరువును పెంచుతాయి. కెచే ప్రధానంగా ఫోన్ వేగానికి సంబంధించినది. ఉన్న బరువును తగ్గిస్తే లోడ్ తగ్గి పర్ఫార్మెన్స్ మెరుగుపడుతుంది. చిన్న ఫైల్స్ చాలా వేగంగా జతపడతాయి. అవే స్టోరేజీని, ర్యామ్ తినేస్తాయి. ఆండ్రాయిడ్‌లో కూడా పాత మోడల్ ఫోన్లతో అదే ఇబ్బంది తలెత్తుతుంది. ఈ సమస్యకు ఆటోమేటిక్ పరిష్కారం కోసం సీక్లీనర్, ఎస్‌డీ మెయిడ్2 వంటి యాప్‌లు బాగా ఉపయోగపడతాయి. జంక్ ఫైల్స్, కెచే డేటా తదితరాలను గుర్తించి అవి క్లీన్ చేయగలుగుతాయి. అలాగే కొన్ని పేమెంట్‌తో ఇలాంటి సేవలు అందిస్తాయి. నిజానికి అవి డబ్బుకట్టి అందుకోవలసిన సేవలే. క్రోమ్ చాలా ఎక్కువగా స్పేస్ తింటుంది. దాన్ని ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలి. అందుకుగాను క్రోమ్ ఓపెన్ చేయాలి. హిస్టరీలోకి వెళ్లాలి. క్లియర్ బ్రౌజింగ్ డేటాను సెలెక్ట్ చేసుకోవాలి. కేచ్డ్ ఇమేజెస్, ఫైల్స్ ఆప్షన్‌ను ఎంచుకుంటే చాలు, పనవుతుంది. రెగ్యులర్‌గా కెచే క్లీనింగ్ చేసుకుంటే చాలు, ఫోన్ నిజానికి ఊపిరి పీల్చుకుంటుంది. అనవసరమైన అప్‌గ్రేడ్‌లతోనూ ఇబ్బందులు తప్పుతాయి. స్మార్ట్‌ఫోన్ అనేది చక్కగా పనిచేసుకునేలా పెట్టుకోవడంలోనే యూజర్ పనితనం ఉంటుంది మరి.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 30 మార్చి 2024

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్)- మేడ్చల్ జిల్లా మల్కాజిగిరిలోని ఎదులాబాద్-ఘట్‌కేసర్‌లో నిర్వహిస్తున్న ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో ఆరోతరగతి ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇది రాష్ట్ర స్థాయిలో ఉన్న కో-ఎడ్యుకేషన్ గురుకుల పాఠశాల. ఇందులో అకడమిక్ సిలబస్‌తో పాటు ఫైన్‌ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. విద్యార్థులు ఏవైనా రెండు 'ఫైన్ ఆర్ట్స్ విభాగాలు' ఎంచుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 75 శాతం, ఎస్సీ-సీసీ అభ్యర్థులకు 2 శాతం, ఎస్టీ వర్గాలవారికి 6 శాతం, బీసీ అభ్యర్థులకు 12 శాతం, మైనారిటీలకు 3 శాతం, జనరల్ అండ్ ఈబీసీ అభ్యర్థులకు 2 శాతం సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థులకు బోధన, వసతి, పరీక్ష ఫీజు ఉచితం. అవసరమైన డ్రెస్‌లు, బుక్స్, మెడికల్ కేర్ అందిస్తారు.



తెలంగాణ ఫైన్ ఆర్ట్స్ గురుకుల ఎంట్రెన్స్ టెస్ట్

ఫైన్ ఆర్ట్స్ విభాగాలు

- **క్లాసికల్ మ్యూజిక్-ఓకల్:** కర్ణాటిక్ మ్యూజిక్, హిందుస్థానీ మ్యూజిక్
- **ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్:** వీణ, వయొలిన్ - కర్ణాటిక్, మృదంగం, తబలా, కీబోర్డు, గిటార్, ఫ్లూట్
- **డ్యాన్స్:** కూచిపూడి, కథక్
- థియేటర్ ఆర్ట్స్ • పెయింటింగ్ అండ్ డ్రాయింగ్

అర్హత: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గుర్తింపు పాఠశాలల నుంచి అయిదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన/పరీక్షలు రాసే బాలబాలికలు అప్లయ్ చేసుకోవచ్చు. తెలుగు మీడియం అభ్యర్థులు కూడా అర్హులే. విద్యార్థుల వయసు 2024 మే 1 నాటికి పన్నెండేళ్ల లోపు ఉండాలి. కుటుంబ వార్షిక దాయం పట్టణాల్లో రూ.2,00,000, పల్లెల్లో రూ.1,50,000 మించకూడదు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో రెండు స్ర్కీనింగ్ టెస్ట్‌లు ఉంటాయి. మొదటిది టీఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్ఏఎస్ సెట్, రెండోది ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్. ఒక్కోదానికి 100 మార్కులు నిర్దేశించారు.
- **టీఎస్‌డబ్ల్యూఆర్ఎఫ్ఏఎస్ సెట్:** ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో ఇంగ్లీష్, తెలుగు, మేథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ, ఎన్విరాన్‌మెంటల్/జనరల్ సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అయిదో తరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 35 మార్కులు రావాలి. వీరిని మాత్రమే స్కిల్ టెస్ట్‌కు అనుమతిస్తారు.
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్:** ఎంచుకొన్న విభాగానికి ప్రత్యేకించిన అంశాల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తారు. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. విద్యార్థులు ఎటువంటి మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ తీసుకురానవసరం లేదు.
- పెయింటింగ్, డ్రాయింగ్ పరీక్షల కోసం పెన్సిల్, ఎరేజర్, కలర్ పెన్సిల్స్, క్రేయాన్స్ తెచ్చుకోవచ్చు. డ్యాన్స్ టెస్ట్ కోసం ఎగ్జామినర్ సమక్షంలో ఒక పాటను ప్లే చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 26 నుంచి
- **'టీఎస్‌డబ్ల్యూఆర్-ఎఫ్ఏఎస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024' తేదీ:** మే 5
- **ఫైన్ ఆర్ట్స్ స్కిల్ టెస్ట్ తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** tswrsplschools.cgg.gov.in

జేవియర్ ఇన్‌స్టిట్యూట్‌లో పీజీడీఎం

బెంగళూరులోని జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎక్స్ఐఎంఈ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం)-బిజినెస్ అనలిటిక్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ట్రైమెస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. మొత్తం 570 సీట్లు ఉన్నాయి. పీజీడీఎం ప్రోగ్రామ్‌నకు సంబంధించి చెన్నై క్యాంపస్‌లో 150, బెంగళూరు క్యాంపస్‌లో 240, కొచ్చి క్యాంపస్‌లో 120 సీట్లు; పీజీడీఎంబీఏ ప్రోగ్రామ్‌నకు సంబంధించి బెంగళూరు క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

స్పెషలైజేషన్‌లు

- పీజీడీఎం ప్రోగ్రామ్‌లో మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆపరేషన్స్, ఐటీ అండ్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.
- పీజీడీఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రం బిజినెస్ అనలిటిక్స్‌కు సంబంధించి ఉంటుంది.

ప్రోగ్రామ్‌ల వివరాలు: మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ విభాగాలకు సంబంధించిన ఫౌండేషన్ కోర్సులు; రెండో ఏడాది కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఇంటిగ్రేటివ్ కోర్సులు ఉంటాయి. వీటితోపాటు ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్, మూడు వారాల వ్యవధి గల ప్రొడక్టివ్ యాక్టివిటీ ఆధారిత వింటర్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాల్సి ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు నాటికి మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. బ్యాక్‌లాగ్స్ ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

ఎంపిక: ఎక్స్ఏటీ/క్యాట్/సీమ్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్‌నకు 35 శాతం; పదోతరగతి, ఇంటర్, డిగ్రీ/పీజీ మార్కులకు 13 శాతం; గ్రూప్ డిస్కషన్స్/ఇంటర్వ్యూకి 40 శాతం; స్పోర్ట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్, అకడమిక్ డైవర్సిటీ, జెండర్ డైవర్సిటీలకు 12 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** https://xime.org

నైసర్‌లో సమ్మర్ ప్రాజెక్ట్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కి చెందిన స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్(ఎస్‌పీఎస్)- సమ్మర్ ప్రాజెక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇందులో భాగంగా ఫిజిక్స్ విభాగానికి సంబంధించి రెగ్యులర్ ప్రాజెక్ట్ వర్క్‌లు, యాక్టివిటీస్, సెమినార్లు, రీసెర్చ్ వర్క్‌లు సహా వివిధ రీసెర్చ్ ల్యాబొరేటరీల సందర్శన, నైట్ స్కై అబ్జర్వేషన్ తదితరాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్ మే 21 నుంచి ప్రారంభమౌతుంది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ/ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వసతి సౌకర్యం ఉంది. సమ్మర్ ప్రాజెక్ట్ ఫండింగ్ సదుపాయంలేని అభ్యర్థులకు నెలకు రూ.5000ల స్టయిపెండ్‌తోపాటు స్లీపర్ క్లాస్ రైల్వే ఫేర్/బస్ ఫేర్ చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మే 21 నుంచి జూలై 23 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 21
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే రెండో వారంలో
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

ఆర్‌సీబీలో ఎంఎస్-పీహెచ్‌డీ



కేంద్ర ప్రభుత్వానికి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)-ఎంఎస్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదు నుంచి ఏడేళ్ల వరకు ఉంటుంది. సెమిస్టర్ విధానాన్ని అనుసరిస్తారు. లైఫ్ సైన్సెస్, మోడ్రన్ బయోటెక్నాలజీ అంశాలకు సంబంధించిన ల్యాబొరేటరీ ట్రెయినింగ్‌లతో కోర్సును రూపొందించారు. మొదటి ఏడాది ల్యాబొరేటరీ ప్రయోగాలతో క్లాస్ రూం టీచింగ్ ఉంటుంది. రెండో ఏడాది రీసెర్చ్ ల్యాబొరేటరీలో వర్క్ చేయాల్సి ఉంటుంది. మాస్టర్స్ డిజర్టేషన్ కూడా సబ్మిట్ చేయాలి. అభ్యర్థి ప్రతిభను పరిశీలించి పీహెచ్‌డీ థీసిస్ వర్క్, రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. మొదటి రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. నిర్దేశిత రుసుం చెల్లించి భోజన, వసతి సౌకర్యాలు పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్, ఇంజనీరింగ్, మెడిసిన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్ బీ) వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: గ్యాట్ బీ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశాల్లో అభ్యర్థి అవగాహన, ఆసక్తి, అచీవ్‌మెంట్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్ ఇస్తారు.

ఫెలోషిప్: ఎంపికైన అభ్యర్థులందరికీ ఆర్‌సీబీ రామచంద్రన్ డీబీటీ ఫెలోషిప్ ఇస్తారు. దీని కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000 చెల్లిస్తారు. తరవాత అభ్యర్థులు సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/డీబీటీ నుంచి జూనియర్/సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందాల్సి ఉంటుంది. జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.37,000; ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.42,000 చెల్లిస్తారు. విదేశీ అభ్యర్థులకు మాత్రం నిబంధనల ప్రకారం ఆర్‌సీబీ డీబీటీ ఇంటర్నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, విదేశీ విద్యార్థులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** rcb.res.in

హైదరాబాద్ ఐఎంటీలో లాజిస్టిక్స్‌లో పీజీడీఎం

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ(ఐఎంటీ) - కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీఐఐ)తో కలిసి లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్‌లో పీజీడీఎం అందిస్తోంది. ఇది రెండేళ్ల పూర్తికాలిక రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్ ఇండస్ట్రీకి ప్రొఫెషనల్స్‌ను అందించేందుకు ఈ కోర్సును ఆరంభించారు. ఫోకస్డ్ కరికులమ్, గెస్ట్ లెక్చర్స్, ఇండస్ట్రీ విజిట్స్, ఇంటర్న్‌షిప్స్, మేనేజ్‌మెంట్స్ ప్రాజెక్టుల సమాహారంగా కోర్సు ఉంటుంది. 2004లో ఆరంభించిన ద సీఐఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్ కూడా ఈ కోర్సు రూపకల్పన తదితర వ్యవహారాల్లో పాలుపంచుకుంటోంది.

న్యూస్: ఐఐటీ మద్రాస్‌లో బీఎస్

ఐఐటీ మద్రాస్ బీఎస్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్, బీఎస్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ కోర్సులను అందిస్తోంది. కోర్సు కాలవ్యవధి నాలుగేళ్లు కాగా భారత దేశంలో ఎక్కడి నుంచైనా వీటిని చేసే అవకాశం ఉంది. అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతో పాటు వీటిని చేయవచ్చు. ఆర్థికంగా వెనుకబడిన వారికి 75 శాతం వరకు ఉపకార వేతనం కూడా మంజూరు చేస్తారు. అడ్మిషన్ కోసం గత ఏడాది జరిగిన లేదా ఈ సంవత్సరం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించాలి. లేదంటే స్వీయ నియంత్రణ అర్హత ప్రక్రియ ద్వారానూ కోర్సులో చేరవచ్చు. అంటే సంస్థ నిర్వహించే క్వాలిఫయిర్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలి. తదుపరి బ్యాచ్ కోసం మే 26లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అడ్మిషన్ ప్రక్రియ తదితర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్:
study.iitm.ac.in/ds,
//study.iitm.ac.in/es



జాబ్ కార్నర్: డిటీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు

ఢిల్లీలోని షహబాద్ దౌలత్‌పూర్‌లోని ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 158 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

విభాగాలవారీ ఖాళీలు

1. డిజైన్: 6
2. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్: 10
3. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 13
4. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్: 5
5. ఎకనామిక్స్(యూఎస్ఎంఈ): 4
6. మేనేజ్‌మెంట్(యూఎస్ఎంఈ): 27
7. బయోటెక్నాలజీ: 9
8. మెకానికల్ ఇంజనీరింగ్: 34
9. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: 50

అర్హత: సంబంధిత విభాగాల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, స్లెట్/ సెట్, యూజీసీ/ సీఎస్ఐఆర్/ ఐకార్/ జీప్యాట్/ గేట్/ ఐసీఎంఆర్/ నెట్ లెక్చరర్‌షి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు బోధన, పరిశోధన అనుభవం.

ఎంపిక: స్ర్కీనింగ్ టెస్ట్, ప్రెజెంటేషన్/ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.1,000. ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. దివ్యాంగులకు రుసుము నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 14

దరఖాస్తు హార్డ్‌కాపీ పోస్టులో పంపేందుకు చివరి తేదీ: ఏప్రిల్ 24

చిరునామా: రిక్రూట్‌మెంట్ బ్రాంచ్, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ, షహబాద్ దౌలత్‌పూర్, బవానా రోడ్, ఢిల్లీ.

వెబ్‌సైట్: http://www.dtu.ac.in/

ఫిజిక్స్ వాలా స్కాలర్‌షిప్

లీడింగ్ ఎడ్యుటెక్ కంపెనీ 'ఫిజిక్స్ వాలా' విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల కోసం రూ.50 లక్షల స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. దీనికోసం ప్రత్యేకించి ఇటీవల స్టడీ అబ్రాడ్ ఇనీషియేటివ్ - అకడ్‌ఫ్లైని ఆరంభించింది. అమెరికా, యూకే, కెనడాలోని వెయ్యి వరకు ఉన్న లీడింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీల్లో ఎంఎస్ కోర్సు చేస్తున్న భారతీయ విద్యార్థుల కోసం ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు. యూఎస్‌లోని ఈటీఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఈటీఎస్ - ఇండియాతో కూడా జనవరిలో ఫిజిక్స్ వాలా ఒప్పందం కుదుర్చుకుంది. జీఆర్ఈ, టోఫెల్ ఎగ్జామ్స్ ప్రిపరేషన్, విదేశీ వర్సిటీలో చదువులకు ఈటీఎస్ సహకరిస్తుందనే విషయం తెలిసిందే.

స్కాలర్‌షిప్ వివరాలకు వెబ్‌సైట్: www.acadfly.com.




ఖతర్నాక్ పిల్లులు

ఒక ఊరిలో రెండు పిల్లులుండేవి. ఆ పిల్లులు తెలివైనవి. ఆహారాన్ని దొంగతనం చేసేవి. కానీ ఎప్పుడూ బయట పడేవి కావు. అవి కొట్లాడుకోవటం ఎవరూ చూడలేదు. ఒక రోజు సాయంత్రం ఒక అవ్వ ఇంటికి వెళ్లాయి. అవ్వ మూడు రొట్టెలు కాల్చి పొయ్యి దగ్గర ప్లేట్‌లో పెట్టింది. రెండు పిల్లులు ఆ రొట్టెలను దొంగలించాయి. చెరో రొట్టె తీసుకున్నాయి. మూడో రొట్టె ఎవరు తీసుకోవాలో.. అర్థం కాలేదు. కొట్లాట ఎందుకని నల్లపిల్లి తన మిత్రుడు తెల్లపిల్లితో ఇలా అంది.. 'నీకు ఆకలి ఎక్కువ కదా. ఈ రొట్టె కూడా నువ్వే తిను. మనలో ఎవరం తింటే ఏం?' అన్నది. తెల్లపిల్లి సంతోషించింది. దారిలో పోతున్న ఓ కోతి ఈ రెండు పిల్లుల్ని చూసింది. 'మిత్రులారా.. మీకు పంచాయితి ఉంటే నేను తీర్పు ఇస్తా' అన్నది. అవసరం ఉన్నప్పుడు కచ్చితంగా వస్తామన్నది తెల్లపిల్లి. కోతి అక్కడే నిలబడింది. 'ఇక దయచేయచ్చు మీ ఇంటికి' అంటూ కోతితో అన్నది నల్లపిల్లి.




ఒక రోజు ఒక పెద్ద కొక్కు దొరికింది పిల్లులకు. ఆ కొక్కు ప్రాణం తీయకుండా వదిలేశాయి. కొన ఊపిరితో ఉండే కొక్కును ఒక సంచిలో తీసుకుని కోతి ఇంటికి వెళ్లాయి. చెట్టుమీద కోతి వెంటనే కిందికి దూకింది. 'తిండి విషయంలో మాకో గొడవ ఉంది' అంటూ పిల్లులు గట్టిగా అన్నాయి. 'ఆహా.. వీటికి కొట్లాట పెట్టొచ్చు. ఆహారం మనం తినొచ్చు' అనుకుంది. సంచిలోనుంచి తెల్లపిల్లి కొక్కును బయటకు వేసింది. కోతి బిత్తరపోయింది. 'మాకు సరిసమానంగా పంచు' అన్నది నల్లపిల్లి. 'మీ పంచాయితీ నాకొద్దు. నేను అసలే శాకాహారిని. ఈ గొడవ నాకెందుకు. నా దగ్గరకు ఎప్పుడూ రాకండి' అంటూ చిటారు కొమ్మకెళ్లి కోతి కూర్చుంది. రెండు పిల్లులు నవ్వుకుంటూ ఇంటికొచ్చాయి.

8 తేడాలను గుర్తించండి





సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 268

			8		5		4	
		9	6	1				
								9
	4						9	3
6		3				7		1
1	2						5	
7								
				3	4	5		
	6		1		8			

సుడోకు - 267 సమాధానం

1	4	6	8	9	2	5	7	3
2	9	3	7	1	5	8	6	4
5	8	7	3	6	4	9	2	1
4	5	8	2	7	6	1	3	9
9	6	2	4	3	1	7	8	5
7	3	1	9	5	8	6	4	2
3	2	9	5	8	7	4	1	6
8	1	4	6	2	9	3	5	7
6	7	5	1	4	3	2	9	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.